www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

వెల (Price) : Rs. 6.50

సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 223

గురువారం | 28-11-2019 | పేజీలు: 12 + 16

శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: విదియ రా. 5.59 తదుపరి తదియ; నక్షత్రం: జ్యేష్ఠ ఉ. 7.34 తదుపరి మూల; వర్జ్యం: శే. ఉ. 7.34, మ. 3.34-5.10; దుర్ము

హార్తం: ఉ. 10.13-10.57, మ. 2.38-3.23; అమృతఘడియలు: రా. 1.10-2.46; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.31; సూర్యాస్తమయం: 5.35

విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

మంత్రివర్గ సమావేశంలో సీఎం జగన్, మంత్రులు

నూరు శాతం రీయింబర్స్

అర్హత నిబంధనల్లో భారీ సడలింపులు

- 10 ఎకరాల మాగాణి, 20 ఎకరాల మెట్ట ఉన్న రైతులకూ వర్తింపు
- 2.5 లక్షల ఆదాయం ఉన్నా ఓకే
- విద్యా పథకాలకు ప్రత్యేక కార్డు
- డిసెంబరులో ప్రక్రియ పూర్తిచేసి జనవరి ఒకటి నుంచి మంజూరు
- ఆరోగ్యశ్రీ, రేషన్‌కూ కార్డుల జారీ
- వసతి దీవెన కింద రూ.15 వేలు
- విద్యార్థుల తల్లుల ఖాతాలో జమ
- కడప జిల్లాలో ఏర్పాటు కానున్న స్టీల్‌ప్లాంట్‌కోసం 3200 ఎకరాలు
- రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర మంత్రిమండలి కీలకమైన నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. అన్ని సామాజిక వర్గాలకూ ఎలాంటి మినహాయింపులు లేకుండా వందశాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని నిర్ణయించింది. దానికోసం ఆదాయ పరిమితిని అన్ని వర్గాలకు సమంచేస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. బుధవారం కేబినెట్ ముగిసిన అనంతరం ఈ నిర్ణయాలను సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పేర్ని నాని

మిగతా 9వ పేజీలో...

కార్డులిక ఇవ్వలేం

అంగన్‌వాడీ వర్కర్లకు బియ్యం ఇవ్వాలన్న సూచనకు జగన్ నో

కాపు మహిళలకు రూ.15 వేలు

త్వరలో తొలి విడత వారి ఖాతాలో

10

స్థానికానికి రెడీ

- జనవరి 10న నోటిఫికేషన్ విడుదల
- 'అమ్మఒడి' ఇవ్వగానే ఎన్నికలకు సన్నద్ధం కావాలి
- ఫిబ్రవరిలో పరిషత్, మార్చిలో పంచాయతీ ఎన్నికలు
- రాత్రి బస చేయని మంత్రులపై సీఎం అసంతృప్తి

300 కోట్లు ప్రయోగ ఖర్చు
100 కోట్లు రాకెట్ తయారీకి
200 కోట్లు కార్టోశాట్-3 తయారీకి

జయహో ఇస్రో

'విజయాశ్వం'తో మరో అద్భుతం

పీఎస్ఎల్వీ-సీ47 ప్రయోగం సక్సెస్

17 నిమిషాల్లోనే కక్ష్యలోకి కార్టోశాట్.. 13 విదేశీ ఉపగ్రహాలు కూడా

రెండు నెలల క్రితం ప్రతిష్ఠాత్మక చంద్రయాన్-2 వైఫల్యం మిగిల్చిన చేదు జ్ఞాపకాలు మరువక ముందే భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో భారీ ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఈ సారి విజయం సాధించి తీరాలన్న కసితో సంసిద్ధమైంది. కానీ.. ఏ మూలనో చిన్న అనుమానం.. ప్రయోగానికి ముందు ఉద్విగ్నత.. కార్టోశాట్ ఉపగ్రహాన్ని తీసుకుని పీఎస్ఎల్వీ-సీ47 బయల్దేరగానే తీవ్ర ఉత్కంఠ..! అయితే ఇస్రో 'విజయాశ్వం' పీఎస్ఎల్వీ అనుమానాలన్నీ పటాపంచలు చేస్తూ 17 నిమిషాల్లోనే కార్టోశాట్-3ని తీసుకెళ్లి కక్ష్యలో కూర్చోబెట్టింది. మరో అద్భుత విజయాన్ని ఇస్రో ఖాతాలో వేసింది.

11

రద్దయిన జీవోతో ఉత్తర్వులా?

- మీడియాపై జీవోలో దాని ప్రస్తావనా?
- రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసిన హైకోర్టు
- 2430 జీవోపై చీఫ్ జస్టిస్ విచారణ
- వివరణ కోరుతూ సీఎస్‌కు నోటీసులు

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గతంలో ప్రభుత్వాలు రద్దు చేసుకున్న జీవోను ప్రస్తావిస్తూ తాజా జీవో ఎలా జారీ చేశారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వంపై నిరాధార నిందారోపణలు ప్రచురించిన పత్రికలు, ప్రసారం చేసిన చానళ్లపై కేసులు పెట్టేందుకు వీలుగా ఆయా శాఖల కార్యదర్శులకు అధికారం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన 2430 జీవోలో 2007 నాటి ప్రభుత్వం రద్దు చేసుకున్న జీవోను ప్రస్తావించడం సరికాదని వ్యాఖ్యానించింది. కావాలనుకుంటే రద్దయిన జీవో ప్రస్తావన లేకుండా తాజా జీవో ఇచ్చుకోవచ్చని పేర్కొంది. అయినా రద్దయిన జీవోను తాజా జీవోలో ప్రస్తావించాల్సిన అవసరం ఏమొచ్చిందో వివరణ

మిగతా 2వ పేజీలో...

ప్రధాని మోదీని కలిసిన వైసీపీ ఎంపీ మాగుంట

9

ప్లాన్‌తో వస్తే సమస్యలన్నీ పరిశీలిస్తా!

వైసీపీ ఎంపీ మాగుంటకు ప్రధాని హామీ

10

సీపీఎస్‌పై మరో కమిటీ

- ఇప్పటికే నివేదికపై మంత్రుల కమిటీ
- వారికి సలహాల కోసం తాజాగా మరో కమిటీ
- తీవ్ర ఆందోళనలో ఉద్యోగ సంఘాలు
- ఇంకెంత కాలం సాగదీస్తారని నిలదీత
- 'రద్దు' హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్

అమరావతిని శ్మశానం అంటారా

భావి తరాల భవిష్యత్‌ను చంపేస్తారా?



- రాజధానిపై వ్యాఖ్యానించిన మంత్రిని బర్తరఫ్ చేయాలి
- నేడు అమరావతిలో పర్యటిస్తా
- వాస్తవాలను ప్రపంచానికి చెబుతా
- పీపీఏల్లో జోక్యంతో పారిశ్రామికవేత్తల్లో భయం
- బ్యాంకులకు కోట్లు ఎగ్గొట్టిన వాళ్లే సలహాదారులు
- ఉద్యోగులూ చట్టాన్ని ఉల్లంఘిస్తే క్షోభే... బీ కేర్‌ఫుల్
- పోలీసులు అతిగా ప్రవర్తిస్తున్నారు: చంద్రబాబు

కడప, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): "రాజధాని అమరావతిని శ్మశానంగా వర్ణిస్తారా? తెలుగు జాతిని కించపరిచేలా మాట్లాడుతారా? ఎంత అహంకారం! ఎంత గర్వం" అంటూ మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. కడప జిల్లాలో మూడు రోజుల బాబు పర్యటన బుధవారం ముగిసింది. బుధవారం ఆయన కడప సెంట్రల్ జైలులో ఉన్న పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డిని పరామర్శించారు. అనంతరం కేంద్ర కారాగారం వెలుపల, జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల

మిగతా 9వ పేజీలో...

ఏపీలో రౌడీ రాజ్యం!

- దాడులు, తప్పుడు కేసులతో వేధింపులు
- రాష్ట్రంలో మానవ హక్కులు లేవు
- అమిత్‌షాకు టీడీపీ ఎంపీల ఫిర్యాదు
- నాకు తెలుసు.. చూసుకుంటా: షా

9

వాల్తేరు డివిజన్ లేనట్లే

- జోన్ డీపీఆర్‌కు ఆమోదం
- నివేదిక ఆధారంగానే ఏర్పాటు
- నోటిఫికేషన్ విడుదలే ఆలస్యం

విశాఖపట్నం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు అడుగులు వేగంగా పడుతున్నాయి. జోన్ ఏర్పాటుపై ఓఎస్డీ ధనుంజయులు మూడు నెలల క్రితం సమర్పించిన డీపీఆర్‌ను దాదాపుగా యథాతథంగా రైల్వే బోర్డు ఆమోదించినట్లు సమాచారం. దీనితో 2020 ఏప్రిల్ 1 నాటికి కొత్త జోన్ ఏర్పాటు కార్యరూపం దాల్చవచ్చని తెలుస్తోంది. ఆ దిశగా నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉంది. ఇదే జరిగితే వాల్తేర్ డివిజన్ మరి లేనట్లేనని రైల్వే వర్గాలు వివరిస్తున్నాయి. వాస్తవానికి ఓఎస్డీ సమర్పించిన డీపీఆర్‌పై పలువురు రాజకీయ నేతలు, కార్మిక, ఉద్యోగ సంఘాలు తమ అభ్యంతరాలను వ్యక్తం చేశాయి. ఆ మేరకు రైల్వే మంత్రి, బోర్డు చైర్మన్, జీఎంకు

మిగతా 2వ పేజీలో...

మళ్లీ ఐటీ కన్ను!

పెద్ద నోట్ల రద్దు నాటి లావాదేవీలపై ఆరా

లక్షకు మించి చేసిన డిపాజిట్లపై దృష్టి

- డినామినేషన్‌తో సహా వివరాలివ్వండి
- బ్యాంకులకు ఆదాయపు పన్ను శాఖ లేఖ
- మార్కెట్‌లో తగ్గుతున్న 2వేల నోట్లు
- నల్లధన స్వాములో 'రద్దు' భయం
- రూ.500లల్లోకి మార్చుకుంటున్న వైనం

ఒక్కసారి పెద్దనోట్ల రద్దు రోజులను గుర్తుకుతెచ్చుకోండి. పాత 500, వెయ్యి నోట్లను బ్యాంకుల్లో మార్చుకునేందుకు జనం క్యూలు కట్టారు. వీరిలో ఎక్కువమంది పక్కవాళ్ల సొమ్ము డిపాజిట్ చేసేందుకే బారులు తీరారు. కొందరు బడాబాబులు కమీషన్లు ఇచ్చి, కూలీలను పెట్టి మరీ డబ్బు మార్చుకున్నారు. ఈ లావాదేవీలపై ఐటీ శాఖ మళ్లీ ఆరా తీస్తోంది.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎప్పుడో మూడేళ్ల కిందటి పెద్ద నోట్ల రద్దు నాటి లావాదేవీలపై ఆదాయపు పన్ను శాఖ మళ్లీ దృష్టిసారించింది. పెద్దనోట్ల రద్దు సమయంలో లక్ష రూపాయలకు మించి డిపాజిట్ చేసిన వారి వివరాలను బ్యాంకులకు పంపి... వారి ఖాతాలపై ఆరా తీస్తోంది. పెద్దనోట్ల రద్దు సమయంలో వారు డిపాజిట్ చేసిన మొత్తం వివరాలను డినామినేషన్‌తో సహా ఇవ్వాలని అడిగినట్లు తెలిసింది. ఈ వివరాలు కోరుతూ రాష్ట్రంలోని పలు బ్యాంకులకు లేఖలు పంపినట్లు తెలిసింది. వాస్తవానికి పెద్దనోట్ల రద్దు ప్రకటన రాగానే ప్రతి ఒక్కరూ తమ దగ్గరున్న పాతనోట్లను బ్యాంకుల్లో మార్చేసుకున్నారు. భారీగా సొమ్ములున్నవాళ్లు కూడా... పలు మార్గాల ద్వారా పాత నోట్లను మార్పిడి చేసుకున్నారు. కమీషన్లు ఇచ్చి మరీ కొందరితో బ్యాంకుల్లో డిపాజిట్ చేయించారు. అనంతరం

మిగతా 2వ పేజీలో...

ఆర్టీసీలో 'వృద్ధాప్య' పింఛన్

- 10 వేలలోపు పెన్షన్ ఉన్నవారికి వర్తింపు
- అదనంగా రూ.2250 చేతికి
- ఎన్ఎంయూ వినతికి మంత్రి పేర్ని ఓకే

2

ఏపీపీఎస్సీ పరీక్షలకు రివైజ్డ్ 'కీ'లు

పదుల సంఖ్యలో ప్రశ్నల తొలగింపు

ఇంజనీరింగ్ కాలేజీలపై తనిఖీల కొరడా

8 జిల్లాల్లోని 20 కాలేజీల్లో విస్తృత తనిఖీలు

10

- అర్ధరాత్రి గోప్యంగా బృందాల ఏర్పాటు
- బుధవారం ఆకస్మికంగా రంగంలోకి
- ఏఐసీటీఈ నిబంధనలపై నిశిత పరిశీలన
- వెలుగులోకి అనేక లొసుగులు
- బెంబేలెత్తిన కళాశాలల యాజమాన్యాలు
- ఇది మొదలే.. రాబోయే రోజుల్లో మరిన్ని
- ఉన్నత విద్య రెగ్యులేటరీ కమిషన్ వెల్లడి

పరంజ్యోతి

ॐ సంతుష్టి పరమం ధనమ్

సంతుష్టుడే మూడు జగముల పూజ్యుండు
సంతుష్టికెప్పుడు జరుగు సుఖము
సంతుష్టి కాకున్న- సంసారహేతువు
సంతసంబున ముక్తి సతియు దొరకు

..అని భాగవతం చెబుతోంది. ఆత్మశాంతి కావాలంటే తృప్తి పొందడం నేర్చుకోవాలి. బుద్ధిని, చిత్తాన్ని, మనసునూ స్వాధీనంలో ఉంచుకుని, మన మానసిక శాంతిని మనమే కాపాడుకోవాలి. ఆరాటం ఆత్మశాంతి విఘాతానికి ఆధారం. దైవచింతన, ధ్యాన, సంకీర్తన, పూజల్లో పరమానందం అనుభవించేవారు ధనాశతో, ఇంద్రియ విషయాసక్తులతో ఉంటారు. ఇంద్రియ నిగ్రహంలో గొప్ప సుఖం, ఆనందం ఉన్నాయి. ఇంద్రియాలను జయించిన వారికి ఆత్మరాజ్యం, మోక్ష రాజ్యం, దైవరాజ్యం లభిస్తాయి. కాబట్టి, స్వాత్మను స్మరిస్తూ, ధ్యానిస్తూ ఆనందంగా ఉండొచ్చు. ఆశ అనే రోగానికి 'తృప్తి' అనేది విరుగుడు మందు. మానవుడు ఈ ప్రపంచమందు విశ్రాంతి లేకుండా తిరుగుతూ, 'ఇది నాది - ఇది నాది. అది కూడా సంపాదించుటకు ప్రయత్నిస్తాను' అంటాడు. సంతుష్టి లేని వానికి ఏ కాలంలోనూ, ఎందులోనూ శాంతి లభించదు. వారి మనసు.. 'నేనింకా గొప్పవాడను కావాలి' అనే ఆలోచనలతో మహా చంచలమై ఉంటుంది. "తృప్తి చెందని మానవుడు సప్త ద్వీపములన్ చక్కంబడునే" అని పోతన 'శ్రీమద్భాగవతం'లో అన్నారు. కాబట్టి, ఈ జీవిత పథంలో.. భగవంతుడు ఇచ్చిన దానితో తృప్తి చెందడమే సాధకులకు బ్రహ్మసాక్షాత్కార మార్గంలో నడవడానికి తగినంత శక్తినిచ్చి, వివేక వైరాగ్యాలకు కారణమై ఉంది. తృప్తి అనేది మోక్ష ద్వారాలను సైతం తెరవగలిగే శక్తినిస్తుంది. పూర్తిగా తృప్తి కలవారి మనస్సు రాగద్వేషాలు లేక.. సమరసంగా ఉంటుంది. సంతుష్టియే ఆనందము. తృప్తియే అమృతము. అమరత్వము. అఖండశాంతినిచ్చు మానసిక వృత్తియే తృప్తి. పాములు వాయుభక్షకులే అయినా.. చలించకుండా ఉండట్లేదు. ఎండుగడ్డి తింటున్నా ఏనుగులు అమిత బలం కలిగి ఉంటున్నాయి. కంద మూలాలు తిని మునిశ్రేష్ఠులు ఆధ్యాత్మిక సాధనలో నిమగ్నులవుతారు. కాబట్టి.. తృప్తిని పొంది జీవనయానం చేయడమే పురుషులకు నిధానం(ఆశ్రయింపదగినది). ఎన్ని సంవత్సరాలకైనా, ఎన్ని జన్మలకైనా.. ఆత్మసంతృప్తినొందిప్పుడే సంపూర్ణానందం. కోరికలు, క్రోధం, మమకారం, అహంకారం లేనివారి భాగ్యమే ఆత్మసంతృప్తి. సంతృప్తి కలవారు దుఃఖితులను సంతోషపెట్టగలరు.

అప్రాప్తంహి పరిత్యజ్య సంప్రాప్తే సమతాంగతః
అదృష్ట ఖేదా ఖేదోయః సంతుష్ట ఇతి కథ్యతే

..ఎవడు లభింపని దానికై చింతించడో, లభించిన దానితో స్వస్థపడునో, ఎవనికి సుఖదుఃఖములు కనుపించవో అతడు సంతుష్టుడు అని దీని అర్థం. మహోపనిషత్తు చెప్పిన సంతుష్టుని లక్షణాలివి. 'సంతుష్టి పరమంధనమ్' అనగా సంతృప్తే గొప్ప ధనం. యోగ శాస్త్ర నియమాల్లో 'తృప్తి' అనేది ముఖ్యమైన విషయం. వచ్చిన దాంతో తృప్తిపడి, కోరికలు లేని మనస్సుతో ధ్యానంచేయాలని సాక్షాత్తూ ఆ కృష్ణపరమాత్మ బోధించాడు. తృప్తి.. మనస్సునకు శాంతిని కలుగజేసే సాత్విక గుణం. అది మనస్సును ఎప్పుడూ భగవంతుని వైపే మళ్లిస్తుంది.

- మేఘశ్యామ (ఈమని), 8332931376

చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
హైదరాబాద్	18.4	28.9
గుంటూరు	19.5	30.0
విజయవాడ	20.4	30.3
కర్నూలు	21.2	31.6
విశాఖపట్నం	21.2	30.0
అనంతపురం	22.0	30.0
ఒంగోలు	22.7	30.9
శ్రీకాకుళం	24.0	34.0
తిరుపతి	24.2	29.0
నెల్లూరు	24.5	28.7

సెన్సార్ నివేదిక ఇవ్వండి

- 'కమ్మరాజ్యంలో కడప రెడ్లు' నిర్మాతకు తెలంగాణ హైకోర్టు ఆదేశం

హైదరాబాదు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'కమ్మరాజ్యంలో కడప రెడ్లు' సినిమాపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టు స్పందించింది. ఈ చిత్రం సెన్సార్ నివేదికను గురువారం తమ పరిశీలనకు ఇవ్వాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్.రాజేశ్వరరావును న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డితో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. 'కమ్మరాజ్యంలో కడప రెడ్లు' సినిమా టైటిల్ కమ్మ, రెడ్డి సామాజిక వర్గాల మధ్య వైషమ్యాలు పెంచేలా ఉందని, ముఖ్యంగా కమ్మ సామాజిక వర్గాన్ని, ఆ వర్గం నాయకులను కించపరిచేలా సన్నివేశాలు చిత్రీకరించారని, ఈ సినిమా రిలీజ్ చేయవద్దని ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ... హైదరాబాద్, శ్రీనగర్ కాలనీకి చెందిన ఎం.ఇంద్రసేనాచౌదరి పిటిషన్ దాఖలుచేసిన విషయం తెలిసిందే. భోజన విరామ సమయం తర్వాత ధర్మాసనం వ్యాజ్యంపై విచారణ చేపట్టింది. ఇదే సినిమాలో తన వ్యక్తిత్వాన్ని అవహేళన చేసేలా సనివేశాలు చిత్రీకరించారని, సినిమా విడుదల ఆపాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కే.ఏ.పాల్ మరో పిటిషన్ దాఖలుచేశారు. ఈ వ్యాజ్యం హైకోర్టు సింగిల్ జడ్జి ముందు విచారణకు వచ్చింది. ఈ వ్యాజ్యంలో జరిగిన విచారణపై ధర్మాసనం ఆరా తీసింది. హైకోర్టు సింగిల్ జడ్జి ఈ చిత్రంపై సెన్సార్ బోర్డు నివేదిక ఇవ్వాలని కోరినట్టు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యాజ్యంలో ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది. సెన్సార్ బోర్డు ఇచ్చే నివేదికను తమకూ ఇవ్వాలని ఆదేశించింది.

వర్మను బహిష్కరించాలి: బీవీ రామ్

విశాఖపట్నం, నవంబరు 27: 'కమ్మరాజ్యంలో కడప రెడ్లు' సినిమాను నిషేధించాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ మంటగలుపుతున్నారని విమర్శించారు. చంద్రబాబు, పవన్, లోకేశ్, పాల్‌ను కించపరిచేందుకే ఈ సినిమా తీశారని అర్థమవుతోందన్నారు. వర్మను రాష్ట్రం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. వర్మ తెలుగు ప్రజల కర్మ అని, ఆయన్ని విశాఖ మానసిక వైద్యశాలలో చేర్పించాలని, వైద్య ఖర్చులు తాను భరిస్తానని రామ్ చెప్పారు.

వాల్తేరు డివిజన్ లేనట్లే!

(మొదటి పేజీ తరువాయి)

వినతులనూ సమర్పించారు. అదే సమయంలో తూర్పు కోస్తా అధికారులు కూడా ఒకింత అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే దక్షిణ మధ్య రైల్వే నుంచి మాత్రం ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే డీపీఆర్‌ను ఆమోదించామని బోర్డు వర్గాలు చెపుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఆగస్టు 27నే డీపీఆర్ సమర్పించినప్పటికీ ఇప్పటి వరకూ జోన్ ఏర్పాటుపై ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడం, ప్రారంభ తేదీపై నోటిఫికేషన్ వెలువడకపోవడంతో ఏం జరుగుతుందోనన్న ఆందోళనా వ్యక్తమవుతోంది.

మొగ్గ దశలోనే మాడిపోయిన ఆశలు

జోన్ ఏర్పాటుపై వివరణాత్మక నివేదిక సమర్పించి మూడు నెలలు గడిచినా ఎలాంటి చప్పుడూ లేకపోవడంతో చేర్పులు మార్పులు జరుగుతున్నాయనీ, కొత్త అంశాలను జోడిస్తున్నారనీ, అందుకనే ప్రకటన ఆలస్యమవుతోందంటూ ప్రచారాలు సాగాయి. అదే సమయంలో గత నెలలో సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రధాని మోదీని కలవడం, తదనంతర రోజుల్లో ఎంపీ విజయసాయిరెడ్డి బోర్డు చైర్మన్‌ను కలవడం జరిగాయి. ఆయా సందర్భాలల్లో విజయసాయిరెడ్డి చేసిన ప్రకటనలతో వాల్తేరు డివిజన్ ఉంటుందన్న ఆశలు మొగ్గతొడిగాయి. తాజా సమాచారంతో ఆ ఆశలను మొగ్గ దశలోనే వదులుకోవాల్సి వస్తుంది. విశ్వసనీయ సమాచారం మేరకు ఓఎస్డీ ధనుంజయులు సమర్పించిన డీపీఆర్ ఆధారంగానే ఉద్యోగులు, భవనాల కేటాయింపు, డివిజన్ల పరిధి, ఇతరత్రా అంశాలను అమలు చేయనున్నారు. ఈ డీపీఆర్ అడ్వాన్స్‌డ్ స్టేజ్‌లో ముందుకు కదులుతోంది. ఇక ప్రారంభ తేదీ ప్రకటనకు నోటిఫికేషన్ వెలువడితే ఇతర ప్రక్రియలన్నీ ప్రారంభం కానున్నాయి. కొత్త ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నాటికి జోన్ కార్యకలాపాలు ప్రారంభించాలంటే అందుకు కొన్ని మౌలిక వసతులు సమకూర్చుకోవాల్సి ఉంది. ఆయా ప్రక్రియలకు సుమారు నాలుగైదు నెలల సమయం పడుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. నోటిఫికేషన్ వెలువడడం ఎంత జాప్యం జరిగితే జోన్ ఏర్పాటు అంత ఆలస్యం అవుతుందని చెబుతున్నారు.

వాల్తేరుకు అవకాశం లేకపోలేదు...

భారతీయ రైల్వేలపై అవగాహన ఉన్న రైల్వే విశ్రాంత సీనియర్ అధికారులు, జాతీయ స్థాయి కార్మిక సంఘాలు నేతలు మాత్రం డివిజన్‌పై భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. డీపీఆర్‌ను ఆమోదించినంత మాత్రాన వాల్తేరు డివిజన్‌ను ఉంచే అవకాశాలు పూర్తిగా లేనట్లేనని భవించాల్సిన అవసరం లేదని ఆ వర్గాలు వివరిస్తున్నాయి. రాజకీయపరమైన ఒత్తిడితో సాధించుకునే అవకాశం లేకపోలేదని చెపుతున్నాయి. రైల్వే మంత్రి, బోర్డు చైర్మన్‌కు అధికార పార్టీ నేతలు వినతులు సమర్పించినపుడు 'బోర్డు పరిశీలిస్తోంది' అని చెప్పడం అందుకు ఊతం ఇస్తోందని అంటున్నాయి. ఇదే అంశంపై యూనియన్లు తీవ్ర స్థాయిలోనే స్పందిస్తున్నాయి.

1న న్యాయాధికారుల సమావేశం

- ఏఎన్‌యూలో నిర్వహించనున్న హైకోర్టు సీజే

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కిందిస్థాయిలో కక్షిదారులు, న్యాయాధికారుల సమస్యలు తెలుసుకునేందుకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరి డిసెంబరు 1న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 530 మందికిపైగా న్యాయాధికారులతో ఈ సమావేశంలో ఆయన చర్చించనున్నారు. న్యాయాధికారులు తమ సూచనలు, సలహాలు స్వేచ్ఛగా వ్యక్తం చేయవచ్చు. ఏపీ హైకోర్టు ఏర్పాటైన తరువాత నిర్వహిస్తున్న ఈ సమావేశానికి ఆచార్య నాగార్జున వర్సిటీ వేదిక కానుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సమావేశం కొనసాగనున్నట్టు హైకోర్టు ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ జనరల్ రాజశేఖర్ తెలిపారు. సమావేశం ముగిశాక ఆయా జిల్లాల జడ్జీలతో హైకోర్టు పోర్ట్‌ఫోలియో జడ్జీలు ప్రత్యేకంగా ముఖాముఖి నిర్వహించనున్నారు.

ఆర్టీసీలో 'వృద్ధాప్య'

పింఛన్!

- 10 వేలలోపు పెన్షన్ ఉన్నవారికి వర్తింపు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులుగా రిటైరై.. చాలీ చాలని పింఛను సొమ్ముతో కష్టాలు పడుతున్న వారికి తీపికబురు. రూ.10 వేల కన్నా తక్కువ పింఛను తీసుకుంటున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్‌లలో భాగంగా ఇస్తున్న వృద్ధాప్య పెన్షన్‌ను ఇచ్చేందుకు రవాణా శాఖ మంత్రి పేర్ని నాని అంగీకరించారు. ఇది అమలైతే.. రూ.10 వేల లోపు పింఛను తీసుకుంటున్న రిటైరైన కార్మికులు, ఉద్యోగులకు రూ.2250 వృద్ధాప్య పింఛను అదనంగా అందనుంది. ఈ మేరకు ఎన్ఎంయూ రాష్ట్ర నేతలు పీవీ రమణారెడ్డి, వై. శ్రీనివాసరావు చేసిన వినతిపై మంత్రి తక్షణమే స్పందించారు. అదేసమయంలో ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అవుతున్నందున ప్రస్తుత ఉద్యోగులకు జీపీఎఫ్ ఇచ్చే విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికులు, పదవీ విరమణ పొందిన సిబ్బంది సమస్యలపై మంత్రి నానితో ఎన్ఎంయూ నేతలు, వైఎస్సార్ మజ్దూర్ యూనియన్ నేతలు చల్లా చంద్రయ్య, అబ్రహాం బుధవారం వేర్వేరుగా భేటీ అయి చర్చించారు. ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత 2004కు ముందున్న జీపీఎఫ్ ఇవ్వాలని వినతి పత్రాలిచ్చారు. కాగా, ఇవే సమస్యలపై గతంలో మంత్రి నానితో ఈయూ రాష్ట్ర నేతలు పలిశెట్టి దామోదర్‌రావు, వైవీ రావు కూడా చర్చించారు. ఆర్టీసీ విలీనం తర్వాత సీపీఎస్‌కు అవకాశం ఉండొచ్చని, జీపీఎఫ్ విషయంలో సీఎం నిర్ణయం తీసుకునే వరకూ ఎలాంటి అపోహలకు తావివ్వొద్దని మంత్రి సూచించారు. 'జనవరి నుంచి ఆర్టీసీ సిబ్బంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులవుతారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఏది అమలైతే వారికీ అదే వర్తిస్తుంది. అపోహలు వద్దు' అని వైఎస్సార్ మజ్దూర్ యూనియన్ నేతలకు మంత్రి స్పష్టం చేశారు. అయితే 2013నాటి వేతన బకాయిలకు సంబంధించి 40% ఇస్తామని చెప్పిన గడువు దాటిపోయినా ఇవ్వలేదని, ఆ మొత్తాన్ని వెంటనే విడుదల చేయించాలని చల్లా చంద్రయ్య విన్నవించగా తప్పకుండా చేద్దామని మంత్రి హామీ ఇచ్చారు.

దక్షిణ కోస్తాకు వర్ష సూచన

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తూర్పు గాలుల ప్రభావంతో రానున్న 24 గంటల్లో దక్షిణ కోస్తాలో ఒకటి, రెండుచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం వుందని వాతావరణ శాఖ తెలిపింది. నెల్లూరు పరిసరాల్లో ఒక మోస్తరు వర్షాలు కురవవచ్చునని అంచనా వేస్తోంది. ఉత్తర కోస్తాలో పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొంది.

మహిళల వల్లే అత్యాచారాలు!

మహిళలపై అత్యాచారాలకు మగవాళ్లనే బాధ్యులను చేయడం సరికాదు. మహిళలే వారికి ఆ అవకాశం కల్పిస్తున్నారు. పూర్వం కట్టుబాట్ల నడుమ ఉన్నప్పుడు మహిళలపై అత్యాచారాలు జరిగేవి కావు. ఇటీవల వారికి స్వేచ్ఛ అధికంగా లభించడం వల్ల లైంగిక వేధింపులు, అత్యాచారాలు పెరుగుతున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లల భద్రత కోసం ఫోన్లు కొనిస్తుంటే ఈ తరం అమ్మాయిలు ఆ ఫోన్లలో ఎవ్వరితోనైనా మాట్లాడేస్తున్నారు. మగవాడు ఇతరులతో సంబంధం పెట్టుకున్నా కూడా భార్యను సంతోషంగా ఉంచాలని చూస్తాడు. అదే ఓ మహిళ ఎవరితోనైనా ఎఫైర్‌లో ఉంటే ప్రియుడితో కలిసి భర్త, పిల్లలను చంపడానికి కూడా వెనుకాడటం లేదు. అందుకే మహిళలను అదుపులో ఉంచాల్సిన అవసరం ఉంది

- భాగ్యరాజ్, తమిళ నటుడు, దర్శకుడు

తిరుమలలో గజగజ

తిరుమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులతో తిరుమలలో చలి తీవ్రత ఎక్కువైంది. పొగమంచు కురుస్తుండడంతో పగటి ఉష్ణోగ్రతలు బాగా పడిపోయాయి. భక్తజనం గజగజ వణుకుతూ సంచరిస్తున్నారు. బుధవారం చల్లటి గాలులు వీయడంతో పాటు, అప్పుడప్పుడు చిరుజల్లులు కురిశాయి. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలు, వాణిజ్య సముదాయాల్లో జన సంచారం పలుచగా కనిపించింది. టీటీడీ కార్మికులు వణుకుతూనే విధులు నిర్వహించారు. చంటిపిల్లలు, వృద్ధులతో వచ్చిన భక్తబృందాలు దర్శనం అయిన వెంటనే తిరుగు ప్రయాణమవుతున్నాయి. ఘాట్‌రోడ్లలో పొగమంచు అలుముకోవడంతో రహదారి సరిగా కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

అవినీతి అధికారులపై వేటు!

- దేశ వ్యాప్తంగా 21 మందికి ఉద్వాసన.. ఏపీ నుంచి ముగ్గురు

విశాఖపట్నం/రాజమహేంద్రవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఆదాయపన్ను అధికారులపై వేటు పడింది. దేశవ్యాప్తంగా 21మందిని విధుల నుంచి తప్పించిన కేంద్ర ప్రభుత్వం వారితో నిర్బంధ పదవీ విరమణ చేయించింది. వారిలో కొందరిపై సీబీఐ కేసులు కూడా ఉన్నాయని పేర్కొంది. ఈ జాబితాలో ఏపీకి చెందిన అధికారులు ముగ్గురు ఉన్నారు. విశాఖపట్నంలో పనిచేసిన ఐటీ అధికారి బి.శ్రీనివాసరావు ఒక పన్ను చెల్లింపుదారుడి నుంచి లంచం తీసుకుంటూ 2016 డిసెంబరులో సీబీఐకి చిక్కారు. స్థిరాస్తి అమ్మగా వచ్చిన ఆదాయం రిటర్న్‌లో చూపలేదని సదరు పన్ను చెల్లింపుదారుడికి శ్రీనివాసరావు నోటీసు ఇచ్చారు. దాన్ని వెనక్కి తీసుకోవడానికి రూ.1.5లక్షలు డిమాండ్ చేశారు. దీనిపై బాధితుడు సీబీఐని ఆశ్రయించాడు. వారి సూచనల ప్రకారం బాధితుడు రూ.30వేలు లంచం ఇస్తుండగా శ్రీనివాసరావును అధికారులు పట్టుకున్నారు. అతడి నివాసం, ఆఫీసుల్లో సోదాలు నిర్వహించగా మరింత మొత్తం లభించింది. దాంతో సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. మరో ఘటనలో కాకినాడలో ఐటీ అధికారిగా పనిచేసిన పి.వెంకటేశ్వరరావు ఒక వ్యవసాయదారుడి పన్ను బకాయిలను రూ.కోటి నుంచి రూ.50లక్షలకు తగ్గించడానికి భారీగా లంచం డిమాండ్ చేశాడు. మొదటి విడతగా రూ.15 లక్షలు తీసుకుంటుండగా సీబీఐ అధికారులు పట్టుకున్నారు. ఈ రెండు కేసులు ఐటీ శాఖలో సంచలనం కలిగించాయి. సీబీఐ కూడా వాటికి బలమైన ఆధారాలు చూపించింది. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరు అధికారులతో నిర్బంధ పదవీ విరమణ చేయించినట్టు ఐటీ వర్గాలు చెబుతున్నాయి. కాగా, గతంలో రాజమహేంద్రవరంలో ఇన్‌కంటాక్స్ అధికారిణిగా పనిచేసిన రాజసిరి 2016లో కృష్ణాజిల్లాలో పనిచేస్తున్నప్పుడు గుడివాడలో ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారిని రూ.4లక్షలు డిమాండ్ చేయగా రూ.1.50లక్షలు ఇచ్చేందుకు అంగీకరించాడు. అనంతరం సీబీఐ అధికారులను ఆశ్రయించాడు. అధికారుల ఆకస్మిక తనిఖీలో రూ.1.50లక్షలు లంచం డబ్బుతో ఆమె పట్టుబడింది. సీబీఐ ఇచ్చిన సమగ్ర నివేదిక ఆధారంగా చర్యలు చేపట్టిన కేంద్రం రాజసిరిని నిర్బంధ ఉద్యోగవిరమణ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది.

ఏపీపీఎస్సీ పరీక్షలకు రివైజ్డ్ 'కీ'లు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వివిధ రిక్రూట్‌మెంట్లకు సంబంధించి నిర్వహించిన మెయిన్స్ పరీక్షల రివైజ్డ్ 'కీ'లను ఏపీపీఎస్సీ బుధవారం విడుదల చేసింది. ప్రాథమిక 'కీ'పై వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో వీటిని విడుదల చేసినట్లు కమిషన్ తెలిపింది. వీటిపై అభ్యంతరాలను డిసెంబరు 3లోగా పంపింపాలని కోరింది. ఈ ఏడాది ఆగస్టు 1న నిర్వహించిన అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్స్ మెయిన్స్‌లో 22 ప్రశ్నలను తొలగించి, 3 ప్రశ్నల ఆప్షన్లు మార్చారు. ఆగస్టు 26న నిర్వహించిన పంచాయతీ సెక్రెటరీ(గ్రేడ్-4) మెయిన్స్‌లో 8 ప్రశ్నల ఆప్షన్లను మార్చారు. ఈ ఏడాది మే 28-29 తేదీల్లో నిర్వహించిన ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పరీక్షలో 3 ప్రశ్నలను తొలగించి, 16 ప్రశ్నల ఆప్షన్లను మార్చారు. కాగా, ఏపీ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టికల్ సర్వీసెస్‌లోని అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ) పోస్టులు, ఏపీ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్‌లోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్స్ పోస్టుల పరీక్షలకు సంబంధించి అభ్యర్థుల ప్రొవిజినల్ సెలెక్షన్ లిస్టులను ఏపీపీఎస్సీ బుధవారం విడుదల చేసింది.

రద్దయిన జీవోతో ఉత్తర్వులా?

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ జీ శ్యాంప్రసాద్‌ల ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. పత్రికాస్వేచ్ఛను హరించేలా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో 2430ను రద్దు చేయాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన సీనియర్ పాత్రికేయుడు ఉప్పల లక్ష్మణ్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫున న్యాయవాది ఎం.వేణుమాధవ్ వాదనలు వినిపించారు. "పాత్రికేయులను భయాందోళనలకు గురి చేసేందుకే ప్రభుత్వం ఈ జీవో జారీ చేసింది. అది వారి మెడపై కత్తిలాంటిది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తే కేసులు పెట్టేందుకే జీవో జారీ చేశారు. అందువల్ల దానిని రద్దు చేయాలి" అని కోరారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న ధర్మాసనం, ఇందులో తప్పేముందో చెప్పాలని పేర్కొంది. ఇందుకు పిటిషనర్ తరఫు న్యాయవాది సమాధానమిస్తూ.. "మీడియాలో నిరాధార వార్తలు వస్తే కేసులు పెట్టేందుకు అనువుగా 2007లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం జీవో 938ని జారీ చేసింది. అయితే దానిపై తీవ్ర వ్యతిరేకత రావడం, పలువురు జర్నలిస్టుల సూచనలతో అప్పట్లో వెనక్కి తగ్గి.. 938 జీవోను రద్దు చేస్తూ 980 జీవోను జారీ చేసింది. అయితే ఆ రద్దయిన జీవోను ప్రస్తావిస్తూ ఇప్పటి ప్రభుత్వం తాజాగా జీవో 2430ను జారీ చేయడం విడ్డూరంగా ఉంది" అని ఆయన పేర్కొన్నారు. అందువల్ల ఆ జీవోపై స్టే ఇవ్వాలని అభ్యర్థించగా, ధర్మాసనం నిరాకరించింది. ప్రభుత్వ వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వలేమని పేర్కొంది. 2430 జీవోలో రద్దయిన జీవో ప్రస్తావన ఎందుకు తెచ్చారో తగిన వివరణతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలనా శాఖ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది.

బతకమంటారా?

పెట్రోలు పోసుకోమంటారా?

- ఇసుక రవాణాలో వే బిల్లుల రచ్చ!
- చిరునామా లేదని 12 వాహనాల సీజ్

కర్నూలు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వే బిల్లుల్లో చిరునామాలు సరిగ్గా లేవంటూ ఇసుక లోడింగ్‌తో వెళ్లే వాహనాలను పోలీసులు సీజ్ చేయడం ఉద్రిక్తతకు దారితీసింది. కర్నూలు జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి 12వాహనాలను సీజ్ చేయడంతో పాటు 9మంది వాహన యజమానులపై కేసులు నమోదు చేశారు. ఆన్‌లైన్లో పొందుపరచని అంశాన్ని తామెలా నమోదు చేయించుకోగలమంటూ బాధితులు ఆందోళనకు దిగారు. బుధవారం ఉదయమే యార్డుకు చేరుకుని, ఇసుక లోడింగ్‌ను అడ్డుకున్నారు. దీంతో మధ్యాహ్నం వరకు యార్డులో ఉద్రిక్తత నెలకొంది. 'వెబ్‌సైట్లోకి దూరి మేం అడ్రసులు రాసుకోవాలా? మైనింగ్, పోలీసు అధికారులు కలిసి అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ఈ వేధింపులు భరించలేం. మాకు చావే శరణ్యం. మా వాహనాలపై పెట్రోల్ పోసి, మేమూ ఆత్మహత్యలు చేసుకుంటాం...' అంటూ బాధితులు ఆక్రోశం వ్యక్తం చేశారు. అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్న వాహనాల యజమానుల నుంచి రెండో టౌన్ పోలీస్ స్టేషన్లోని కొందరు పోలీసులు రూ.5వేలు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు బాధితులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నంలో వెబ్‌సైట్‌ను చూపిస్తుండగానే తొలుత వెయ్యి టన్నుల స్టాక్ చూపించిన 10 నిమిషాల్లోనే స్టాక్ క్లోజ్ అని స్క్రీన్‌పై కనిపించడం కొసమెరుపు. నాలుగో పట్టణ టౌన్ సీఐ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇసుక చేరవేస్తున్న చిరునామా వే బిల్లుల్లో ఉండాల్సిందేనని, వెబ్‌సైట్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఏపీఎండీసీ అధికారులకు సమస్యను తెలిపామని, వీలైనంత త్వరగా అప్‌డేట్ చేస్తామని అధికారులు చెప్పినట్లు వివరించారు.

కర్నూలు ఇసుక యార్డు వద్ద ఆందోళన

పెట్రోల్ పోసుకుంటా

అక్రమ కేసు పెడితే నా వాహనంపై పెట్రోల్ పోసి నేనూ నిప్పంటించుకుంటా. అవసరమైతే జైలుకైనా వెళ్తా తప్ప ఈ వేధింపులు భరించలేకపోతున్నాను. రుణంపై ట్రాక్టరు కొనుక్కుని ఇసుక కొరతతో వాయిదాలే చెల్లించలేకపోతున్నాను. ఇసుకను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తున్నా నిబంధనల పేరుతో సామాన్యులకు అందకుండా చేస్తున్నారు.

- బాలు, బాధితుడు

పొగమంచులో దాగిన కాలుష్యం గుట్టువీడింది

వాషింగ్టన్, నవంబరు 27 : ఢిల్లీ నగరాన్ని పొగమంచు రూపంలో కాలుష్యం కమ్మేసిన తీరును మనం కళ్లారా చూశాం. ఆ అందమైన మంచుదుప్పటి మాటున విష వాయువులు ఎలా ఏర్పడుతున్నాయి? అనేది అమెరికాలోని పెన్సిల్వేనియా వర్సిటీ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. పొగమంచులోని సల్ఫర్ ట్రై ఆక్సైడ్‌తో 'మిథనాల్ రసాయన చర్య జరిపి గాలిలోని కాలుష్య కారకాలను మనిషి వెంట్రుక కంటే 30 రెట్లు తక్క

పాఠశాల భవనానికి రంగుపడింది!

విజయనగరం జిల్లా సాలూరులోని చిట్లువీధిలో ఒకే భవన సముదాయంలో ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ ప్రీ స్కూల్, గ్రామ సచివాలయం నిర్వహిస్తున్నారు. ఒకే భవనంలో పాఠశాల ఉన్న విభాగానికి వైసీపీ రంగులు వేయడాన్ని స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. - సాలూరు

అమ్మఒడి.. మూత'బడి'

హాలహర్వి, మద్దికెర, నవంబరు 27: పిల్లలందరినీ బడి బాట పట్టించేందుకే అమ్మఒడి పథకమని ప్రభుత్వం చెబుతోంది. ఇప్పుడు ఆ పథకమే బడులు మూతపడేందుకు కారణమయ్యింది. కర్నూలు జిల్లా హాలహర్వి మండలం టి.సాకిబండలోని ప్రాథమిక పాఠశాల ఈవిధంగానే మూతపడింది. ఈ పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉన్నారు. జూలైలో ఇక్కడి ఉపాధ్యాయుడు బదిలీ కావడంతో నెల రోజులపాటు పాఠశాల మూతబడింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందించి ప్రత్యామ్నాయంగా సీఆర్పీని నియమించారు. మూడు రోజులుగా సీఆర్పీ కూడా పాఠశాలకు రావడం లేదు. ఈ విషయాన్ని ఎంఈవో దృష్టికి తీసుకెళ్లగా అమ్మ ఒడి నమోదు కోసం సీఆర్పీ ఆఫీసుకు వచ్చారని చెప్పారు. మద్దికెర మండలం కొత్తపల్లిలోనూ ఇదే పరిస్థితి. 30మంది విద్యార్థులుండే ఇక్కడి ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం నలుగురే ఉన్నారు. పంచాయతీ పరిధిలోని హంప గ్రామం నుంచి ఉపాధ్యాయులు రొటేషన్ పద్ధతిన వచ్చి ఇక్కడ పాఠాలు చెబుతుండేవారు. బుధవారం ఎవరూ పాఠశాలకు రాలేదు. దీనిపై ఎంఈవోను వివరణ కోరగా అమ్మఒడి పథకం నమోదులో ఉపాధ్యాయులు బిజీగా ఉన్నారని, అందువల్లే పాఠశాలకు వెళ్లలేదని చెప్పారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

పాదయాత్ర హామీ నెరవేర్చండి.. విద్యుత్ మీటర్ రీడర్ల డిమాండ్.. భారీ ధర్నా

ధర్నాలో పాల్గొన్న మీటర్ రీడర్లు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న మీటర్ రీడర్లు బుధవారం భారీ ధర్నా చేశారు. విజయవాడ నగరంలోని ధర్నా చౌక్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ రాష్ట్ర కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున మీటర్ రీడర్లు హాజరయ్యారు. రాష్ట్రంలోని రెండు విద్యుత్ డిస్కం సంస్థల పరిధిలో నాలుగున్నర వేల మంది మీటర్ రీడర్లు పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రామ సచివాలయ ఉద్యోగాల భర్తీలో భాగంగా కొత్తగా ఎనర్జీ అసిస్టెంట్ జూనియర్ లైన్‌మెన్ ఉద్యోగులను నియమించింది. వీరితోనే మీటర్ రీడింగ్ తీయించుకొంటామని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఇటీవల ప్రకటనలు చేస్తున్నారు. మీటర్ రీడర్ల తొలగింపు అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని ఈపీడీసీఎల్ సీఎండీ ఇటీవల తెలిపారు. ఈ నేపథ్యంలో మీటర్ రీడర్లు ఆందోళనకు దిగారు. ఏళ్ల తరబడి సంస్థనే నమ్ముకుని పనిచేస్తున్న రీడర్లను తొలగించడం అన్యాయమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింహారావు ధర్నాలో విమర్శించారు. దళారీ వ్యవస్థను తొలగించి మీటర్ రీడర్లకు న్యాయం చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి ఇప్పుడు వారి ఉద్యోగాలనే తొలగించాలని చూడటం దారుణమని అన్నారు. మీటర్ రీడర్లందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తామని జగన్మోహన రెడ్డి పాదయాత్రలో హామీ ఇచ్చారని, ఇప్పుడు అందుకు విరుద్ధంగా తొలగింపు ప్రకటనలతో జీవితాలతో ఆడుకొంటున్నారని మీటర్ రీడర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్కే హజరత్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పీస్ రేటు విధానం రద్దు చేసి కనీస వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు.

జీతాలు చెల్లించకుంటే ఆత్మహత్యే

- కలెక్టర్‌కు లేఖరాసి అదృశ్యమైన పంచాయతీ ఉద్యోగి
- ఉద్యోగ భద్రత కల్పించాలని సీఎంకు వీడియో సందేశం

జగన్‌తో ముత్తేశ్వరరావు (ఫైల్)

పిఠాపురం రూరల్, నవంబరు 27: స్వీపర్ కమ్ అటెండర్‌గా, పంచాయతీ గుమస్తాగా పనిచేసిన తనకు రావాల్సిన వేతనాల బకాయిలు, పంచాయతీకి వివిధ పనులు నిమిత్తం తాను చేసిన వ్యయ బకాయిలను తక్షణం చెల్లించకుంటే తనకు ఆత్మహత్యే శరణ్యమంటూ తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు పంచాయతీ ఉద్యోగి కలెక్టర్‌కు రాసిన లేఖ కలకలం రేపింది. అలాగే తనతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీల్లో పనిచేస్తున్న 30 వేల మంది కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌ను ఓ వీడియో సందేశంలో కోరారు. ఆయన రాసిన లేఖ ప్రకారం. చిట్లూరి వెంటక సత్య ముత్తేశ్వరరావు ప్రత్తిపాడు పంచాయతీలో 2014 నుంచి గుమాస్తాగా పనిచేస్తున్నారు. అప్పటి నుంచి గ్రామంలో మోటారు, వీధిదీపాల రిపేర్ల కోసం అధిక వడ్డీకి అప్పుతెచ్చి పనులు చేయించినట్టు ఆ లేఖలో వివరించారు. ఆ సొమ్ము ఇంతవరకూ తనకు చెల్లించలేదని, వాటితోపాటు తనకు రావాల్సిన వేతన బకాయిలను కూడా విడుదల చేయలేదని పేర్కొన్నారు. జీతాల్లేక, తాను చేయించిన పనులకు డబ్బులు చెల్లించక, వడ్డీలు బాగా పెరిగి తాను అనేక ఇబ్బందులు పడుతున్నానని తెలిపారు. ఈలోగా కొత్తగా వచ్చిన పంచాయతీ కార్యదర్శి తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కొత్తగా విధుల్లో చేరిన సచివాలయ సిబ్బంది ముందు అవమానించి మానసిక క్షోభకు గురిచేస్తున్నారని వివరించారు. తన ఉద్యోగం కొనసాగింపు ఆర్డర్ కోసం ప్రతిపాదనలు కూడా పంపలేదన్నారు. బిల్లులు, వేతన బకాయిలు చెల్లించి తనను రుణ విముక్తిడిని చేయాలని, తనకు ఉద్యోగం చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఈ లేఖను తన మరణ వాంగ్మూలంగా భావించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. లేఖ రాసిన అనంతరం ముత్తేశ్వరరావు అదృశ్యమయ్యారు. బుధవారం నుంచి అతని ఫోన్ పనిచేయడం లేదు.

8 నెలలుగా జీతాల్లేవు

- హెల్త్ వలంటీర్లు, ఏఎన్ఎంలను ఆదుకోండి
- గిరిజన సంక్షేమ సంఘం డిమాండ్

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న హెల్త్ వలంటీర్లు, ఏఎన్ఎంలకు గత 8 నెలల నుంచి జీతాలు అందడం లేదని, వెంటనే విడుదల చేయాలని గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.గోపిరాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కుటుంబ పోషణ జరగక వారంతా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అవే పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్పీలకు కూడా గత ఏడు నెలలుగా జీతాలు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గిరిపుత్రిక పథకం కింద దాదాపు 715 మంది లబ్ధిదారులకు పెళ్లికానుక నిధులు ఇప్పటి వరకు విడుదల చేయలేదన్నారు. బెస్ట్ అవైలబుల్ పథకం కింద గిరిజన విద్యార్థులకు రావాల్సిన నిధులు కూడా విడుదల చేయలేదన్నారు.

- డిప్లమో ఇంజనీర్లను క్రమబద్ధీకరించాలి

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలోని డిప్లమో ఇంజనీర్ల పోస్టులను క్రమబద్ధీకరించాలని అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం విజయవాడలో పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా డిప్లమో ఇంజనీర్ల సర్వీసులను క్రమబద్ధీకరించలేదని, సీనియారిటీ జాబితాలు ప్రకటించకపోవడం శోచనీయమని అన్నారు.

గజవాహనంపై పద్మావతి వైభవం

తిరుచానూరు, నవంబరు 27: తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజు బుధవారం రాత్రి అమ్మవారు శ్రీమహాలక్ష్మి రూపంలో గజవాహనంపై విహరించారు. అమ్మవారికి జరిగే అన్ని వాహనసేవల్లో గజవాహన సేవకు విశేష ప్రాధాన్యముంది. తిరుమల శ్రీవారి మూలమూర్తి కంఠాభరణమైన లక్ష్మీ కాసులహారం ధరించి గజవాహనంపై అమ్మవారు ఊరేగుతుండగా అశేష భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు. అంతకుముందు ఉదయం అమ్మవారు దివ్యమోహిని రూపంలో పల్లకిలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం నాలుగు గంటలకు అమ్మవారిని స్వర్ణకమల తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగిస్తూ అర్చకులు, అధికారులు చందనం కలిపిన నీటిని భక్తులపై చల్లుతూ వసంతోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో గురువారం అమ్మవారి స్వర్ణరథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

పదిరోజులపాటు వైకుంఠ ద్వార దర్శనం

తిరుమల, నవంబరు 27: వైకుంఠ ఏకాదశి సందర్భంగా పదిరోజుల పాటు తిరుమలలో వైకుంఠ ద్వారాన్ని తెరిచి ఉంచాలని టీటీడీ అధికారులు కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఈ ప్రతిపాదనకు ఇప్పటికే ఆగమ సలహామండలి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా, డిసెంబరు మొదటివారంలో జరగనున్న ధర్మకర్తల మండలి భేటీలో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాలని యోచిస్తున్నారు.

నేటి నుంచి సైన్స్ సంబరాలు

ఎచ్చెర్ల, నవంబరు 27: ఏపీ సైన్స్ కాంగ్రెస్-2019కు సర్వం సిద్ధమయింది. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వేదికగా అంబేడ్కర్ వర్సిటీ, ఏపీ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో గురువారం నుంచి మూడురోజులపాటు ఈ సంబరాలు జరగనున్నాయి.

చట్టసభల్లో రిజర్వేషన్లపై ఉద్యమం: ఆర్.కృష్ణయ్య

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 27: పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి జాతీయ స్థాయిలో ఉద్యమం చేపడతామన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల వైసీపీ పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టినప్పుడు కాంగ్రెస్, టీఆర్ఎస్, డీఎంకే, అన్నాడీఎంకే, పీఎంకే, బీఎస్పీ, సమాజ్‌వాదీపార్టీ, ఆర్‌జేడీ తదితర 14 పార్టీలు మద్దతు ఇచ్చాయని, మిగతా పార్టీల మద్దతు కూడగడతామన్నారు.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia
మీ సమీపంలోని టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడగలరు

బహిరంగ టెండరు ప్రకటన నం. B/E.29/TrD/టెండరు/43(2019-20) తేది: 27.11.2019

దిగువ సంతకందారుచే దిగువ పనుల కొరకు IREPS పోర్టల్ ద్వారా ఇ-టెండర్లు కోరబడుచున్నవి.

క్ర.సం.1 : టెండరు నం: B/E.29/TrD/టెండరు/43 (19-20). పని వివరణ: విజయవాడ డివిజన్-GDR-BZA-DVD సెక్షన్‌లో ఇన్సులేటర్స్‌తోపాటు యాంటి క్లీప్ వైర్ రిప్లేస్‌మెంట్. పూర్తిచేయాల్సిన కాలం : 270 రోజులు. సుమారు విలువ (రూ.) :15,03,257/-, ఐయానా (రూ.) : 30,100/-, టెండరు ఫారం ధర (రూ.) : 2,000/-.

ముగింపు తేది మరియు సమయం : 18-12-2019న 15.00 గం.లు.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/TrD/విజయవాడ

బహిరంగ ఇ-టెండరు ప్రకటన నం. DFM/BZA/01/2019 తేది: 26.11.2019

భారత రాష్ట్రపతి తరఫున, దిగువ సంతకందారుచే ప్రతిదానికి ఎదురుగా తెలిపిన తేది మరియు 15.00 గం॥ల వరకు దిగువ పనుల కొరకు ఇ-టెండరు కోరబడుచున్నది.

క్ర.సం.1 : టెండరు నం: E-01-DFM-2019. పని పేరు : BZA - 21 నెలలు కాల పరిమితికి Sr.DFM/BZAలో వినియోగానికి టాటా సుమో/క్వాలిస్/టొలారో (లేదా) ఇదే విధమైన 4 వీలర్ మల్టీ-యుటిలిటీ వాహనం (నాన్-AC) అద్దెకు. పూర్తిచేయాల్సిన కాలం : 21 (ఇరవై ఒకటి) నెలలు. టెండరు విలువ (రూ.) : 8,19,000/-, ఐయానా (రూ.) : 17,820/-, టెండరు డాక్యుమెంట్ ధర (రూ.) : 2,000/-, ముగింపు తేది : 20-12-2019.

కాగోరు టెండరుదారులు, ఏదేని టెండరుకు ఏదేని మార్పులు/సవరణ తెలుసుకొనుటకు టెండరు ముగింపు తేదిలోగా వెబ్‌సైట్ : "www.ireps.gov.in" దర్శించవచ్చు అని సూచించబడుతున్నారు.

సీనియర్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్, విజయవాడ
A1931

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ : https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి.

తెలుగు అంతరించే పరిస్థితులు

- భాషాభిమానులపై ప్రభుత్వం ఎదురుదాడి: సీపీఐ రామకృష్ణ
- కొలకలూరి ఇనాక్‌కు 'బొల్లిముంత' పురస్కారం ప్రదానం

తెనాలి అర్బన్, నవంబరు 27: తెలుగుజాతిని చైతన్యం చేసే కళలు ప్రతి ఒక్కరి జీవితంలో ప్రభావితం చూపిస్తాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సుప్రసిద్ధ అభ్యుదయ సినీ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ శత జయంతి సభను బుధవారం గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు బొల్లిముంత శివరామకృష్ణ పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కె.రామకృష్ణ మాట్లాడుతూ 'రాష్ట్రంలో తెలుగుభాష అంతరించే దశకు చేరుకోబోతోంది. ఇకపై కళలు, సాహిత్యం, సభలు చూసే అవకాశం ఉండదు. సత్కారాలు చేసే పని అంతకన్నా రాదు. తెలుగుభాష చదివితేనే కదా సాహిత్యంలో మాధుర్యం తెలిసేది. తెలుగుభాషపై భాషాభిమానులు ఏమి మాట్లాడినా రాష్ట్రప్రభుత్వం ఎదురుదాడికి దిగుతోంది. ఇది మంచి పద్ధతి కాదు. ప్రాచీన కాలం నుంచి వచ్చిన ఒక భాషపై నిర్ణయం తీసుకునేటప్పుడు సుదీర్ఘ చర్చ జరిపిన తర్వాతే ముందడుగు వేస్తే బాగుండేది. ఇటువంటి ఏకపక్ష నిర్ణయం, మొండివైఖరి రాష్ట్రానికి శ్రేయస్కరం కాదు. రాజకీయ కోణాలు చూశారో... మరేమి ఆలోచించారో కాని కోట్ల మంది అభిమానించే భాషపై గొడ్డలిపెట్టడం బాధాకరం. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచిస్తే మంచిది' అన్నారు. ఆదర్శం కోసం సాహిత్యాన్ని సృష్టించిన బొల్లిముంత జనం కోసం పని చేశారని, ధనం కోసం కాదని నిరూపించారని, ఆయన అన్ని తరాలకు ఆదర్శమేనన్నారు.

ఏపీ రెడ్‌క్రాస్ చైర్మన్‌గా డాక్టర్ శ్రీధర్‌రెడ్డి

విజయవాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ శాఖకు చైర్మన్‌గా విజయవాడకు చెందిన ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ ఆరుమళ్ల శ్రీధర్‌రెడ్డి ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల రెడ్‌క్రాస్ ప్రతినిధులతో కూడిన రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు బుధవారం డాక్టర్ శ్రీధర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ బుధవారం ఉదయం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్‌రెడ్డి చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

బాలికలను వేధిస్తే కఠిన చర్యలు : హోంమంత్రి

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి సుచరిత హెచ్చరించారు. 'లైంగిక నేరాలపై బాలల నియంత్రణ చట్టం అమలు' అంశంపై సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం హోంమంత్రి మీడియాతో మాట్లాడారు. చట్టాలను బలోపేతం చేసి శిక్షలను కఠినతరం చేసే అంశంపై సీఎంతో మాట్లాడతామన్నారు. మహిళా, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ.. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై పాఠశాలలు, కళాశాలల్లో అవేర్‌నెస్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

ఇంటిస్థలాలకు భూసేకరణ చట్టం అమలు

- గ్రామసభల ఆమోదం నుంచి మినహాయింపు

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నవరత్నాల కింద పేదలకు ఇంటిస్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం భూసేకరణ చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకోసం గత ఏడాది కేంద్ర భూసేకరణ చట్టం (సెంట్రల్ యాక్ట్) అనుబంధంతో తీసుకొచ్చిన ఏపీ భూసేకరణ చట్టం-2018 వర్తింపచేయనుంది. ఈ మేరకు మండలాల వారీగా భూసేకరణకు అవసరమైన నోటిఫికేషన్‌లు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లను ఆదేశిస్తూ రెవెన్యూశాఖ మార్గదర్శకాలు ఇచ్చింది. రాష్ట్రంలో వచ్చే ఉగాది నాటికి 25 లక్షల మంది పేదలకు ఇంటిస్థలాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి పాఠకులకు తెలిసిన విషయమే. అయితే, ప్రభుత్వం వద్ద ఉన్న భూమి 19వేల ఎకరాలే. అదనంగా మరో 26,500 ఎకరాల ప్రైవేటు భూమిని సేకరణ కోసం కనీసం 16వేల కోట్లపైనే వ్యయం కానుందని రెవెన్యూశాఖ అంచనావేసింది. ఉగాదికి ఒక నెల ముందుగానే భూమిని సిద్ధం చేయాలని సీఎం జగన్ టార్గెట్ ఇచ్చారు. దీన్ని అందుకోవాలంటే శరవేగంగా భూసేకరణ చేపట్టాల్సి ఉంది. భూసేకరణ వ్యయం భారీగా ఉండటంతో పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామాల్లో అవకాశం ఉన్న చోట భూముల సమీకరణ (ల్యాండ్ పూలింగ్) చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే, ఇది ఎలా ఉన్నా, భూసేకరణ తప్పనిసరి. ఈ నేపథ్యంలో గ్రామం, పట్టణం వారీగా సేకరణకు అవసరమైన భూమిని గుర్తించాలని రెవెన్యూశాఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. మరోవైపు భూ సేకరణ చట్టాన్ని వర్తింపచేయడం ద్వారానే ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని దిశా నిర్దేశం చేసింది. అయితే, భూముల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో కన్సెంట్, సంప్రదింపుల ద్వారా సేకరణ జరుగుతుందా అన్న సందేహాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర చట్టంలోని తప్పనిసరి భూ సేకరణ అవకాశాన్ని వినియోగించుకునే అవకాశం ఉంది. ఏపీ భూ సేకరణ చట్టం ప్రకారం భూములు సేకరించాల్సి వస్తే మొత్తం 57 రోజుల్లో పూర్తికావాలని స్పష్టంచేశారు. తప్పనిసరి భూ సేకరణ అయితే, 2013 కేంద్ర చట్టం ప్రకారం 140 రోజుల్లో పనిపూర్తికావాలి.

మంత్రి పీఏ పేరిట మోసం

- ఏ పనైనా చేయిస్తానంటూ వల
- 5 నెలల్లో కోటికిపైగా వసూలు
- పోలీసులకు చిక్కిన నిందితుడు

నిందితుని వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

నెల్లూరు (క్రైం) నవంబరు 27: పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పీఏనని చెప్పుకుంటూ.. అమయాకులను నమ్మించి కోటి రూపాయలకుపైగా వసూలు చేసిన నిందితుడిని నెల్లూరు జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. నగర డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి ఆ వివరాలను బుధవారం మీడియాకు వెల్లడించారు. నెల్లూరు జిల్లా టీపీ గూడూరు మండలం ఈదూరుకి చెందిన గుండాల వంశీకృష్ణారెడ్డి 2013లో యాంటీ రేడియేషన్ చిప్ వ్యాపారం చేసి నష్టాల పాలయ్యాడు. ఆ తర్వాత హత్యలు, అత్యాచారాలు, నమ్మించి మోసం చేయడం తదితర నేరాలకు పాల్పడుతూ వస్తున్నాడు. ఈ క్రమంలోనే వైసీపీ అధికారంలోకొచ్చిన తర్వాత తాను ఐటీ మంత్రి పీఏనని చెబుతూ.. ఏ శాఖలో పని కావాలన్నా చేయిస్తానని, అనుమతులు ఇప్పిస్తానని రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలో అనేకమందిని నమ్మించాడు. వారి వద్ద నుంచి ఈ ఐదు నెలల్లో రూ.కోటికి పైగా వసూలు చేశాడు. అయితే.. అతనికి డబ్బులు చెల్లించిన వారిలో కొంతమంది నేరుగా మంత్రి గౌతమ్ రెడ్డి వ్యక్తిగత సహాయకుడు ఉరిబింది మనోహర్‌రెడ్డి వద్దకు వెళ్లి తమ పనులు ఇంకా ఎందుకు పూర్తికాలేదని ప్రశ్నించేవారు. వీరంతా ఎవరు, ఎందుకు వస్తున్నారో అర్థం కాని మనోహర్ రెడ్డి.. వివరాలు కూపీ లాగి వంశీకృష్ణారెడ్డి వారిని మోసం చేసినట్టు గుర్తించారు. దీంతో ఆయన ఈనెల 26న నగరంలోని వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో వంశీకృష్ణారెడ్డిపై ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి నగర డీఎస్పీ ఆధ్వర్యంలో సీసీఎస్ సీఐ ఐ శ్రీనివాసన్‌తో ప్రత్యేక టీంను ఏర్పాటు చేసి 24 గంటల్లోనే నిందితుడిని అరెస్టు చేశారు. గతేడాది విజయవాడ గవర్నర్ పేట పోలీసు స్టేషన్‌లో హర్షవర్ధన్ కనిపించడం లేదని నమోదైన మిస్సింగ్ కేసు నమోదైంది. అయితే హర్షవర్ధన్‌ను హైదరాబాద్‌లో క్రికెట్ బ్యాట్‌తో కొట్టి తానే హత్య చేసినట్లు పోలీసుల విచారణలో నిందితుడు పేర్కొన్నారు. అరెస్టయిన వంశీకృష్ణారెడ్డి నుంచి పోలీసులు స్కోడా కారు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

తిరుపతి విమానాశ్రయంలో

సెరిమోనియల్ లాంజ్

న్యూఢిల్లీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో కొత్తగా నిర్మించనున్న సెరిమోనియల్ లాంజ్‌కు అవసరమైన భూ కేటాయింపునకు బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ లాంజ్ నిర్మాణానికి ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు చెందిన 1,800 చదరపు మీటర్ల భూమిని కేటాయించేందుకు కేంద్రం అంగీకరించింది. ఈ భూమిని ఏపీ విద్యా, సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ(ఏపీఈడబ్ల్యూఐడీసీ)కి 15సంవత్సరాల లీజుపై నామమాత్రపు ధరకు కేటాయించాలని, లైసెన్స్ ఫీజు కింద ఏటా ఒక్క రూపాయి వంతున చెల్లించాలని కేంద్ర మంత్రిమండలి నిర్ణయించింది. తిరుమల శ్రీవారి ఆలయానికి తరచూ వచ్చే వీవీఐపీలు, వీఐపీల కోసం తిరుపతి విమానాశ్రయంలో ఈ లాంజ్ నిర్మాణం అనివార్యమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావించాయి. దీనిలో ఇపుడున్న లాంజ్‌లో కంటే అదనంగా మౌలిక సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ కొత్త లాంజ్‌ను ఏపీఈడబ్ల్యూఐడీసీ సంస్థ నిర్వహించనుంది. తిరుపతి విమానాశ్రయంలో భారీ విమానాల రాకపోకలకు అనుగుణంగా రూ.177కోట్ల వ్యయంతో రన్‌వేను విస్తరిస్తున్నట్లు కేంద్ర పౌర విమానాయానశాఖ సహాయ మంత్రి హర్దీప్ సింగ్ పూరి వెల్లడించారు. బుధవారం రాజ్యసభలో వైసీపీ నేత విజయసాయిరెడ్డి అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి లిఖిత పూరర్వకంగా జవాబిచ్చారు. 2021నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

అప్పుల బాధతో

ఇద్దరు రైతుల ఆత్మహత్య

వెంకటయ్య (ఫైల్)

నకరికల్లు/పోరుమామిళ్ల, నవంబరు 27: అప్పుల బాధ తాళలేక గుంటూరు, కడప జిల్లాల్లో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. గుంటూరు జిల్లా నకరికల్లు మండలం నరసింగపాడుకు చెందిన బిజ్జం ప్రసాదరెడ్డి(28) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ప్రసాదరెడ్డి తనకున్న పొలంతో పాటు ఐదెకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తుండేవాడు. నష్టాలు రావడంతో ఏటికేడు అప్పు పెరిగి రూ.9 లక్షలకు చేరుకుంది. అప్పుతీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపం చెంది మంగళవారం గుత్తికొండ వద్ద సాగర్ మెయిన్ కెనాల్ సమీపాన పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకోగా.. బుధవారం ఉదయం స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. ప్రసాదరెడ్డికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కడప జిల్లా పోరుమామిళ్లలోని తంభాబావివీధికి చెందిన శెట్టం వెంకటయ్య(62) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటయ్యకు ఎకరం పొలం ఉంది. సాగు నష్టాలకు తోడు కుటుంబ నిర్వహణ కోసం చేసిన అప్పు సుమారు రూ.7లక్షలకు చేరింది. ఈ నేపథ్యంలో కొంతకాలంగా బెంగళూరులో ఓ హోటల్‌లో పనిచేస్తున్న వెంకటయ్య ఇటీవల ఇంటికి వచ్చాడు. రుణదాతల ఒత్తిడి ఎక్కువ కావడంతో బుధవారం విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్సకోసం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

సీఎం

న్యాయం చేకూర్చని బిల్లు

రాజ్యసభ మంగళవారం ట్రాన్స్‌జెండర్ బిల్లు ఆమోదించిన తరువాత కూడా, దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆ బిల్లు సభాప్రవేశంతో ఆరంభమైన నిరసన ప్రదర్శనలు తగ్గుముఖం పట్టలేదు. ఈ బిల్లును కమిటీకి నివేదించి ట్రాన్స్‌జెండర్ల ఆకాంక్షలకు అనుగుణంగా దానిని మార్చాల్సిందిగా విపక్షాలు ప్రభుత్వాన్ని అభ్యర్థించాయి. కశ్మీర్ విషయంలో కేంద్రప్రభుత్వం కీలకనిర్ణయం తీసుకున్న ఆగస్టు 5వ తేదీన లోక్‌సభ పెద్ద చర్చ చేయకుండానే ఈ బిల్లును ఆమోదించిన విషయం తెలిసిందే. మూడేళ్ళుగా ట్రాన్స్‌జెండర్లు ఈ బిల్లులోని వివిధ అంశాలపై అభ్యంతరాలు, ఆందోళనలు వెలిబుచ్చుతున్నారు. మధ్యలో జరిగిన ఆ కొద్దిపాటి సవరణలు కూడా వారికి సంతృప్తి కలిగించలేదు. బిల్లుమీద అసమ్మతి, అసంతృప్తి ఉన్నప్పటికీ, అది తమకు న్యాయం గాక, మరింత అన్యాయం చేస్తుందని ట్రాన్స్‌జెండర్లు గోలపెడుతున్నప్పటికీ, ప్రభుత్వం ఈ బిల్లును నెగ్గించి, దానితోనే వారిని ఉద్ధరించేందుకు సిద్ధపడుతున్నది.

డిఎంకె సభ్యుడు తిరుచ్చి శివ డిమాండ్ మేరకు బిల్లును పరిశీలనకు పంపాలా వద్దా అన్న అంశంపై జరిగిన ఓటింగ్ సైతం ఓడిపోవడంతో ట్రాన్స్‌జెండర్ల చిట్టచివరి ఆశ నెరవేరకుండా పోయింది. ట్రాన్స్‌జెండర్ల ఆకాంక్షలకు అనుగుణంగా 2015లో తిరుచ్చి శివ ఓ ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. నలభై ఐదు సంవత్సరాల తరువాత రాజ్యసభ ఆమోదం పొందిన ప్రైవేటు బిల్లుగా ఇది చరిత్ర సృష్టించింది. ప్రభుత్వం ఈ బిల్లునే లోక్‌సభకు పంపాలని అప్పట్లో ట్రాన్స్‌జెండర్ సంఘాలు పట్టుబట్టాయి కూడా. కానీ, 2016 ఆగస్టులో ప్రభుత్వం తన బిల్లునే లోక్‌సభలో ప్రవేశపెట్టింది. 'పూర్తిగా మగా కాక, ఆడా కాక' అంటూ బిల్లు ఆరంభంలో చెప్పిన నిర్వచనం సహా అనేకాంశాలు తీవ్ర వివాదం రేపడంతో ప్రభుత్వం విధిలేక ఈ బిల్లును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి నివేదించినప్పటికీ, 2017 జులైలో కమిటీ ఇచ్చిన రిపోర్టును మాత్రం తిరగ్గొట్టింది. గత ఏడాది డిసెంబరులో తిరిగి బిల్లు లోక్‌సభలో ప్రవేశించినప్పుడు ట్రాన్స్‌జెండర్ నిర్వచనం సహా కొన్ని స్వల్ప మార్పులతో 27 సవరణలు జరిగాయి. అది రాజ్యసభ ఆమోదం కోసం పోయినప్పటికీ, ఇంతలోగా ఎన్నికలు ముంచుకొచ్చి దాని కాలపరిమితి కూడా ముగిసిపోయింది. మొన్న ఆగస్టు 5న తిరిగి అది లోక్‌సభలో ప్రవేశించినప్పుడు కూడా ఈ బిల్లు మాకొద్దంటూ ట్రాన్స్‌జెండర్లు దేశవ్యాప్త నిరసనలు నిర్వహించారు.

ఐదేళ్ళక్రితం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈ బిల్లుకు మూలం. సమాజంలో ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రధానంగా వారు చవిచూస్తున్న వివక్షను దృష్టిలో పెట్టుకొని వారి హక్కుల పరిరక్షణ లక్ష్యంగా కోర్టు చక్కని సూచనలు చేసింది. అందులో ముఖ్యమైనది జెండర్ గుర్తింపునకు సంబంధించిన అంశం. వీరి లైంగికత మానసిక, భావోద్వేగపరమైన వ్యవహారం కనుక జెండర్ గుర్తింపు స్వయం ప్రకటితమని న్యాయస్థానం తేల్చింది. మగ, ఆడ, లేదా ట్రాన్స్‌జెండర్ అని తమకు తాముగా ప్రకటించుకుంటే చాలుననీ, అమ్మాయి లేదా అబ్బాయిగా మారేందుకు ట్రాన్స్‌జెండర్లు చేయించుకొనే లింగమార్పిడి చికిత్సలు, హార్మోనల్ తెరపీలతో నిమిత్తం లేకుండానే వీరు తమ జెండర్‌ను గుర్తించుకోవచ్చునని కోర్టు ఆ తీర్పులో పేర్కొంది. కానీ, ఈ బిల్లు ఆ అవకాశాన్ని ఇచ్చినట్టుగానే కనిపిస్తూనే, జిల్లా మేజిస్ట్రేట్ ఆధ్వర్యంలోని కమిటీ ఒకటి వారి జెండర్ ధ్రువీకరించాలన్నది. అలాగే, మగ లేదా ఆడగా గుర్తింపు కావాలనుకున్న వ్యక్తి సైతం తొలుత ట్రాన్స్‌జెండర్‌గా జిల్లా మేజిస్ట్రేట్‌నుంచి సర్టిఫికేట్ పొంది, శస్త్రచికిత్స అనంతరం కోరుకున్న అసలు గుర్తింపును స్క్రీనింగ్ కమిటీలనుంచి పొందవలసి ఉంటుంది. చికిత్సలు ప్రభుత్వపరంగా ఉచితంగానో, కనీసం సబ్సిడీతోనో జరపాలన్న ట్రాన్స్‌జెండర్ల కోరిక కూడా ఈ బిల్లు నెరవేర్చలేదు. అందువల్ల, ఎక్కడో చేయించుకున్న లింగమార్పిడి చికిత్సలను కమిటీలు ఆమోదించకపోయే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ట్రాన్స్‌జెండర్లపై వివక్ష చూపరాదంటూ అనేకాంశాలను విపులంగా ఉదహరించిన ఈ బిల్లు, వారిపై జరిగే లైంగికదాడికి గరిష్ఠంగా రెండేళ్ళ వరకూ శిక్షను ప్రకటించినా, దానిని కచ్చితంగా నిర్వచించకపోవడంతో న్యాయస్థానాల్లో కేసులు నిలబడేవన్నది వారి భయం. తమపై లైంగికదాడిని ప్రభుత్వం చిన్నచిన్న నేరాల కోవలో చేర్చేసిందని కూడా వారు ఆవేదన చెందుతున్నారు. ఇక, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గంగా వీరిని గుర్తించి రిజర్వేషన్లు కల్పించాలని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ, ఈ బిల్లు ఆ ఊసు ఎత్తలేదు. ట్రాన్స్‌జెండర్లకు ఎవరూ ఉపాధి, ఉద్యోగాలను ఇవ్వనిస్థితి సమాజంలో ఉన్నప్పుడు ఈ ముఖ్యమైన విషయంలో పాలకులు మొఖం చాటేయడం సరికాదు. సెక్స్ వర్కర్లుగా, యాచకులుగా తప్ప ఇతరమార్గాల్లో జీవించగలిగే అవకాశం లేని ట్రాన్స్‌జెండర్లను ఉద్ధరించేందుకు పాలకులు ఇప్పటికైనా మార్గాలు అన్వేషించాలి.

చెవిలో పెద్ద పువ్వు!

'చెవిలో చిన్న మాట' శీర్షికన వచ్చిన 'కొంచం భయం.. కొంచం భక్తి!' (నవంబరు 17), అనే వ్యాసానికి స్పందన ఇది. స్థలా భావం వల్ల కొన్ని అంశాలకే పరిమితమౌతాను.

(1) బీజేపీయేతర రాజకీయ పార్టీలనూ, వాటి నాయకులనూ హేళన చేస్తూ; మోదీనూ, అమిత్ షానూ ఆకాశానికి ఎత్తుతూ సాగింది ఆ వ్యాసం, మొదటి నుంచి చివరి వరకూ! ఓట్ల రాజకీయాలతో అధికార పీఠాలెక్కి, తర తమ భేదాలతో ఒకే రకం విధానాలను అనుసరించే పార్టీలే అన్నీ--కాంగ్రెసు అయినా, బీజేపీ అయినా, ప్రాంతీయ పార్టీలైనా, కమ్యూనిస్టు పార్టీలైనా! ఓట్లు, లేదా సీట్లు ఏ పార్టీకి ఎక్కువ వస్తే, ఆ పార్టీ తనకి ప్రజామోదం ఉందని, తను ఏమి చేసినా చెల్లుతుందని వాదిస్తుంది. గత 72 ఏళ్లుగా జరుగుతున్నది ఈ రాజకీయ ప్రహసనమే! ఈ ప్రహసనంలో ఎవరు హీరోలూ, ఎవరు సహాయ నటులూ అని చూడక్కర లేదు. సారాంశం ముఖ్యం! అందరూ ప్రజల చెవుల్లో పూలు పెట్టేవారే. అందరూ హేళనకు అర్హులే. ఎవ్వర్నీ కీర్తించక్కర లేదు.

(2) ప్రధానిగా ఉన్న వ్యక్తిని పట్టుకుని 'చాయ్‌వాలా' అని ప్రశంసించడం అంటే పాఠకుడి చెవిలో పువ్వు పెట్టడమే. తప్పుదారి పట్టించే రాజకీయాలు పాఠకుడి చెవిలో చెప్పడమే. చాయ్ వాలాలు ఖరీదైన సూట్లూ, బూట్లూ వేసుకుంటారా? ఒకప్పుడు చాయి అమ్ముకునే కుర్రాడు అని అనుకున్నా, ప్రధాని అయ్యాక ఆ వ్యక్తి పాత్ర మారిపోతుంది. అతను జనాభాలో ఏ విభాగం వారి ప్రయోజనలకోసం పాటు పడుతున్నాడన్నది చూడాలి. ఒక దళిత నేపథ్యం ఉన్న వ్యక్తినైనా సరే ఈ దృష్టితో చూస్తేనే నిజం తెలుస్తుంది. కుటుంబ నేపథ్యం దళిత నేపథ్యమే అయినా, ప్రస్తుత స్థితిలో ఒక వ్యక్తి ఒక 'దళిత పారిశ్రామికుడు' కావచ్చు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడు అధికార స్థానంలోకి రాగానే, 'ఎర్ర బూర్జువా' అయిపోతున్నాడు. గుజరాత్, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కేరళ వంటి రాష్ట్రాలలో చాయ్ వాలా గానీ, దళిత స్త్రీ గానీ, బహుజనులు గానీ, కామ్రేడులు గానీ, అన్ని రకాల అసమానతలనూ చెక్కుచెదరనివ్వని పాలననే అందించారు గదా! తేడాలంటూ ఏవైనా వుంటే అవి పైపైనవే గాని మౌలిక మైనవి కావు.

(3) మోదీ ఛాతీ బలానికి కారణం, అతని వెనక వున్న 'వందకోట్ల మంది మనోబలమా'? వచ్చిన ఓట్లతోనే ప్రజా మద్దతును కొలిచినా వంద కోట్లమంది లేరే? సమాజం అంతా వర్గాలుగానూ, ఉపవర్గాలుగానూ, కులాలుగానూ, ఉపకులాలుగానూ, మతాలుగానూ, మతశాఖలుగానూ చీలిపోయి ఉన్న భారత సమాజంలో, జనాలందరూ ఒకే వ్యక్తికి, లేదా ఒకే పార్టీకీ, అందులోనూ ఒకే నాయకుడికే, నీరాజనాలు పట్టారని పాఠకుల్ని నమ్మిస్తే అది కచ్చితంగా చెవిలో పెద్ద పువ్వు అవుతుందే గానీ, 'చెవిలో చిన్న మాట' మాత్రం కాదు. కాలమ్, కలం చేతిలోవుందని ఏదో ఒక పక్షాన్ని భుజాన్న వేసుకుంటే అదేం న్యాయం? ఒక పార్టీ అధికార ప్రతినిధి హోదాలో ఈ కాలమ్ రాస్తే, దానిలో విమర్శించాల్సింది లేదు. 'ఓహో, ఈ కాలమిస్టు ఫలానా పార్టీ అధికార ప్రతినిధి అన్న మాట' అని తెలుసుకుని, ఇష్టమైనవాళ్ళు చదువుతారు; లేని వాళ్ళు పేజీ తిప్పేస్తారు.

(4) "జనం మతావేశాలకు అతీతంగా ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించడమే మన లౌకిక వాదం. ఇప్పుడున్నది ఆ లౌకిక వాదమే" అని వాస్తవ విరుద్ధమైన సమర్థన! 'జై శ్రీరామ్' అనమని ఒత్తిడి చెయ్యడం, అలా అనని పర మతస్థుల మీద మూకుమ్మడిగాపడి చచ్చిపోయేలా కొట్టడం; గోరక్షణ పేరుతో, కేవలం అనుమానంతో, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని చావ బాదడం, అలాంటి వాటిని చెదురుమదురు సంఘటనలుగా, తేలిగ్గా తీసేయడం; ప్రధాన మంత్రి (మొక్కుబడిగా) ఖండించారుగా అని సమర్థించుకోవడం; 'అది శాంతిభద్రతల సమస్య, రాష్ట్రాల పరిధిలోకి వస్తుంది, ప్రధానికేం సంబంధం, ప్రధాని ప్రతిదానిమీదా స్పందించాలంటే ఎలా?' అంటూ ఉంటారు మోదీ భక్తులు... ఇదా పరమత సహనం?

(5) భారత దేశంలో మతం ఎన్నడూ రాజ్యాన్ని శాసించింది లేదట! రామాయణంలో శంబూకుణ్ణి వధించడంలో మతం పాత్ర ఏమీ లేదా? బౌద్ధ ఆలయాల విధ్వంసంలో హిందూ మతాన్ని అనుసరించిన రాజుల పాత్ర లేదా? కాంగ్రెసు కాలంలోని ధీరేంద్ర బ్రహ్మచారి నుంచి మొదలు పెట్టి, బీజేపీ యోగి ఆదిత్యనాథ్ వరకూ జరుగుతున్న పనుల్లో మతం పాత్ర ఏమి లేదా? బాబ్రీ మసీదును కూలగొట్టి, రామాలయం కోసం చేసిన రాజకీయాలలో మతం పాత్ర లేదా?

(6) "ఓడిపోతే, రాహుల్‌లా విదేశాల్లో కాకుండా, హిమాలయాల్లోనే తపస్సు చేసుకోగల ధైర్యం అతని (మోదీ) సొంతం." అని కీర్తన! రాహుల్ గాంధీ కొన్నాళ్ళకోసారి విహార యాత్రకి విదేశాలు వెళ్తూ వుంటే, మోదీ చేసేది విదేశాలకి రాజకీయ విహార యాత్ర! ఎన్నికలకు ఒక రోజు ముందు హిమాలయాల్లో చేసిన తపస్సు కూడా– ఎన్నికల ప్రచారంలో భాగమా, మళ్ళీ ప్రధాని పీఠం కోసమా, తపస్సు కోసమా?

(7) కుటుంబ వారసత్వ రాజకీయాలను విమర్శిస్తూ, ప్రజాస్వామ్య యుగంలో రాజకీయాల గురించి మాట్లాడుతూ– బృహస్పతీ, మరుత్తుడూ అంటూ పురాణ పురుషుల్ని తీసుకొచ్చి మోదీ–షా ద్వయాన్ని ఒక రాజుగా పోల్చడం ఏమిటి? పైగా 'చరిత్రలో తప్పులుచెయ్యని రాజెవ్వడు?' అని సమర్థన! 1984లో కాంగ్రెసు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన సిక్కుల ఊచకోతా, 2002లో మోదీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరిగిన ముస్లింల ఊచకోతా కూడా 'తప్పులు' మాత్రమేనా? ఈ రెండు సంఘటనలలోనూ ఎవరు ఎవరికి "అపకారం" తలపెట్టారు. ఆ అపకారాన్ని చూస్తూ ఊరుకున్న పాలకులు రాజీవ్ గాంధీ, నరేంద్ర మోదీలు కాదా?

మోదీ పట్ల ఇతరులకు "కొంచం భయం, కొంచం భక్తి" ఉన్నాయేమో గానీ, మోదీని ఒక సర్వాంతర్యామిగా చిత్రించి, తన సంపూర్ణ భక్తిప్రపత్తుల్ని ప్రదర్శించారు, ఈ కాలమిస్టు. భక్తులు, తాము నమ్మే దేవుణ్ణి ఉద్దేశించి, "నిన్నే గాని మది, నెన్న జాల వొరుల" అంటారే, అలాగ!

■ ఈడ్పుగంటి నరోజీ

నిరాసక్త మౌనం క్రూరమైన నిశ్శబ్దం

సందర్భం

■ కె. శ్రీనివాస్

కలికాలం అని ఇందుకే అంటారేమో, ఇవాళిటికీ రేపటికీ మరింతగా పాతాళానికి పడిపోవడం, మరిన్ని ఘోరాలు చూడగలగడం, కళ్లు ఎండిపోయినా గుండెలు పగిలిపోయే దుఃఖాలు ఎడతెగకపోవడం, నెనరు లేదు న్యాయం లేదు, జాలి లేదు కరుణ లేదు, అయ్యోపాపం అన్న మనసు లేదు; మృత్యుక్రీడలను నిర్లిప్త వినోదంగానో పరిహాస విషాదంగానో చూస్తూ ఆనందించడం, అబద్ధం నుంచి పారిపోవడం, దౌర్జన్యానికి సాగిలపడడం, వుట్టి డొల్ల మేధను కీర్తించడం, ఆత్మస్తుతిలో పరవశించడం– ఏమి కాలమిది ఏమి కాలమిది, సమస్త జీవనరంగాలలో క్షణక్షణానికి జారిపోతున్న సూచికలు! మనమేనా మనమేనా పోయినేడున్న మనమేనా, ఐదేళ్ల కిందటి మనమేనా, గుండెలను జెండాలుగా ఎగరేసిన మనమేనా!

యాభై రోజుల సమ్మె. తమ కోసమే కాదు, సంస్థ కోసం అన్నారు. ఇటువంటి సమ్మెనే తెలంగాణ కోసం కూడా చేశామన్నారు. ఏలిక వినదలచుకోలేదు. ఆయనకు నచ్చలేదు. యాభైవేలమందితో పంతం పెట్టుకున్నాడు. బక్కప్రాణులు కోర్టుకెళ్లారు. ధర్మగంట మోగినట్టే అనిపించింది. లాభం లేకపోయింది. చేతనైనన్ని రకాలుగా ఆక్రోశించారు, ఆక్రందించారు, గుండెలు బాదుకున్నారు. గుండెలు ఆగిపోయాయి. శరీరాలు దహించుకుపోయాయి, శవయాత్రలు బారులు తీరినా ఒక నిరాసక్త మౌనం ఒక క్రూరమైన నిశ్శబ్దం మాత్రమే స్పందనలుగా మిగిలాయి.

చివరకు వాళ్లు ఓడిపోవడానికి ఒప్పుకున్నారు. లొంగిపోవడానికి సిద్ధపడ్డారు. పంతమే కదా అన్నా, దానికి ముగింపు చెప్పమన్నారు. పనిలోకి వస్తాం, చేర్చుకొమ్మన్నారు. ఒకవైపు పరాజయ భారం, దానికి తోడు తెరచుకోని గేట్ల దగ్గర పరాభవ పర్వం. అధికారి కాళ్ల మీద పడ్డ ఆ ఆడపడుచును చూశారా, పోలీసులు ఈడ్చి వ్యాన్‌లో పడవేస్తే గుడ్లలో నీరు గుక్కుకుంటున్న ఉద్యోగినులను చూశారా, ఆత్మగౌరవం కదా, తెలంగాణ ఉద్యమపు ఆత్మ! చెదిరిన ఆత్మలతో క్రీడలాడవచ్చునా?

పాదచారికి భద్రత లేదు, వాహనదారుకు నమ్మకం లేదు. ఆపద్ధర్మంగా ఆర్టీసీ చక్రం పట్టిన డ్రైవర్లకు ఏ లైసెన్సుందో లేదో తెలియదు, మనుషుల ప్రాణాలు బలాదూర్, మాట్లాడేవాడు లేడు. చేవచచ్చి నోరుమూసుకుని ఉన్న ఒక సమాజాన్ని, నిత్యం సింహాసనం మీద కూర్చుని, ఒక మౌనం సమీక్షిస్తూ ఉంటుంది. ప్రభుత్వం ఉన్నదా లేదా అన్న ప్రశ్నకు సమాధానం ఇచ్చేవారు కూడా ఎవరూ కనిపించరు. అడగడానికెవరూ లేకపోవడమో, అడిగినా స్పందించవలసిన అగత్యం లేకపోవడమో, ఒక అశక్త నిస్పృహ అంతటా ఆవరించింది.

చూడడానికి కళ్లు, వినడానికి చెవులు, స్పందించడానికి హృదయం లేకపోయాక, ప్రభుత్వం ఒక పాషాణం మాత్రమే, ప్రజల చేత ప్రభుత్వం ఎట్లాగూ కాదు, ప్రజల కొరకూ కాదు, ప్రజల వల్ల ఏర్పడిన ప్రభుత్వం మాత్రమే. అటువంటి ప్రభుత్వాలన్నీ మొదట ప్రజల వల్లనే ఏర్పడతాయి, తరువాత ప్రజలకే 'జెల్ల' కొడతాయి కాబోలు! ఏమి కీర్తి మూటగట్టుకోబోతున్నారు, భయంతోనో దైన్యంతోనో ఇవాళ నినాదాలే కాదు మాటలు కూడా అణగారిపోయి ఉండవచ్చు. కానీ, వేలాది లక్షలాది మనసుల్లో నిశ్శబ్దంగా ఎన్ని రోదనలో ఎన్ని కోపాలో శాపాలో, ఏమి పొందినట్టు, ఏ గొప్ప ఫలితాన్ని సాధించినట్టు, ఏ మానవతాకిరీటాన్ని తగిలించుకున్నట్టు?

ఏలికను మాత్రమేనా తప్పు పట్టవలసింది, ప్రతిచిన్న జనాందోళనను రాజకీయ పరిణామంగా మలచాలని కాచుకుని ఉన్న ప్రతి పక్షాలు ఏమి చేశాయి! ఎక్కడి దాకా కార్మికులతో కలసి నడిచాయి! ఎంత అర్థ మనస్కత, ఎంతటి భద్ర సమర్థన! ఎన్నెన్ని ఉద్యమరూపాలను కార్మికులు ఆశ్రయించారో అన్నిటా కార్మికులు, వాళ్ల కుటుంబసభ్యులు, వారికి తోడు, వామపక్షాలు, వారి ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల కార్యకర్తలు. అంతే. వాళ్ళే కదా రక్తసిక్తంగా దెబ్బలు తిన్నారు. మరి మీరెక్కడిదాకా వచ్చారు? నిజమే, మద్దతులు పలికారు. గృహ నిర్బంధాలు చవిచూశారు. వీలయినచోట్ల వీధుల్లో నడిచారు. కానీ, ఆ సంఘీభావంలో సోదరత్వం లేదు. పాలకుడు మొండిగా ఉన్నాడు దిగిరాడు అని అర్థమయిన వెంటనే నెమ్మదిగా జారుకున్నారు. కొంచెం కొంచెంగా స్వరం తగ్గించారు. కేంద్రంలో అధికారంలో ఉండి, కొండంత అండగా కనిపించిన పార్టీ, తన బాధ్యతను నెరవేర్చిందా? కార్మికులు పెట్టుకున్న ఆశలకు దీటుగా వ్యవహరించిందా? అయినదానికీ కానిదానికీ రాష్ట్రాలను ఇబ్బందిపెట్టాలనుకునే కేంద్రసర్కారు, తన అస్త్రాలను ఒక్కటైనా ఇక్కడ ఒక మంచిపనికి ఉపయోగించిందా? తమ మీద అమితంగా ఆశపెట్టుకుంటున్నారని తెలిసినప్పుడైనా, ఏదో ఒక దశలో, తమ వల్ల కాదు అని కార్మికులకు సూచన చేసి ఉండవలసింది. సమ్మె విజయవంతం అయితే, దాని వల్ల కలిగే రాజకీయ లాభాన్ని అనుభవించాలనే కదా వచ్చాయి పార్టీలు, పరిస్థితి అనువుగా లేనప్పుడు, అండగా నిలవాలి కదా, తమకున్న పలుకుబడితో కార్మికులకు సంఘీభావాన్ని నిర్మించాలి కదా, కనీసం వారి కుటుంబాలకు అండదండగా ఉండడానికి పెద్ద ఎత్తున నిధిసేకరణ అయినా చేయాలి కదా? ఈ పార్టీలు, ఈ నాయకులు ప్రత్యామ్నాయాలు కాగలరా, ప్రజలకు ఏ ఆశ అన్నా ఇవ్వగలరా? తుంటెత్తేసి ఎందుకు మొద్దునెత్తుకోవాలి?

> ప్రభుత్వ అధికారానికి వెలుపల, ఒక నైతిక అధికార వ్యవస్థ ఉండాలి. అటువంటిది ఏర్పడే అవకాశం లేకుండా, ఉద్యమంలో క్రియాశీలంగా, ఆలోచనాత్మకంగా పనిచేసిన సకల శక్తులను ఒక్కొక్కటిగా వేరుచేసి, వాటికి తామిచ్చే వాస్తవ పరిగణన ఏమిటో ప్రభుత్వం చూపిస్తున్నది. తెలంగాణ ఉద్యమంలో అత్యంత ముఖ్యమైన శక్తి కార్మిక, ఉద్యోగ వర్గాలు. ఈ సమ్మెపై ప్రభుత్వ వైఖరితో ఆ వర్గాలతో ప్రభుత్వం ఏ ప్రాతిపదిక మీద వ్యవహరించదలచుకున్నదో స్పష్టం అయింది.

కాంగ్రెస్‌కు సంకల్పశుద్ధి లేదు. పదిమంది నేతల మధ్య దిక్కుతోచని వారు ఆ పార్టీ కార్యకర్తలు. బిజెపి తలచుకుంటే చేయగలదు, ఆ పార్టీకి అవసరం కూడా. కానీ, కేంద్ర చట్టాన్ని ఉపయోగించే ప్రైవేటీకరణ చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం అన్నందుకో, మొత్తంగా సమ్మెలకు వ్యతిరేకంగా ప్రైవేటీకరణకు అనుకూలంగా ఉండాలన్న విధానం వల్లనో కేంద్రం ముందరి కాళ్లకు బంధాలు పడ్డాయి. ఆర్టీసీ కార్మికులు అంతిమంగా ఎదుర్కొన్న దుస్థితికి ప్రధాన కారకులు ప్రభుత్వంతో పాటు ఈ రెండు రాజకీయపార్టీలు, సాటి కార్మికులకు అండగా నిలవని ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు, సకలజనులు. నేరంలో ఎవరి భాగం వారిది. ఎవరి భయాలు వారివి. ఎవరి ప్రయోజనాలు వారివి.

కోదండరామ్ కనుక రాజకీయ పార్టీ పెట్టకుండా, తెలంగాణ పౌర సమాజం ప్రతినిధిగా మార్గదర్శిగా కొనసాగగలిగి ఉంటే, ఈ సమ్మె ఈ రకంగా జరిగేదీ కాదు, ముగిసేదీ కాదు. వ్యక్తిగా ఆయన శక్తి గురించి చెప్పడం కాదిది. ఆయన ఒక ప్రతీక మాత్రమే. కోదండరామ్ నిష్కుమణతో ఉద్యమశ్రేణుల అప్రధానీకరణ పూర్తయింది. ఇప్పుడు ఆయన ఒకానొక బలహీన, అనామక పార్టీ ప్రతినిధి మాత్రమే. తెలంగాణ పౌర సమాజం తరపున గట్టిగా వ్యక్తీకరించగలిగిన, తన విశ్వసనీయత, నిజాయితీల ద్వారా సంఘీభావాన్ని కూడగట్టగలిగిన ఒక్క పెద్దమనిషి కూడా లేకపోవడం ఈ సందర్భంలోనే కాదు, మొత్తంగా తెలంగాణ భవిష్యత్తుదృష్ట్యా కూడా ఆందోళనకరం. ఉద్యమాలతో రాటుదేలిన తెలంగాణలో పెద్దమనుషులు లేకుండా పోలేదు, గౌరవనీయులు లేకపోలేదు.

కానీ, ప్రభుత్వానికి సంక్రమింపజేసిన అపరమిత అధికారాల కారణంగా, ఏ హితవును, ఏ హెచ్చరికను, ఏ సూచనను వినిపించుకోని రీతిలో ఏలికలు వ్యవహరించగలుగుతున్నారు. ప్రభుత్వ అధికారానికి వెలుపల, ఒక నైతిక అధికార వ్యవస్థ ఉండాలి. అటువంటిది ఏర్పడే అవకాశం లేకుండా, ఉద్యమంలో క్రియాశీలంగా, ఆలోచనాత్మకంగా పనిచేసిన సకల శక్తులను ఒక్కొక్కటిగా వేరుచేసి, వాటికి తామిచ్చే వాస్తవ పరిగణన ఏమిటో ప్రభుత్వం చూపిస్తున్నది. తెలంగాణ ఉద్యమంలో అత్యంత ముఖ్యమైన శక్తి కార్మిక, ఉద్యోగ వర్గాలు. ఈ సమ్మెపై ప్రభుత్వ వైఖరితో ఆ వర్గాలతో ప్రభుత్వం ఏ ప్రాతిపదిక మీద వ్యవహరించదలచుకున్నదో స్పష్టం అయింది.

నమ్మిన పార్టీకో, నాయకుడికో మన నమ్మకాన్ని, చొరవను బ్లాంక్ చెక్ లాగా ఇచ్చేయడంలోనే ఉన్నది సమస్య. ఇప్పుడిటువంటి స్థితి ఎదురయినప్పుడు, ఎట్లా ఎట్లా అని దేబిరించడం అంటే, కోల్పోయిన చొరవను వెదుక్కుంటున్నట్టు. కానీ, గతంలో క్రియాశీలత, ఆత్మవిశ్వాసం, ధైర్యం ఎక్కడ సమకూరాయో తిరిగి అక్కడే అన్వేషించాలి. అదే ప్రజాక్షేత్రం. ■

అవినీతి కేసుల్లోనూ తక్షణ తీర్పులు

కక్షిదారులు కాటికి పోయినా కోర్టు తీర్పు రాదనే అపప్రథ ఉన్న ఈ రోజుల్లో దశాబ్దాల తరబడి గదుల్లో పేరుకుపోయిన కేసులకు తెరతీస్తూ ఇటీవల సర్వోన్నతం వెలువరించిన తీర్పులు చారిత్రాత్మకం. ప్రజలకు న్యాయస్థానాలపై మక్కువ పెంచేవిగా ఈ తీర్పులు ఉండడం విశేషం. తలాక్, సమాచార హక్కుచట్టం, మహారాష్ట్రలో రాజకీయ ప్రతిష్టంభన ఏర్పడిన ఇరవై నాలుగు గంటలు తిరక్కుండానే ప్రజా ప్రభుత్వం ఏర్పడే విధంగా... ఇలా ఎన్నో తనదైన తీర్పులతో సర్వోన్నత న్యాయస్థానం ప్రతిష్ఠ పెంచుకుంది. ప్రజాప్రతినిధులు, అధికారుల అవినీతి కేసులపై కూడా ఇదే విధంగా న్యాయస్థానాలు వేగంగా విచారించి తీర్పులు చెప్పాలి. ఆ అవినీతి సొమ్మును కక్కించాలి. ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులు బొక్కిన వేలు, లక్షల కోట్ల సొమ్మును వెలికి తీసేలా, అవినీతి కేసులపై తీర్పులివ్వాలి. ఎన్నో క్లిష్ట సమస్యలకు చిటికెలో పరిష్కారం చూపుతున్న న్యాయస్థానాలు వేల కోట్ల ప్రజాధనాన్ని పరిరక్షించడంలో కాలయాపన లేకుండా తీర్పులివ్వాలి. మాంద్యం పరిస్థితులను అధిగమించడానికి ఆ అవినీతి ధనాన్ని ఉపయోగిస్తే దేశానికి ఎంతో మేలు జరుగుతుంది. సంక్షేమ పథకాలకు వినియోగిస్తే ప్రజలకు ఎంతో ఆసరా దొరుకుతుంది.

– యర్రమోతు ధర్మరాజు, దవళేశ్వరం

జనవాక్యం

శ్రామిక రాజ్యానికి బాటలు వేసిన ఎంగెల్స్

"ప్రపంచ కార్మికులారా ఏకంకండి పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్ళు తప్ప" అంటూ ప్రపంచ కార్మిక వర్గానికి తన సహచరుడు, ప్రాణ స్నేహితుడు కారల్ మార్క్స్‌తో కలసి శక్తివంతమైన నినాదాన్ని ఇచ్చి పెట్టుబడిదారీ దోపిడీ సమాజాన్ని గడగడ లాడించిన కమ్యూనిస్టు సిద్ధాంతవేత్త, తత్త్వవేత్త ఫ్రెడరిక్ ఎంగెల్స్.

ఎంగెల్స్ 1820 నవంబరు 28న జర్మనీలోని ప్రష్యాలోని రైన్ ప్రావిన్స్‌లోని బార్మెన్‌లో ఒక సంపన్న వస్త్ర వ్యాపారి కుటుంబంలో జన్మించారు. వ్యవస్థీకృత మతంపైన, పెట్టుబడిదారీ విధానంపైన జర్మన్ తత్వవేత్త హెగెల్ రచనల ప్రభావంతో వ్యతిరేక భావాలను పెంచుకున్నారు. 22 ఏళ్ల వయస్సులో కుటుంబ వ్యాపారంలో ప్రావీణ్యం సంపాదించడానికి మాంచెస్టర్‌లోని ఒక వస్త్ర తయారీ కేంద్రానికి వెళ్ళిన ఎంగెల్స్‌కు అక్కడే మార్క్స్‌తో పరిచయం జరిగింది. మార్క్స్, ఎంగెల్స్ కలసి పెట్టుబడిదారీ విధానాన్ని విమర్శిస్తూ ఒక ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేశారు. 'కమ్యూనిస్టు మేనిఫెస్టో', 'దాస్ కాపిటల్' లాంటి అనేక గ్రంథాల రచనలకు ఇరువురు కలసి పూనుకున్నారు. 1883లో మార్క్స్ మరణం తర్వాత కాపిటల్ రెండవ, మూడవ సంపుటాలను సవరించి, థియరీస్ ఆఫ్ సర్‌ప్లస్ వాల్యూపై మార్క్స్ అభిప్రాయాలను క్రోడీకరించి దాస్ కాపిటల్‌కు నాలుగవ వాల్యూమ్‌గా ప్రచురించారు. 1845లో ఇంగ్లీషు నగరాల్లో వ్యక్తిగత పరిశీలన, పరిశోధనల ఆధారంగా 'ది కండిషన్ ఆఫ్ వర్కింగ్ క్లాస్ ఇన్ ఇంగ్లాండ్' గ్రంథాన్ని ప్రచురించారు. దోపిడీ సమాజాన్ని కూల్చి శ్రమజీవుల రాజ్యాధికారం సాధించడం పట్ల ఎంగెల్స్‌లో వున్న నిబద్ధత, పట్టుదల శ్లాఘనీయం. ఆనాటి జర్మన్ పాలకుల నిర్బంధాలను, అణచివేతలను లెక్కచేయకుండా, దేశ బహిష్కరణకు గురిచేసినా జర్మన్ నుంచి ఇంగ్లాండ్ చేరి ఎన్నో కష్టాల మధ్య గ్రంథ రచన చేశారు. అసమాన మేధోసంపత్తి కలిగి, దోపిడీ లేని సమసమాజ స్థాపనకు జీవితాన్ని ధారబోసిన ఎంగెల్స్ 1895 ఆగస్టు5న గొంతు క్యాన్సర్‌తో మృతిచెందాడు

శ్రీ శక్తి

క్యాబ్ డ్రైవర్ల దోస్త్

యమునా శాస్త్రి... బెంగళూరులో స్థిరపడ్డ తెలుగమ్మాయి. 'క్యాబ్ దోస్త్' స్టార్టప్‌ను ఏర్పాటు చేసింది. క్యాబ్ డ్రైవర్లను 'ఆర్థిక అక్షరాస్యుల'ను చేయడమే గాక, వాళ్లకి 'ఆర్థిక గౌరవాన్ని' తెచ్చింది. ఫైనాన్స్ టెక్‌లో కాలుపెట్టిన సామాజిక ఔత్సాహిక పారిశ్రామికవేత్త. రెండేళ్ల క్రితం... హైదరాబాద్‌లో జరిగిన 'గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్ (జిఇఎస్)'లో పాల్గొన్న 400 స్టార్టప్స్ అధినేతల్లో ఆమె ఒకరు. ఈ 'క్యాబ్ దోస్త్' 'నవ్య'తో ముచ్చటించారు. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే...

"నేను తెలుగు అమ్మాయినే కానీ స్థిరపడింది బెంగళూరులో. ఎం.కామ్ చదివా. రిస్క్ కన్సల్టింగ్ ప్రాక్టీస్‌లో సీనియర్ కన్సల్టెంట్‌గా చేశా. ఆ తర్వాత అంటే 2015లో 'క్యాబ్ దోస్త్' స్టార్టప్ మొదలెట్టా. మా నాన్న పలు బ్యాంకులు, ఎల్.ఐ.సి వంటి సంస్థలకు ఆర్థిక సలహాదారుగా పనిచేశారు. ఆయన దగ్గరకు మధ్యతరగతివారు ఆర్థిక సంబంధమైన సలహాల కోసం వస్తుండేవారు. వారికి మా నాన్న ఫైనాన్షియల్ సేవలను అందించేవారు. ఆ విధంగా సామాన్యుల ఆర్థిక కష్టాలపై నాకు ఓ అవగాహన ఏర్పడింది.

డ్రైవర్లకు అండగా...

నేను 2011లో (కేపీఎంజీ)లో ఉద్యోగం చేసేటప్పుడు రోజూ క్యాబ్‌లో వెళ్లేదాన్ని. ప్రయాణంలో డ్రైవర్లతో మాట్లాడుతుండేదాన్ని. వాళ్లు ఎంత సంపాదిస్తున్నారు, ఆదాయం పన్ను కడతారా, రుణం కావాల్సి వస్తే ఏం చేస్తారు, సేవింగ్స్ చేస్తున్నారా లాంటి ప్రశ్నలు అడిగేదాన్ని. అన్నింటికీ డ్రైవర్ల నుంచీ 'నో' అనే సమాధానమే వచ్చేది. అప్పుడే క్యాబ్ డ్రైవర్లకు సాయపడాలని నిశ్చయించుకున్నా. ఎందుకంటే ఇప్పుడు ప్రభుత్వాలు కానీ, బ్యాంకులు కానీ మునుపట్లా లేవు. అన్నీ డిజిటల్ ఎకానమీ వైపు దూసుకుపోతున్నాయి. అలాంటి వాతావరణంలో చాలామంది సాధారణ ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు 'పాన్' కార్డు, బ్యాంకు అకౌంట్ లేవని గ్రహించాను. ఏదైనా అనుకోని ఆర్థిక అవసరం పడితే వాళ్లు వడ్డీ వ్యాపారుల దగ్గరకు వెళతారు. వాళ్లేమో అధిక వడ్డీ రేట్లతో పీల్చి పిప్పి చేస్తుంటారు. ఇది 2011 సంవత్సరం మాట.

మొదట్లో ఇలాంటి కొందరికి అవసరమైన డాక్యుమెంట్లను అందజేసేదాన్ని. కానీ అది డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలకు సంపూర్ణ పరిష్కారం కాదనిపించింది. అందుకే 2015లో 'క్యాబ్ దోస్త్' స్టార్టప్‌ను ప్రారంభించా. ఇది ఫైనాన్షియల్ టెక్ రంగం కిందకు వస్తుంది. క్యాబ్ డ్రైవర్లకు సురక్షిత ఆర్థిక భవిష్యత్ కల్పనే మా కంపెనీ మిషన్. పది భాషల్లో సేవలు అందిస్తున్నాం.

ఐటీ రిటర్న్స్ ముఖ్యం..

రుణాలు, ఇన్‌కమ్ ప్రూఫ్‌లు, మరెన్నింటికో ఆదాయం పన్ను ఫైలింగ్ అవసరం. అలాగే ప్రతిచోటా ఐటీఆర్ డెస్క్ (ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్స్ డెస్క్)అవసరం ఉంది. మా స్టార్టప్ ప్రధానంగా సామాజిక బాధ్యతతో కూడిన అత్యాధునిక సాంకేతికపరిజ్ఞానంతో పనిచేసే సంస్థ. దీని లక్ష్యం ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్స్ ఫైలింగ్‌లో క్యాబ్ డ్రైవర్లకు సహాయంపడటంతో పాటు... వారిలో ఆర్థికపరమైన అంశాలపై చైతన్యాన్ని పెంపొందించాలనేది. ఆధార్ కార్డును 'పాన్'కు అనుసంధానించడం, సేవింగ్ స్కీమ్స్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, పెట్టుబడులు వంటి ఆర్థికపరమైన అంశాలపరంగా కూడా సమరమైన సేవలను క్యాబ్ డ్రైవర్లకు అందజేయాలన్నది మరో లక్ష్యం. వారితో మాట్లాడినప్పుడు యజమాని, ఉద్యోగుల మధ్య సంబంధాలు లేకపోవడం గమనించా. అందరివీ కాంట్రాక్టు ఉద్యోగాలే. 'క్యాబ్ దోస్త్' స్టార్టప్‌కి శ్రీకారం చుట్టేముందు ఆరు నెలల పాటు క్యాబ్ డ్రైవర్ల సమస్యలపై అధ్యయనం చేశాం. వాళ్లకి సహాయపడే ప్రత్యేక డెస్క్‌లాంటివి లేకపోవడం గమనించా.

98 శాతం మందికి తెలియదు!

మా అధ్యయనంలో భారతదేశంలో 98 శాతం ట్యాక్సీ డ్రైవర్లకు ఆదాయపన్ను రిటర్న్స్ ఫైల్ చేయాలన్న విషయమే తెలియదని వెల్లడైంది. అలాగే గతంలోని టీడీఎస్ రీఫండ్స్‌ను కూడా క్లెయిమ్ చేసుకోవాలని తెలియదు. దురదృష్టకరమైన విషయమేమిటంటే కంపెనీ యాజమాన్యాలు వాళ్లని 'తాత్కాలిక కాంట్రాక్ట్ పనివారి'గా చూస్తూన్నారే తప్ప సంస్థలో ఉద్యోగుల్లా చూడడం లేదు. దీనివల్ల న్యాయపరమైన ప్రత్యామ్నాయాలు డ్రైవర్లకు కష్టమవుతోంది. ఆదాయపన్ను తదితర ఆర్థిక అంశాలపరంగా సరైన డాక్యుమెంటేషన్ లేకపోవడంతో ఆర్థికరంగంలో వీళ్లు మినహాయింపునకు గురవుతున్నారు. మా టార్గెట్ కస్టమర్లు ట్యాక్సీడ్రైవర్లు, డెలివరీ పార్ట్‌నర్స్, ట్రక్ అండ్ బిజినెస్ డ్రైవర్లు. అలాగే చిన్నతరహా, స్వయం ఉపాధి రిటైలర్స్, అవ్యవస్థీకృత రంగంలోని వాళ్లు. వీరిని ఆర్థిక విషయాల పరంగా చైతన్యవంతుల్ని చేయడమేగాక ఆర్థికరంగంలో వారిని భాగస్వాములుగా చేయడం మా లక్ష్యం.

అధ్యయనంలో..
మనదేశంలో రెండు మిలియన్లకు పైగా రిజిస్టర్డ్ ట్యాక్సీలు ఉన్నాయి. వీటిలో 85 శాతం దేశంలోని 14 ప్రధాన నగరాల్లో పనిచేస్తున్నాయి.

ఐటీ రిటర్న్స్ చేయించాం..

మొదట మేము బెంగళూరులోని మూడు వేల మంది ట్యాక్సీ డ్రైవర్లతో సమావేశమై వారికి ఫ్లైయర్స్ ఇచ్చి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించాం. 2016లో మూడు రోజులు ట్యాక్స్ మేళా నిర్వహించాం. దాదాపు 180 మంది డ్రైవర్ల డాక్యుమెంట్లను వాట్సాప్ ద్వారా సేకరించాం. వారి ట్యాక్స్ రిటర్న్స్‌ను ఉచితంగా చేశాం. ఇలా ఎంతోమంది క్యాబ్ డ్రైవర్లను చైతన్యవంతులను చేసి మొత్తం 1.2 కోట్ల రూపాయల టీడీఎస్ రీఫండ్ వాళ్లకి వచ్చేట్టు చేశా. ఆ తర్వాత నుంచి ఆదాయం పన్ను రిటర్న్స్ దాఖలు చేసినందుకు డ్రైవర్ల నుంచి కనీస రుసుము 500 రూపాయలు తీసుకోవడం మొదలెట్టాం. ఆ డబ్బును క్యాబ్ డ్రైవర్లను ఫైనాన్షియల్ మెయిన్‌స్ట్రీమ్‌లోకి తేవడం కోసం వెచ్చిస్తున్నాం.

రుణాలు తదితర ఆర్థిక అంశాలకు సంబంధించిన అదనపు అవసరాల కోసం విడిగా క్యాబ్ డ్రైవర్లు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఆదాయం పన్ను నుంచి మినహాయింపు పొందాలంటే సేవింగ్స్ చేయాలని క్యాబ్ డ్రైవర్లలో అవగాహన తెస్తున్నాం. ఎంతో రిస్క్‌తో కూడుకున్న ప్రైవేట్ చిట్టీలు కట్టే అలవాటు మాన్పించి, చాలామంది క్యాబ్ డ్రైవర్లను సేవింగ్స్ దిశగా నడిపిస్తున్నాం. మెడికల్ ఇన్సూరెన్స్, బీమా, ప్రభుత్వ సేవింగ్ స్కీములతోపాటు మ్యూచువల్ ఫండ్స్ వంటి వాటివైపు వారి ఆదాయాన్ని మళ్లేలా సూచనలు ఇస్తున్నాం. అయితే డ్రైవర్ల ప్రోత్సాహకాలు తరచూ మారుతుండడం వల్ల వాళ్లు ఆర్థిక ఇబ్బందుల్లో పడుతున్నారు. ఇలాంటి కష్టాల్లో ఒక మంచి ఆర్థిక సలహా వారిని కాపాడుతుంది.

ఆర్థిక అక్షరాస్యతకు శ్రీకారం...

'క్యాబ్ దోస్త్' ఆర్థిక అక్షరాస్యతా కార్యక్రమాన్ని కూడా ప్రారంభించింది. దీని ద్వారా బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్, సిబిల్, ఎన్‌పిఎ వంటి వాటిపై అవగాహన పెంపొందించవచ్చు. ఉబర్, ఓలా యాజమాన్యాలను కూడా కలిశాం. వారి ఆఫీసుల్లో ప్రత్యేకంగా స్పెషల్ హెల్ప్ డెస్కులను ఏర్పాటుచేశాం. క్రెడిబుల్ ఫైనాన్షియల్ ట్రాక్ రికార్డు అవసరంపై కూడా క్యాబ్ డ్రైవర్లను ఎడ్యుకేట్ చేస్తాం. దీనివల్ల బ్యాంకుల నుంచి రుణాల మంజూరు వంటి పనులు సులువవుతాయి. ప్రస్తుతం మా స్టార్టప్ నిర్వహణ మార్జినల్ రిటర్న్స్‌తో సాగుతోంది. వచ్చిన డబ్బులో ఉచిత ఐటీ ఫైలింగ్ ప్రచారంపై, టాక్సీ డ్రైవర్ల ఆర్థిక అక్షరాస్యతా కార్యక్రమంపై తిరిగి ఖర్చుపెడతాం. పదో తరగతి, ఇంటర్ పూర్తయిన ట్యాక్సీ డ్రైవర్ల పిల్లలకు కెరీర్ కౌన్సెలింగ్ సెషన్స్ కూడా నిర్వహిస్తాం. మా సేవలను హైదరాబాద్, ముంబయి, కోల్‌కతా వంటి తొమ్మిది ప్రధాన నగరాలలో నిర్వహిస్తున్నాం. మాతో కలిసి పనిచేస్తున్న వాటిల్లో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, ఉబర్, ఓలా, ట్రక్ ఈజీ, జొమాటో, ఉబర్ ఈట్స్ వంటి సంస్థలు ఉన్నాయి.

క్యాబ్ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తూ...

సమాజం మారింది. దానికి తగ్గట్టు మహిళలు ఆత్మవిశ్వాసంతో నిలబడాల్సిన సమయం ఇది. స్టిగ్మా అనేది మనలో ఉంది. ఎవరో దాన్ని మనపై రుద్దడం లేదు. మనకు పట్టుదల ఉంటే ఎవ్వరి మాటల ప్రభావం మనపై ఉండదు. చేయాలనుకున్నది ధైర్యంగా చేసుకుపోతాం. మహిళలకు ఆ 'గట్ ఫీలింగ్' అవసరం. నేటి మహిళలు ఆర్థిక అంశాల విషయాలను తమకు తామే ఆసక్తిగా తెలుసుకుంటున్నారు. ఈ పరిణామం దేశాన్ని అన్ని విధాలా అభివృద్ధిపరుస్తుందనడంలో సందేహం లేదు."

• నాగసుందరి
ఫొటోలు: అశోకుడు

ఇదీ నా ప్రయాణం...

'ఇంక్‌టాక్స్' సీఈవోగా మూడేళ్లు పనిచేశా. 'రేవా' విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేశా. సిలబస్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఇ-సెల్, ఇంటర్న్‌షిప్ మార్గనిర్దేశకాల రూపకల్పనలో పాలుపంచుకున్నా. హైదరాబాద్, నెదర్లాండ్‌లో 2017, 2019 సంవత్సరాల్లో జరిగిన 'గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్'లో భారత్ తరఫున రెండుసార్లు ప్రాతినిధ్యం వహించా. 15 మంది అత్యున్నత మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్లో ఒకరిగా గుర్తింపు రావడంతోపాటు 2018లో 'ఉమన్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా' అవార్డు అందుకున్నా.

ఫ్యామిలీ కౌన్సెలింగ్

అమ్మాయిని పంపేశాడు...

మా అమ్మాయికి ఏడాది క్రితం పెళ్లి చేశాం. అబ్బాయి అమెరికాలో ఉంటాడు. బంధువుల ద్వారా ముందు అతని తల్లిదండ్రులు వచ్చి చూసి వెళ్లారు. తర్వాత అబ్బాయి వచ్చినప్పుడు నిశ్చితార్థం, ఆపైన నాలుగు నెలలకు పెళ్లి చేశాం. అమ్మాయి, అబ్బాయి అంగీకారంతోనే వివాహం జరిగింది. వెంటనే మా అమ్మాయికి వీసా తీసుకుని అమెరికా తీసుకెళ్లాడు. అనుకోకుండా మా మామగారు మరణించడంతో అమ్మాయిని ఇండియాకు పంపించారు. ఆ తర్వాత మళ్లీ అమెరికా తీసుకెళ్లలేదు. కొన్నాళ్లు చూసి అడిగితే అమ్మాయికి ఎవరితోనో సంబంధం ఉందంటున్నారు. ఆధారం అడిగితే ఆమె తనతో గతంలో పనిచేసిన వారితో ఫోనులో మాట్లాడిందట. ఈ మాత్రానికే అమ్మాయిని అనుమానించడం న్యాయమా? ఏ విధంగా అమ్మాయి కాపురం చక్కదిద్దాలి?

- చంద్ర

ఎంతో కష్టపడి వివాహం చేస్తే, ఏదో ఒక కారణంతో వివాహాలు విచ్ఛిన్నం కావడం తల్లిదండ్రులకు ఎంతో మనోవ్యథ కలిగిస్తుంది. అయితే పైకి చెబుతున్న కారణం కన్నా ఇంకేదో విషయం ఉందేమో. ఒకసారి అమ్మాయితో వివరంగా మాట్లాడండి. అలాగే అబ్బాయి తల్లిదండ్రుల ద్వారా మాట్లాడించండి. ఒక్కోసారి పైకి చెప్పలేని కారణాలుండవచ్చు. ఓపికగా సహనంతో వ్యవహరించండి. ఒకవేళ చిన్న కారణానికే అమ్మాయిని అనుమానించడం నిజమైతే త్వరగానే అల్లుడి నిజస్వరూపం తెలిసిందని సంతోషించండి. చట్టపరమైన చర్యల కోసం న్యాయవాదిని సంప్రదించండి. అనుమానపు భర్తతో వేగడం కన్నా విడిపోయి తల్లిదండ్రుల అండతో కొత్త జీవితం ప్రారంభించడం మేలు.

• కె.శోభ
ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్
shobhas292@gmail.com

అవగాహన

దంతాలపై గార పోవాలంటే...

దంత క్షయానికి, దంతాలపై గార ఏర్పడటానికి కాఫీ, టీ, సోడా, శీతల పానీయాల్లో ఉండే ఆమ్లతత్వమే కారణం. దంతాలపై ఉండే ఎనామిల్ పాడవకుండా ఉండేందుకు కొన్ని ఇంటి చిట్కాలున్నాయి. అవేమిటంటే..

- పళ్లపై గార పోవాలంటే నిమ్మకాయ, పేస్టు, వంటసోడాలను కలిపి వాడితే మంచి ఫలితం ఉంటుంది. కొద్దిగా పేస్టును కప్పులో వేసి అందులో ఐదారు చుక్కల నిమ్మరసం, కొద్దిగా వంటసోడా వేసి మెత్తటి పేస్టులా చేయాలి. దాంతో దంతాలను బ్రష్ చేసుకోవాలి. ఇలా వారానికి ఒకసారి లేదా నెలలో రెండుసార్లు చేస్తే మంచిది.
- రాళ్లఉప్పు/మెత్తటి ఉప్పు, బొగ్గుపొడిని కలిపి ఆ మిశ్రమంతో పళ్లు తోముకుంటే తళ తళలాడతాయి. ఉప్పులో బోలెడు ఖనిజాలు ఉన్నాయి. ఇవి దంతాలను శుభ్రంగా ఉంచుతాయి. చిగుళ్లకు సంబంధించిన వ్యాధి ఉంటే మాత్రం ఉప్పు వాడకూడదు.
- టొమాటో, పైనాపిల్, నిమ్మజాతి పండ్లు అంటే కమలాలు, నిమ్మ, బత్తాయి వంటి వాటిల్లో విటమిన్-సి దంతాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. వీటితో పాటు క్యారెట్ కొరికి తింటే దంతాలకు చాలా మంచిది.

విశేషం

అమ్మో... బామ్మ!

పల్లె జీవనాన్ని తన చిత్రాల ద్వారా ప్రపంచానికి చాటాలనే ఆమె తపనకు వృద్ధాప్యం అడ్డురాలేదు. 70 ఏళ్ల వయసులో కుంచె పట్టిన జోధయియా బాయీ బైగా మంచి చిత్రకారిణిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఈ బామ్మ వేసిన బొమ్మలకు అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనల్లో చోటు దక్కుతోంది. ఇటీవల మిలన్ (ఇటలీ)లో జరిగిన పెయింటింగ్ ఎగ్జిబిషన్‌లో బైగా వేసిన బొమ్మలు అందర్నీ ఆకట్టుకొన్నాయి. ఇంతకీ ఈ బామ్మ రంగుల ప్రయాణం ఎలా మొదలయ్యిందంటే...

"పెయింటింగ్ నన్ను ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లింది. అక్కడ నేను పక్షిలా స్వేచ్ఛగా విహరిస్తా" అంటున్న జోధయియా బాయీ బైగా సొంతూరు మధ్యప్రదేశ్‌లోని లోహ్రా గ్రామం. ఊరికి సమీపంలోని అడవిలో దొరికే ఉత్పత్తులను సేకరించి, వాటిని పట్టణంలోని మార్కెట్లో అమ్మితేగానీ గిరిజన తెగకు చెందిన బైగా కుటుంబానికి పూట గడిచేది కాదు. బైగాకు చిన్నతనంలోనే పెళ్లయ్యింది. ఆమెకు 40 ఏళ్లు వచ్చేసరికి భర్త మరణించాడు. దాంతో ముగ్గురు పిల్లలు సహా కుటుంబ భారం మొత్తం ఆమెపై పడింది. రోజూ అడవిలోకి వెళ్లి అటవీ ఉత్పత్తులను తెచ్చి అమ్మి, వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చింది. అష్టకష్టాలు పడి పిల్లల పెళ్లిళ్లు చేసింది.

ఆర్ట్ టీచర్ ఆదరించాడు...

బైగాకు మొదట్లో పెయింటింగ్ మీద అంత ఆసక్తి ఉండేది కాదు. ఒకరోజు వాళ్ల గ్రామంలో పెయింటింగ్స్ నేర్పిస్తున్న ఆశిష్ స్వామి అనే ఆర్ట్ టీచర్‌ను కలిశారు బైగా. మొదటిరోజునే ఆమెకు పెయింటింగ్ మీద ఇష్టం పెరిగింది. వాళ్ల కమ్యూనిటీ మహిళలు రంగురంగుల చీరలు ధరిస్తారు. కష్టపడేతత్వాన్ని మించింది లేదని నమ్ముతారు. ఈ రెండు విషయాలు బైగా పెయింటింగ్‌ను ఎంచుకోవడానికి కారణమయ్యాయి.

ఆశిష్ ప్రఖ్యాత ఆర్ట్ టీచరే కాదు... గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు అంతరించిపోవద్దనే ఉద్దేశంతో గిరిజనులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో 'జంగన్ తస్వీర్‌ఖానా' పేరుతో స్టూడియోలు నడిపేవారు. స్థానికులకు పెయింటింగ్స్‌లో శిక్షణ ఇచ్చి వారితో ఆ ప్రాంత సంస్కృతిపై బొమ్మలు వేయించేవారు. ఆ విధంగా పదేళ్ల క్రితం లేహ్రా గ్రామంలో స్టూడియో ప్రారంభించి మహిళలకు ఉచితంగా పెయింటింగ్స్ వేయడం నేర్పిస్తున్నారు. "ఇక్కడి మహిళల్లో సృజనాత్మకత అద్భుతం. వాళ్లు చెట్టుబొమ్మ గీసినా ఎంతో కొత్తగా ఉంటుంది. చెట్లు, చేమలు, పక్షులు, జంతువులు, నీటి కొలనులతో మనిషికి ఉన్న అనుబంధాన్ని ఎంతో నేర్పుగా బొమ్మలుగా మలుస్తారు" అంటారు అశిష్.

లేహ్రాలో దాదాపు 15 మంది మహిళలు పెయింటింగ్స్ నేర్చుకోవడానికి వచ్చేవారు. వారిలో 70 ఏళ్ల బైగా కూడా ఒకరు. తక్కువ సమయంలోనే ఆమె చక్కగా బొమ్మలేయడం నేర్చుకున్నారు. అప్పటి నుంచి గత పదేళ్లుగా ఆమె నిరంతరాయంగా అనేక బొమ్మలు వేస్తూనే ఉన్నారు. ఆమె వేసిన పెయింటింగ్స్‌కు జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనల్లో చోటు దక్కింది.

సంప్రదాయాన్ని బతికించాలనే....

మొదట్లో తన పెయింటింగ్‌లు ఎంతకు అమ్ముడుపోతే అంతకే తృప్తిపడేవారు బైగా. ఇప్పటికైతే ఆమె వేసిన బొమ్మలు రూ. 300 నుంచి 8000 వరకూ పలుకుతున్నాయి. దేశవ్యాప్తంగా ఆమె బొమ్మలకు మంచి గుర్తింపు, గిరాకీ ఉంది. విదేశాల్లో సైతం ఆమె చిత్రకళా నైపుణ్యానికి ప్రశంసలు లభిస్తున్నాయి. అయితే డబ్బులు సంపాదించాలని ఆమె కుంచె పట్టలేదు. తమ గ్రామీణ సౌందర్యాన్ని, సంప్రదాయాన్ని తన చిత్రకళ ద్వారా ప్రపంచానికి తెలియజేయాలనేది ఆమె కోరిక.

అధ్యయనం

స్కూలు దగ్గర ఫుడ్‌స్టాల్ ఉంటే...

పిల్లలు స్కూలుకు పాకెట్ మనీ తీసుకుని వెళ్లారంటే అక్కడ ఎలాంటి ఫుడ్ తింటున్నారోననే బెంగ ప్రతీ తల్లిదండ్రులకు ఉంటుంది. అయితే పిల్లలు జంక్‌ఫుడ్ ఇష్టపడతారా? పండ్లు, ప్రోటీన్లు లభించే ఆరోగ్యకరమైన ఆహారం తింటారా? అనేది వారి స్కూలు సమీపంలో ఉండే ఫుడ్ స్టాల్‌ను బట్టి చెప్పేయొచ్చు. అవును... పిల్లల ఆహారపు అలవాట్ల మీద వారి స్కూలు సమీపంలో ఉండే ఫుడ్‌కోర్టుల ప్రభావం ఎంతో ఉంటుందని చెబుతున్నారు న్యూయార్క్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన పరిశోధకులు.

'ఒబేసిటీ' జర్నల్‌లో ప్రచురితమైన ఈ పరిశోధన సారాంశం ఏమిటంటే... ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు దగ్గర్లో ఉన్న కిండర్‌గార్డెన్, హైస్కూలు రికార్డులను పరిశీలించారు. 15 నుంచి 18 సంవత్సరాల వయసు విద్యార్థుల ఎత్తు, బరువు గమనించారు. మ్యాపింగ్ సాఫ్ట్‌వేర్ సాయంతో సదరు పిల్లల ఆహారపు అలవాట్లను పోల్చి చూశారు. వారిలో 20 శాతం మంది మధుమేహం, 38శాతం మంది అధిక బరువు సమస్యతో బాధపడుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు స్కూలుకు దూరంగా ఉన్నచోట పిల్లల్లో ఒబేసిటీ ఒకటి నుంచి నాలుగు శాతానికి తగ్గినట్టు గమనించారు. "జంక్‌ఫుడ్ అవుట్‌లెట్స్‌కు సమీపంలో ఉన్న స్కూళ్లలో చదివే పిల్లలు మధుమేహం బారినపడే అవకాశాలు ఎక్కువ. విదేశాల్లో స్కూలుకు వెళ్లే అయిదుగురు పిల్లల్లో ఒకరు ఫ్యాటీగా ఉంటారు. వాళ్లు క్రమంగా అధికబరువుతో బాధపడుతున్నారు" అని అంటున్నారు సీనియర్ పరిశోధకుడు బ్రియానా ఎల్బెల్.

విద్య

చేసేయండి!

అందమైన గుడిసె

కావలసినవి

■ కొబ్బరి పీచు ■ ఐస్‌క్రీమ్ పుల్లలు ■ గులాబి రంగు, లేత ఆకుపచ్చ, లేత, ముదురు గోధుమ రంగు క్రాఫ్ట్ కాగితాలు ■ కత్తెర ■ గ్లూ

తయారీ

1. ఒక డ్రాయింగ్ కాగితంపై మేఘాలు, చెట్లు, గుడిసె బొమ్మ గీసి రంగులు వేయండి. దానిమీద త్రిభుజాకారంలో, చతురస్రాకారంలో ఆకుపచ్చ, లేత గోధుమ రంగు కాగితాలు కత్తిరించి అతికించండి. బొమ్మలో చూపించిన విధంగా గులాబి రంగు కాగితాన్ని దీర్ఘచతురస్రాకారంలో రెండు ముక్కలుగా కత్తిరించి తలుపులా అతికించండి.

2. ముదురు గోధుమ రంగు కాగితాన్ని చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి, ఇటుకల్లా అతికించండి.

3. గుడిసె కప్పుకి గ్లూ రాసి దానిమీద కొబ్బరిపీచును అతికించండి.

4. ఐస్‌క్రీమ్ పుల్లలను కత్తిరించి, బొమ్మలో చూపిన విధంగా నిలువుగా అతికించి కంచెను ఏర్పాటు చేయాలి.

5. నిలువుగా అతికించిన కంచెకు అడ్డంగా రెండు ఐస్‌క్రీమ్ పుల్లలు అతికిస్తే కంచె పని పూర్తయినట్టే!

ఏవి.. ఎన్ని?

సరైన నీడను గుర్తించండి?



చుక్కలు కలిపి రంగులు వేయండి

డైలీ సుడోకు-207

		3			2	1	5	9
			7			6		
			1	6				8
	2					8		
	1		5		8		9	
		6					4	
2				5	4			
		5			3			
4	7	8	9			5		

సుడోకు - 206 సమాధానం

7	2	5	8	6	4	9	3	1
1	8	4	3	7	9	5	6	2
9	3	6	2	1	5	7	4	8
2	9	8	4	3	1	6	5	7
6	1	7	5	9	2	4	8	3
5	4	3	7	8	6	2	1	9
4	7	2	1	5	8	3	9	6
3	6	1	9	4	7	8	2	5
8	5	9	6	2	3	1	7	4

ఎలా పూరించాలి? ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.



సర్వీస్ రంగం నుంచి సాఫ్ట్‌వేర్ సంస్థల వరకు ఇలా ప్రతి కంపెనీకి అవసరం ఉన్న విభాగం కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ (సీఎంఏ). దీంతో ఇటీవలి కాలంలో సీఎంఏ నిపుణులను నియమించుకోవడానికి కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఇతర కోర్సులతో పోల్చితే స్వల్ప కాలంలో పూర్తి చేసే అవకాశం, చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగం వంటి కారణాలతో విద్యార్థుల్లో ఈ కోర్సుకు మంచి ఆదరణ లభిస్తోంది. సీఎంఏలో మూడు దశలు ఉంటాయి. అవి..ఫౌండేషన్, ఇంటర్మీడియెట్, ఫైనల్. ఇందులో కీలకమైన ఫైనల్ దశ పరీక్షలు డిసెంబరు నెలలో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఫైనల్ పరీక్షలకు ఏ విధంగా సిద్ధం కావాలో చూద్దాం..

సీఎంఏ.. ఫైనల్ వ్యూహం

సీఎంఏ ఫైనల్ దశలో రెండు గ్రూపుల్లో (గ్రూప్-3, గ్రూప్-4) కలిపి ఉండే సబ్జెక్టులు ఎనిమిది. గ్రూప్-3లో పేపర్ 13, 14, 15, 16, గ్రూప్-4లో పేపర్ 17, 18, 19, 20 అనే పేపర్లు ఉంటాయి. ఇందులో ప్రతి పేపర్ 100 మార్కులకు ఉంటుంది.

పేపర్ 13
కార్పొరేట్ లాస్ అండ్ కంప్లయన్స్

- సాధారణంగా కంపెనీస్ యాక్ట్ 2013కి సంబంధించిన నిబంధనలను కూడా జాగ్రత్తగా చదవాలి.
- పరీక్షలకు ముందు ఆరు నెలల వరకు చేసిన సవరణలను పరీక్షల్లో అడుగుతారు.
- డిసెంబరు 2019 పరీక్షకు సంబంధించి కంపెనీస్ యాక్ట్ 2013లో చాలా సవరణలు జరిగాయి. వాటిపై ఎక్కువ దృష్టి పెట్టాలి.
- పెనాల్టీ బేస్‌తోపాటు ప్రాక్టికల్ ప్రశ్నలు చదవాలి.
- విధానాలు - సమ్మతి సమస్యలు (ప్రొసీజర్ అండ్ కంప్లయన్స్ ఇష్యూస్)పై దృష్టి పెట్టాలి.
- కేస్ స్టడీ ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే అనాలసిస్ ఆఫ్ ప్రొవిజన్ చేయాలి.

పేపర్ 14
స్ట్రాటజిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్

- సెక్యూరిటీ అనాలసిస్ అండ్ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్, ఇన్వెస్ట్‌మెంట్ డెసిషన్స్ చాలా సులువైన అధ్యాయాలు. వీటి నుంచి ఎక్కువ మార్కులకు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.
- సొంతంగా ఫాస్ట్ ట్రాక్ నోట్స్‌ను సిద్ధం చేసుకోవడం మేలు చేస్తుంది.
- ఫార్ములాలన్నింటిని ఒక నోట్ బుక్‌లో రాసుకోవాలి.
- గత ఐదేళ్ళుగా ఇస్తున్న పాత ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం ప్రయోజనకరం. స్టడీ మెటీరియల్, ఆర్‌టీపీ, ఎంటీపీల్లోని ప్రాబ్లమ్స్ అన్ని సాధన చేయాలి.

పేపర్ 15
స్ట్రాటజిక్ కాస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ డెషిషన్ మేకింగ్

- స్ట్రాటజిక్ కాస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ డెషిషన్ మేకింగ్ రెండు విభాగాలకి సమాన ప్రాధాన్యం ఇవ్వాలి.
- డెషిషన్ మేకింగ్‌లో అప్లికేషన్ ఆఫ్ స్టాటిస్టికల్ టెక్నిక్స్ ఇన్ బిజినెస్ డెసిషన్స్‌కి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.
- స్ట్రాటజిక్ కాస్ట్ మేనేజ్‌మెంట్ - పాక్షికంగా థియరీ. పాక్షికంగా సమస్యాత్మక ప్రశ్నలు ఉంటాయి. స్కానర్‌లో ఉండే ప్రాబ్లమ్స్‌ను సాధన చేయాలి.
- రెండింటి అంశాల్లో థీయరీకి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ ప్రధాన శీర్షికలను ఒక పుస్తకంలో రాసుకొని పరీక్షకి ముందు రోజు పునశ్చరణ చేసుకోవాలి.

పేపర్ 16
డైరెక్ట్ టాక్స్ లాస్ అండ్ ఇంటర్నేషనల్ టాక్సేషన్

- డైరెక్ట్ టాక్స్ అండ్ ఇంటర్నేషనల్ టాక్సేషన్ రెండూ కూడా ఈ సబ్జెక్టులోనే మిళితమై ఉంటాయి.
- సన్నద్ధత ప్రణాళికాబద్ధంగా ఉండాలి. 100 మార్కులకు ఎక్కువ సిలబస్ కవర్ చేయడమే అందుకు కారణం.
- ఇంటర్నేషనల్ టాక్సేషన్‌లో అసెస్‌మెంట్ ఆఫ్ వేరియస్ పర్సన్స్, కేస్ స్టడీస్‌కి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.
- కేస్ స్టడీ ప్రశ్నలను ఆశించవచ్చు.
- డిసెంబరు 2019 పరీక్షలకు 'ఫైనాన్స్ యాక్ట్ 2018' వర్తిస్తుంది. 2019 మే 31 వరకు విడుదల చేసిన నోటిఫికేషన్లు, సర్క్యులర్లు వర్తిస్తాయి. (సవరణల పూర్తి సమాచారాన్ని https://icmai.in/studentswebsite/Syl-2016.php వెబ్‌సైట్ నుంచి పొందొచ్చు).

పేపర్ 17
కార్పొరేట్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్

- ఈ పేపర్‌లో ఐదు విభాగాలు ఉంటాయి (సెక్షన్ ఎ - అకౌంటింగ్ స్టాండర్డ్స్ అండ్ జనరల్లీ యాక్సెప్టెడ్ అకౌంటింగ్ ప్రిన్సిపుల్స్ 20 మార్కులు, సెక్షన్ బి - అకౌంటింగ్ ఆఫ్ బిజినెస్ కాంబినేషన్స్ అండ్ రీస్ట్రక్చరింగ్ 20 మార్కులు, సెక్షన్ సి - గ్రూప్ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్ 20 మార్కులు, సెక్షన్ డి - డెవలప్‌మెంట్స్ ఇన్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ 25 మార్కులు, సెక్షన్ ఇ - గవర్నమెంట్ అకౌంటింగ్ ఇన్ ఇండియా 15 మార్కులు).
- మొదట దృష్టి పెట్టాల్సినవి.. సెక్షన్ డి, సెక్షన్ ఇ, వీటి తరవాత సెక్షన్ ఎ.
- సెక్షన్ బి, సెక్షన్ సి నుంచి 10 లేదా 15 మార్కుల ప్రశ్నను ఆశించవచ్చు. ఈ సెక్షన్స్‌లో చిన్న చిన్న కాన్సెప్ట్స్‌ని కూడా వదిలివేయకూడదు.
- డిసెంబరు 2019 పరీక్షకు కొత్తగా 5 ఇండ్ - అకౌంటింగ్ స్టాండర్డ్స్ (ఇండ్ ఎ ఎస్ - 27, 28, 105, 110, 111, 112)లను చేర్చారు. వీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి.

పేపర్ 18
ఇన్‌డైరెక్ట్ టాక్స్ లాస్ అండ్ ప్రాక్టీస్

- భావనలు (కాన్సెప్ట్స్) - విధానాలు అర్థం చేసుకోవాలి. స్టడీ మెటీరియల్‌లో ఇచ్చిన ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి.
- సమస్యాపూరితమైన ప్రశ్నలను సూచించిన / వర్తించే చట్టప్రకారం సమాధానం ఇవ్వాలి.
- డిసెంబరు 2019 పరీక్షలకు 'ఫైనాన్స్ యాక్ట్ 2018' వర్తిస్తుంది. 2019 మే 31 వరకు విడుదల చేసిన నోటిఫికేషన్లు, సర్క్యులర్లు వర్తిస్తాయి. (సవరణల పూర్తి సమాచారాన్ని https://icmai.in/studentswebsite/Syl-2016.php వెబ్‌సైట్ నుంచి పొందొచ్చు).
- సమాధానం మొదలుపెట్టే ముందు ప్రశ్నను ఒకటికి రెండు సార్లు జాగ్రత్తగా చదవాలి.
- మంచి మార్కుల కోసం జీఎస్‌టీపై ఎక్కువ దృష్టి పెట్టాలి.
- కొత్త సవరణలపై దృష్టి కేంద్రీకరించాలి. కేస్ స్టడీస్ తప్పక చదవాలి.
- జీఎస్‌టీలో ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్, లెవి అండ్ కలెక్షన్ వంటి అంశాలపై పట్టు సాధించాలి.
- కస్టమ్స్ డ్యూటీస్‌లోని ప్రాబ్లమ్స్‌కి సంబంధించిన ప్రశ్నలపై ఎక్కువ దృష్టి పెట్టాలి.

పేపర్ 19
కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ ఆడిట్

- సీఎంఏ ఫైనల్ దశలో కొద్దిగా కఠినంగా ఉండే సబ్జెక్టుగా దీన్ని చెప్పవచ్చు.
- కాస్ట్ అకౌంటింగ్ స్టాండర్డ్స్‌పై ఎక్కువ దృష్టి పెట్టాలి.
- స్కానర్‌లో ఉండే ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి.
- ఆపరేషనల్ ఆడిట్ అండ్ మేనేజ్‌మెంట్ ఆడిట్ విషయాలపై కాన్సెప్చ్యువల్ ఐడియా అవసరం.
- చాప్టర్ చివరిలో ఇచ్చే సారాంశంపై దృష్టి పెట్టాలి.
- సెక్షన్ సి నుంచి కేస్ స్టడీ ప్రశ్నను 20 మార్కులకుపైగా ఆశించవచ్చు.
- డిసెంబరు 2019 పరీక్షలకు 'ఫైనాన్స్ యాక్ట్ 2018' వర్తిస్తుంది. 2019 మే 31 వరకు కంపెనీస్ (కాస్ట్ రికార్డ్స్ అండ్ ఆడిట్) రూల్స్, 2014లో వచ్చిన ప్రతి సవరణ ఈ పరీక్షకు వర్తిస్తుంది. (సవరణల పూర్తి సమాచారాన్ని www.icmai.in వెబ్‌సైట్ నుంచి పొందొచ్చు).

పేపర్ 20
స్ట్రాటజిక్ పర్‌ఫార్మెన్స్ మేనేజ్‌మెంట్ అండ్ బిజినెస్ వాల్యుయేషన్

- ఇందులో రెండు అంశాలకి సమప్రాధాన్యం ఇవ్వాలి.
- ఈ సబ్జెక్ట్‌లో 60కిపైగా మార్కులు సులువుగా సాధించవచ్చు.
- బిజినెస్ వాల్యుయేషన్‌లో వాల్యుయేషన్స్ ఇన్ మెర్జర్స్ అండ్ అక్విజిషన్స్, వాల్యుయేషన్ ఆఫ్ అసెట్స్ అండ్ లయబిలిటీస్‌కి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.
- బిజినెస్ వాల్యుయేషన్‌లో థియరి ప్రశ్నలను తక్కువగా, ప్రాబ్లమ్స్‌ను ఎక్కువగా ఇస్తున్నారు. అందువల్ల మార్కులు సులువుగా సాధించవచ్చు.
- స్ట్రాటజిక్ పర్‌ఫార్మెన్స్ మేనేజ్‌మెంట్‌లో పర్‌ఫార్మెన్స్ ఇవాల్యుయేషన్ అండ్ ఇంపార్టెంట్ టూల్స్, ఎంటర్‌ప్రైజ్ రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి.
- స్టడీ మెటీరియల్, స్కానర్‌లో ఉండే ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి.
- స్టడీ మెటీరియల్, ఆర్‌టీపీ, ఎంటీపీల్లోని ప్రశ్నలకు జవాబులు ఎలా సూచించారో నిశితంగా పరిశీలించాలి.

ఎం. ప్రకాష్
డైరెక్టర్, మాస్టర్ మైండ్స్

గమనించాల్సినవి

- సిలబస్‌పై పూర్తి అవగాహన పెంచుకోవాలి. ప్రతి చాప్టర్‌కు ఉండే వెయిటేజీని తెలుసుకోవాలి. సీఎంఏ ఇన్‌స్టిట్యూట్ ప్రశ్నపత్రంలో ఈ వెయిటేజీని కచ్చితంగా పాటిస్తుంది.
- గత రెండు పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను తప్పనిసరిగా విశ్లేషించుకోవాలి.
- ఆర్‌టీపీ (రివిజన్ టెస్ట్ పేపర్) - 2 ఎటెంప్ట్స్, ఎంటీపీఎస్ (మోడల్ టెస్ట్ పేపర్) - 3 ఎటెంప్ట్స్, వర్క్‌బుక్‌ను తప్పకుండా పునఃశ్చరణ చేసుకోవాలి. వర్క్‌బుక్‌లోని కాన్సెప్ట్స్‌ను విధిగా చదవాలి. ఇలా చేస్తే కచ్చితంగా 60 శాతం మార్కులను సాధించవచ్చు (వీటిని www.icmai.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు).
- ప్రిపరేషన్‌లో అన్ని అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పునఃశ్చరణ చేశారో లేదో చూసుకోవాలి.
- డిసెంబరు 2019 పరీక్షలకు సంబంధించి సీఎంఏ ఇన్‌స్టిట్యూట్ వారు అదనపు స్టడీ మెటీరియల్ (Supplementary Material)ను కొత్తగా విడుదల చేశారు. దీన్ని తప్పకుండా చదవాలి.
- డిసెంబరు 2018 నుంచి సీఎంఏ ఫైనల్ పరీక్షా విధానంలో కొన్ని మార్పులు చేశారు. సాధారణంగా సీఎంఏ ఫైనల్లో రెండు గ్రూపులు ఉంటాయి. పాత విధానంలో విద్యార్థులు గ్రూప్-1 పరీక్షలు పూర్తయిన తరవాత గ్రూప్-2 పరీక్షలు రాసే వారు. నూతనంగా అమల్లోకి వచ్చిన పద్ధతిలో గ్రూప్-1లో మొదటి పరీక్షను రాసిన మరుసటి రోజు గ్రూప్-2లో తొలి పేపర్ ఉంటుంది. ఇదే క్రమాన్ని మిగతా పేపర్లకు కూడా అనుసరిస్తారు. కాబట్టి విద్యార్థులు ఈ మార్పును గమనించాలి.
- పరీక్షలకు సంబంధించి ఎటువంటి సందేహాలున్నా exam.helpdesk@icmai.inకు ఈ-మెయిల్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.

జాబ్ కార్నర్

నాన్ టీచింగ్

ఖాళీలు 24

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) - పాట్నా (బీహార్), నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- భర్తీ చేసే పోస్టులు: అసిస్టెంట్ రిజిస్ట్రార్, మెడికల్ ఆఫీసర్, జూనియర్ సూపరిండెంట్, జూనియర్ అకౌంటెంట్, తదితరాలు.
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా / బీఈ / బీటెక్, బ్యాచిలర్స్ డిగ్రీ / ఎంబీబీఎస్, మాస్టర్స్ డిగ్రీ, అనుభవం.
- ఎంపిక: రాత పరీక్ష / ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 23, 2019.
- వెబ్‌సైట్: https://www.iitp.ac.in/

సెక్యూరిటీ స్క్రీనర్

ఖాళీలు 419

ఎయిర్‌పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) కార్గో లాజిస్టిక్స్ అండ్ అలైడ్ సర్వీసెస్ కంపెనీ లిమిటెడ్ సెక్యూరిటీ స్క్రీనర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వివరాలు..

- అర్హత: ఏదైనా డిగ్రీ. ఇంగ్లీష్, హిందీ భాషల్లో మంచి ప్రావీణ్యం ఉండాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 9, 2019
- వెబ్‌సైట్: https://aaiclas-ecom.org/

టెక్నికల్ అసిస్టెంట్

ఖాళీలు 34

సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) - చెన్నై, వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- భర్తీ చేసే పోస్టులు: సీనియర్ టెక్నికల్ ఆఫీసర్, టెక్నికల్ అసిస్టెంట్, అసిస్టెంట్ ఆఫీసర్, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్, తదితరాలు.
- అర్హత: సంబంధిత ట్రేడ్ / సబ్జెక్టుల్లో ఐటీఐ బీఈ / బీటెక్, ఎంఈ / ఎంటెక్, ఎంబీఏ, సీఏ / ఐసీడబ్ల్యూఏ, పీహెచ్‌డీ, అనుభవం.
- ఎంపిక విధానం: రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ / ప్రాక్టికల్ టెస్ట్ / ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 20, 2019
- వెబ్‌సైట్: www.cipet.gov.in/

టెక్నికల్ ఆఫీసర్

ఖాళీలు 28

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) - హైదరాబాద్, టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ / బీటెక్
- ఎంపిక: రాత పరీక్ష / ఇంటర్వ్యూ ఆధారంగా
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 30, 2019
- వెబ్‌సైట్: www.ecil.co.in/

డిప్లొమా ట్రైనీ

ఖాళీలు 35

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, డిప్లొమా ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- విభాగాల వారీగా ఖాళీలు: ఎలక్ట్రికల్ - 30, సివిల్ - 5.
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజనీరింగ్ డిప్లొమా.
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 16, 2019
- వెబ్‌సైట్: powergridindia.com/

అకడమిక్ కన్సల్టెంట్స్

యోగి వేమన యూనివర్సిటీ పరిధిలోని వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్, తాత్కాలిక ప్రాతిపదికన అకడమిక్ కన్సల్టెంట్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- భర్తీ చేసే సబ్జెక్టులు: సివిల్ ఇంజనీరింగ్ / ఇంజనీరింగ్ జియాలజీ, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెటలర్జీ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ.
- ఇంటర్వ్యూ తేదీ: డిసెంబరు 1 (వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ - ప్రొద్దుటూరు)
- వెబ్‌సైట్: www.yogivemanauniversity.ac.in/

సూపర్ హిట్... సినిమా ఎగ్జిబిషన్

భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ)లో భాగంగా భారతీయ సినిమా, సినీ ప్రముఖులు, ఇఫీ చరిత్ర లాంటి అనేక అంశాలతో పణజీలో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ డిజిటల్ ఎగ్జిబిషన్ ఓ ప్రత్యేక ఆకర్షణ. పుణేలోని నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్ సహకారంతో రీజినల్ అవుట్ రీచ్ బ్యూరో రూపొందించిన ఈ ప్రదర్శనను పిల్లలు, పెద్దలు, సినీ అభిమానులు పెద్ద యెత్తున సందర్శిస్తున్నారు. "ముంబైలో ఇటీవల శాశ్వత ప్రాతిపదికన భారతీయ సినిమాపై జాతీయ మ్యూజియమ్ పెట్టాం. కాగా, ఇఫీ స్వర్ణోత్సవాల కోసం ప్రత్యేకంగా ఈ ఎగ్జిబిషన్‌కు రూపకల్పన చేశాం" అని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు చెప్పారు. ఈ ప్రదర్శనలో భాగంగా ప్రపంచంలో సినిమా పుట్టుక, భారతీయ సినిమా జననం, ఇఫీ యాభై ఏళ్ళ చరిత్ర, 1952 నుంచి ఇప్పటి దాకా మన దేశంలో జరిగిన వివిధ చిత్రోత్సవాల అపురూప చిత్రాలు, అప్పట్లో వివిధ జాతీయ పత్రికల్లో వచ్చిన ప్రత్యేక కథనాలు, అవార్డు చిత్రాలు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీతల వివరాలు లాంటి దాదాపు పదిహేనుకు పైగా ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇంటరాక్టివ్ పద్ధతిలో ఏర్పాటు చేసిన ఈ స్టాల్స్ గతంలోకి తీసుకువెళ్ళి, సందర్శకులకు అపురూప జ్ఞాపకాలను గుర్తుచేస్తున్నాయి. ప్రత్యేకించి, ఒక భారీ సెట్టింగ్ ఏర్పాటు చేసి, దాని మీద సినీ దృశ్యాలను ప్రొజెక్షన్ చేయడం ద్వారా ప్రపంచ సినిమా, ఇఫీ చరిత్రలను పది నిమిషాల వ్యవధిలో రాత్రి వేళల్లో ప్రత్యేకంగా చూపించడం ప్రత్యేక ఆకర్షణ. సందర్శకులు 360 డిగ్రీల ఫోటో జోన్‌లోకి వెళితే, అక్కడ వాళ్ళకు తమకంటూ సొంత జిఫ్‌ను రూపొందించి ఇచ్చే 360 డిగ్రీల కెమెరా టెక్నాలజీ ఈ ప్రదర్శనలో పెద్ద హిట్. అలాగే, వర్చ్యువల్ రియాలిటీ ద్వారా సందర్శకులు తామే రెడ్ కార్పెట్ మీద నడచి వస్తున్న అనుభూతిని కలిగించే మరో స్టాల్ కూడా ఉంచారు. అలాగే, సెల్యులాయిడ్‌పై మహాత్మా గాంధీ జీవితం, బోధనల స్ఫూర్తితో, ప్రస్తావనలతో వచ్చిన అనేక చిత్రాలను టచ్ స్క్రీన్ ద్వారా చూసే ఏర్పాటు చేయడం మరో విశేషం. సినీ ప్రముఖులు అనిల్ కపూర్, శ్రీరామ్ రాఘవన్ సహా పలువురు ప్రత్యేకించి, ఈ డిజిటల్ ప్రదర్శనను చూశారు. ఉదయం నుంచి రాత్రి దాకా ప్రతినిధులతో పాటు, సామాన్యులకు సైతం ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్న ఈ డిజిటల్ ఎగ్జిబిషన్ ఇప్పుడు చుట్టుపక్కల ప్రాంతాల స్కూలు, కాలేజీ విద్యార్థులకు ప్రత్యేక సందర్శన స్థలమైంది.

- గోవా నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి

తారలు దిగి వచ్చిన వేళ...

ఇఫీ వేడుకల్లో రోజు రోజుకూ తారల సందడి పెరుగుతోంది. రకుల్ ప్రీత్ సింగ్, నిత్యా మీనన్, తాప్సీ లాంటి పలువురు అగ్ర సినీ తారలు ఇఫీకి వచ్చి, వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడంతో ప్రాంగణం మరింత కళకళలాడుతోంది. హీరో అనిల్ కపూర్, కబీర్ బేడీ, బాలీవుడ్ దర్శకులు ఇంతియాజ్ అలీ, అనీశ్ బాజ్మీ, శ్రీరామ్ రాఘవన్, దక్షిణాది దర్శకులు ప్రియదర్శన్, తమిళ పేరన్బు చిత్రం ఫేమ్ రామ్, షాజీ ఎన్. కరుణ్, నటుడు పశుపతి, తెలుగు చిత్ర సీమ నుంచి రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు, నటి రోహిణి, దర్శకులు చంద్రసిద్ధార్థ, మద్దినేని రమేశ్, అపర్ణ మల్లాది తదితరులు వేడుకల్లో మెరిశారు. ఇఫీ చివరి రెండు రోజుల్లో సంగీత దర్శకుడు ఇళయరాజా, హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రశ్మికా మందన్న తదితరులు రానుండడం విశేషం. సినీ తారలతో మాటామంతి, సినీ రూపకల్పనకు సంబంధించి వారిచ్చే విలువైన సలహాలతో మాస్టర్ క్లాస్‌ల నిర్వహణ లాంటివి సినీ అభిమానులకు విశేష ఆకర్షణగా నిలిచాయి.

"ఇలాంటి సినిమాలు చేయడం వల్ల వృత్తిపరమైన సంతృప్తి కంటే వ్యక్తిగత సంతృప్తి ఎక్కువ కలుగుతుంది. ఎందుకంటే చిన్నప్పటి నుంచి నాకు గిల్లడం అలవాటు. ఫిల్మ్ మేకర్‌గా నేను సొంతంగా ఫీల్ అయిన ఎగ్జైట్‌మెంట్‌నే సినిమాగా చెప్పాలనుకుంటా. నేను తీసే రియలిస్టిక్ డ్రామాలకు ఇమేజ్ ఉన్న హీరోలు సూట్‌కారు. అందుకే కొత్తవాళ్లతో తీస్తా" అని రామ్‌గోపాల్ వర్మ అన్నారు. ఆయన దర్శకత్వం వహించిన 'కమ్మరాజ్యంలో కడపరెడ్లు' సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా వర్మ బుధవారం విలేకర్లతో మాట్లాడారు.

చిన్నప్పటి నుంచీ నాకు గిల్లటం అలవాటు

- రామ్‌గోపాల్ వర్మ

జగన్మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంలో అక్కడి వాతావరణం చూశాక నాకీ కథ ఐడియా వచ్చింది. ఒక వర్గంవారు మరో వర్గం ఉన్న ప్రాంతానికి రావడం అన్నది నన్ను ఇన్‌స్పైర్ చేసిన అంశం. మే 2019 నుండి సెప్టెంబర్ 2020 మధ్య జరిగే ఘటనల ఆధారంగా తీసిన పొలిటికల్ సెటైరికల్ సినిమా ఇది. జరిగినవీ, జరుగుతున్నవీ, జరగబోయేవి ఊహించి ఈ సినిమా తీశా. ఆద్యంతం వినోదాత్మకంగా ఉంటుంది. రియల్ లైఫ్ క్యారెక్టర్స్‌ను తీసుకొని ఫిక్షనల్ స్టోరీ చెయ్యడం నాకు తెలిసి ఇండియన్ స్క్రీన్‌పై ఎప్పుడూ జరగలేదు. ఈ సినిమానే మొదటిది అనుకుంటా. టైటిల్‌ను బట్టి ఓ కులాన్ని తక్కువ చేసి చూపించానని అనుకుంటున్నారు. ఒకర్ని ఎక్కువగా, మరొకర్ని తక్కువ చూపించడం నా ఉద్దేశం కాదు. బయట జరుగుతున్నదే సినిమాలో చూపించాను. కానీ ఎవర్నీ టార్గెట్ చేయలేదు. జగన్మోహనరెడ్డికి అనుకూలంగా ఈ సినిమా తీశాననడం తప్పు. జరగబోయేది ఊహించి తీసినప్పుడు ఆయనకు ఫేవరబుల్‌గా తీశాననడంలో అర్థం లేదు. పేర్లు చెప్పను కానీ ఈ సినిమాను ప్రముఖులైన ఇద్దరు తండ్రీకొడుకులకు అంకితమిస్తున్నా. కె.ఎ. పాల్ నన్ను తిట్టడం కామన్. అవన్నీ పట్టించుకోవడం మానేశా. ప్రస్తుతం ఆయన ప్రపంచ యుద్ధం ఆపే పనుల్లో బిజీగా ఉన్నారు కదా!.

అలా కుదిరిందంతే..

ఈ సినిమాకు క్యాస్టింగ్ చాలా బావుందని అందరూ మెచ్చుకుంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి రోల్ వెయ్యడానికి అలాంటి పోలికలు ఉన్న వ్యక్తి కావాల్సొచింది. అతని కోసం వెతుకుతుండగా నాసిక్‌లో దొరికాడు. హోటల్‌లో వెయిటర్‌గా చేస్తున్న ఆయనకు నటనలో ఒక నెల ట్రైనింగ్ ఇచ్చాం. ఈ సినిమాలోని మిగిలిన పాత్రలన్నీ అలా కుదిరాయి. ఇందులో పవన్ కల్యాణ్‌ను పోలిన ఒక యాక్టర్ ఉన్నారు. 'మనసేన' అనేది నా సినిమాలో ఫిక్షనల్ పార్టీ. పవన్‌కల్యాణ్‌ను పోలిన వ్యక్తి 'మనసేన' అనే పార్టీ పెడతాడు. దాంతో పవన్‌కల్యాణ్‌కీ, 'జనసేన'కీ సంబంధమే లేదు. తిట్టించుకోకపోతే నాకు నిద్ర పట్టదు. అలాంటి బుద్ధి నాలో డెవలప్ అయింది. పైగా చిన్నప్పట్నుంచీ నాకు గిల్లటం ఇష్టం. పర్సనల్ శాటిస్‌ఫాక్షన్ కోసం ఇలాంటివి చేస్తుంటా.

సీక్వెల్ తీయాల్సి వస్తే...

ఈ సినిమాకు సీక్వెల్ తీయాల్సి వస్తే 'కడప రాజ్యానికి కమ్మ ఫ్యాన్స్' అని తీస్తా. దెయ్యాలతో క్రైమ్ థ్రిల్లర్స్ చేయడం కన్నా పొలిటికల్ క్రైమ్స్ తీస్తే ఇంకా బావుంటాయని ఇటు అడుగేశా. ఈ జర్నీ చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. నా డ్రీమ్ ప్రాజెక్ట్ 'ఎంటర్ ద గాళ్ డ్రాగన్'ను ఒక చైనీస్ సంస్థతో కలిసి తీస్తున్నాం. ఇండియాలో మార్షల్ ఆర్టిస్ట్స్ లేరు. అందుకే లేట్ అయింది. ఈ సినిమా విషయంలో బెదిరిస్తూ నాకెవరూ ఫోన్‌లు చేయలేదు. కాల్స్ రికార్డ్ అవుతాయని భయపడ్డారేమో!

టైటిల్ మార్పు

'కమ్మ రాజ్యంలో కడప రెడ్లు' చిత్రం టైటిల్ మార్చే అవకాశాలున్నాయని తెలిసింది. టైటిల్ గురించి కాంట్రవర్సీ వచ్చిన దృష్ట్యా 'అమ్మ రాజ్యంలో కడప బిడ్డలు'గా టైటిల్ మార్చినట్టు తెలిసింది. గురువారం కొత్త టైటిల్‌ను అధికారికంగా ప్రకటిస్తారు.

అర్హతకు మించే ఇచ్చాడు

- రాశీఖన్నా

"ఏదో చదివి, మరేదో కావాలనుకుని హీరోయిన్ అయ్యా. అనుకోకుండా వచ్చినా ఈ జీవితం చాలా సంతృప్తిగా ఉంది. దేవుడు నా అర్హతకు మించి అన్నీ ఇచ్చాడు. వివిధ భాషల్లో కోట్లాది మంది అభిమానుల ప్రేమను పొందడం మామూలు విషయం కాదు. అందరికీ ఈ అదృష్టం దక్కదు" అని అంటున్నారు రాశీఖన్నా. ఆమె మాట్లాడుతూ "నటన అంటే ఏంటో తెలియకుండా ఇండస్ట్రీలోకి వచ్చా. సినిమా పరిశ్రమ నాకు ఎంతో ఇచ్చింది. జీవితం ఎలా సాగించాలో నేర్పించింది. అందుకే నేను చాలా సింపుల్‌గా ఉంటా. సక్సెస్ వస్తే కళ్లు నెత్తిన పెట్టుకోను. డౌన్ టు ఎర్త్ ఉంటా. అదే నేనీ స్థాయిలో ఉండటానికి కారణం అనుకుంటా. నిజంగా నాకున్న అర్హతలకు మించి దేవుడు నాకు ఇన్ని వరాలు ఇచ్చాడు. ఇంతకన్నా అదృష్టం ఇంకేం ఉంటుంది" అని అన్నారు. ప్రస్తుతం ఆమె నటించిన 'ప్రతి రోజూ పండగే', 'వెంకీమామ' సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి.

కార్తికేయలో మరో యాంగిల్ చూస్తారు

- శేఖర్‌రెడ్డి

'ఆర్ఎక్స్ 100', 'గుణ 369' సినిమాల్లో కార్తీకేయలోని ఎమోషన్, యాక్షన్ యాంగిల్‌నే చూశారు. ఈ చిత్రంతో అతనిలో మంచి కామెడీ యాంగిల్ కూడా ఉందని తెలుస్తుంది. 'ఆర్ఎక్స్ 100' లాంటి హిట్ సినిమా ఇచ్చిన బ్యానర్ నుంచి వస్తున్న ఈ చిత్రం అంచనాలను అందుకుంటుంది" అని దర్శకుడు శేఖర్‌రెడ్డి అన్నారు. కార్తికేయ, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం '90 ఎంఎల్'. యెర్రా శేఖర్ రెడ్డి దర్శకుడు. అశోక్ రెడ్డి గుమ్మకొండ నిర్మాత. డిసెంబర్ 5న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు శేఖర్ రెడ్డి బుధవారం విలేకర్లతో మాట్లాడారు. "ఆర్ఎక్స్ 100' నుంచి కార్తికేయతో పరిచయం ఉంది. అప్పుడే ఈ కథ చెప్పా. అప్పటికి ఆయన చేతిలో ఉన్న ప్రాజెక్ట్‌లు పూర్తి చేసి ఈ సినిమా చేశారు. టైటిల్ చూసి ఇదొక తాగుబోతుల కథ అనుకుంటున్నారు. తప్పనిసరిగా మందు తాగాల్సిన అవసరం ఉన్న పేషెంట్‌కి సంబందించిన కల్పిత కథ ఇది. పూర్తి వినోదాత్మకంగా సాగే ఈ చిత్రంతో క్యూట్ లవ్‌స్టోరీ కూడా ఉంది. కార్తికేయ కామెడీ టైమింగ్ బావుంది. నేను రాసుకున్న కథను ఎంతగా ప్రేమించానో నిర్మాతలూ అంతే ప్రేమించి నిర్మించారు. 'రంగస్థలం' తర్వాత చంద్రబోస్ సింగిల్ కార్డ్ రాసిన సినిమా ఇది. అనూప్ రూబెన్స్ చక్కని బాణీలందించారు. ఇందులో మూడు పాటల్ని అజర్‌బైజాన్‌లో తెరకెక్కించాం. మా అందరికీ ఈ చిత్రం మంచి గుర్తింపు తెస్తుంది" అని అన్నారు.

పాటలకు పట్టాభిషేకం

'షకలక' శంకర్ హీరోగా మరో చిత్రం రూపుదిద్దుకుంటోంది. కాచిడి గోపాల్‌రెడ్డి దర్శకత్వంలో సురేశ్ కొండేటి, ఎడవెల్లి వెంకటరెడ్డి నిర్మించే ఈ చిత్రానికి '2 + 1' అనే పేరు నిర్ణయించారు. ఈ సినిమాలో పక్కా మాస్ బీట్‌తో రెండు పాటలను భాస్కరభట్ల రవికుమార్ రాస్తున్నారు. సంగీత దర్శకుడు హరి గౌర, దర్శకుడు కాచిడి గోపాల్‌రెడ్డి, నిర్మాతల్లో ఒకరైన సురేశ్ కొండేటి, భాస్కరభట్ల సంగీత చర్చలు జరిపి ఆ రెండు పాటలకు ట్యూన్లు ఖరారు చేశారు. ఈ సందర్భంగా సురేశ్ కొండేటి మాట్లాడుతూ 'ఒకప్పుడు సినిమా బాగుండకపోయినా పాటల కోసమైనా సినిమాను మళ్లీ మళ్లీ చూసేవారు. ఆ తర్వాత కాలంలో పాటలకు విలువ తగ్గిపోయింది. మళ్లీ ఇప్పుడు సామాజిక మాధ్యమాల వల్ల లిరికిల్ వీడియోల ట్రెండ్ వచ్చింది. అందుకే మేం కూడా పాటల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. సినిమాలో ఉండేది నాలుగు పాటలే అయినా నలభై ఏళ్ల పాటు గుర్తుండేలా ఇవి ఉంటాయి' అని చెప్పారు. మరో నిర్మాత వెంకటరెడ్డి మాట్లాడుతూ 'సినిమాలో హీరో ఇంట్రడక్షన్ సాంగ్ చిత్రీకరణ పూర్తయింది. మిగిలిన పాటలు సహా టాకీ పార్ట్ డిసెంబర్‌కు పూర్తవుతుంది' అని చెప్పారు.



'షకలక' శంకర్

Contact : Ganesh Dhari

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత))	వెండి (కిలో)	రూపాయి (ఒక డాలర్‌కు)	ముడి చమురు
41,020.61	12,100.70	37,906	44,425	71.35	64.22
199.31	63.00	48	175	15 పైసలు	

రూ.500 కోట్ల సమీకరణ!

కార్వీ యత్నాలు.. వాటా విక్రయ యోచన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత సంక్షోభం నుంచి బయటపడేందుకు కార్వీ వివిధ మార్గాలను అన్వేషిస్తోంది. రుణాల సమీకరణ, వాటా విక్రయం లేదా రెండింటి ద్వారా రూ.400-500 కోట్లను సమీకరించడానికి కార్వీ ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రధాన కంపెనీ లైన కార్వీ స్టాక్ బ్రోకింగ్ లేదా కార్వీ డేటా మేనేజ్‌మెంట్ సర్వీసెస్ కంపెనీల్లో ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ద్వారా వాటా విక్రయానికి ఉన్న అవకాశాలను కార్వీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే నిధుల సమీకరణ ప్రక్రియకు కసరత్తు ప్రారంభమైంది. రెండు, మూడు నెలల్లో నిధులు సమీకరించి ఈ సంక్షోభం నుంచి బయటపడాలని భావిస్తోంది. కార్వీ బ్రోకింగ్‌లో వాటా విక్రయిస్తే హోల్డింగ్ కంపెనీగా వాటా విక్రయించాలా లేక ఆ కంపెనీ చేసే వ్యాపారంలో మాత్రమే వాటా విక్రయించాలా అనే అంశం కూడా పరిశీలన జరుగుతోంది. ఒకవేళ వాటాను విక్రయిస్తే మైనర్ వాటాను విక్రయిస్తే సరిపోతుందని.. తద్వారా సమీకరించిన నిధులతో మళ్లీ మామూలు స్థాయికి చేరవచ్చని కార్వీ గ్రూప్ భావిస్తున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. వాటాను కొనుగోలు నియమ నిబంధనలు, విలువ మొదలైన వాటిపై ఈ ప్రక్రియ ఎంత త్వరగా పూర్తవుతుందనేది ఆధారపడి ఉంటుంది. నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల జారీ ద్వారా కూడా నిధుల సమీకరించే అంశాన్ని కార్వీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కంపెనీకి చెందిన పూల్ అకౌంట్‌లో ఉన్న ఖాతాదారుల షేర్లను తనఖా పెట్టి నిధులు సమీకరించి రూ.1,096 కోట్లను గ్రూప్ కంపెనీ అయిన కార్వీ రియాలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌కు కార్వీ బ్రోకింగ్ బదిలీ చేసిందని సెబీ తన మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఏడాదిన్నరగా నిధుల సంక్షోభం

దాదాపు ఏడాది, ఏడాదిన్నర నుంచి కార్వీ గ్రూప్ నిధుల కొరతతో ఇబ్బందులు పడుతోంది. ప్రవాస భారతీయుల నుంచి నిధులు సమీకరించాలని.. ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ద్వారా వాటా విక్రయించాలని గతంలో కూడా ప్రయత్నాలు చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం చివరకు పూల్ అకౌంట్‌లో ఉన్న షేర్లను తాకట్టు పెట్టి నిధులు సమీకరించారని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. నగదు సర్దుబాటుకాకపోవడంతో షేర్లను విక్రయించిన ఖాతాదారులకు కూడా చెల్లింపులు చేయలేని పరిస్థితులు ఎదురయ్యాయని.. రూ.50,000 కూడా చెల్లించడానికి జాప్యం జరిగిందని అంటున్నారు. కార్వీ స్టాక్ బ్రోకింగ్ దాదాపు రూ.2,300 కోట్ల విలువైన 95,000 ఖాతాదారుల షేర్లను తాకట్టు పెట్టి ప్రైవేటు బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) నుంచి రూ.600 కోట్లకు పైగా నిధులు సమీకరించినట్లు తాజాగా వార్తలు వినిపిస్తున్నాయి. రుణాలను తిరిగి చెల్లించడానికి, వర్కింగ్ కేపిటల్ కోసం సమీకరించిన నిధులను వినియోగించవచ్చు.

తుది ఆదేశం కూడా ఇదే అయితే..

ఎన్ఎస్ఈ సమర్పించిన నివేదిక ఆధారంగా సెబీ కార్వీ స్టాక్ బ్రోకింగ్‌పై మధ్యంతర ఆదేశాన్ని జారీ చేసింది. ఖాతాదారుల షేర్లపై లభించిన మార్జిన్లపై ట్రేడింగ్ చేసిందని, ఖాతాదారుల షేర్లను తాకట్టు పెట్టి రుణాలు తీసుకుందని పేర్కొంది. కొత్త క్లైయింట్లను తీసుకోరాదని సెబీ పేర్కొంది. వివరణల కోసం 21 రోజుల గడువు ఇచ్చింది. తనిఖీలు, వివరణాలు పూర్తయిన తర్వాత నిబంధనల ఉల్లంఘన, నిధుల బదిలీ రుజువైతే.. కార్వీ బ్రోకింగ్ లైసెన్స్ రద్దయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇదే జరిగితే కార్వీకి పెద్ద దెబ్బపుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అదే జరిగితే పూల్ అకౌంట్‌లోకి వెళ్లిన షేర్లపైన, ట్రేడింగ్ ఖాతాలోని నగదుపై ఖాతాదారులకు ఇబ్బందులు తప్పవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాధారణంగా రిటైల్ ఖాతాదారుల ట్రేడింగ్ ఖాతాలో సగటున రూ.లక్ష వరకూ, అధిక నికర విలువ కలిగిన వ్యక్తుల (హెచ్ఎన్ఐ) ట్రేడింగ్ ఖాతాలో రూ.కోటి వరకూ ఉంటుంది. ఖాతాదారుల షేర్ల క్రయ, విక్రయాల్లో నగదు చెల్లింపు జాప్యం జరిగినప్పుడు షేర్లను బ్రోకింగ్ కంపెనీకి చెందిన పూల్ అకౌంట్‌లో ఉంచుతారు. కార్వీ స్టాక్ బ్రోకింగ్ ఉదంతం నేపథ్యంలో బ్రోకింగ్ కంపెనీలపై సెబీ తనిఖీలు నిర్వహిస్తోంది. ఇటువంటి కుంభకోణం మరొకటి బయటపడితే.. మొత్తం షేర్ మార్కెట్‌పైనే ప్రతికూల ప్రభావం పడే వీలుంది. సాధారణంగా పూల్ అకౌంట్‌లో విలువ కలిగిన షేర్లనే ఉంచుతారు. డాక్యుమెంట్ల లభ్యత, క్లైయింట్ అనుమతితోనే షేర్లు పూల్ అకౌంట్‌లోకి వెళ్లాయా మొదలైన అంశాలన్నీ పరిశీలించిన తర్వాత సెబీ తుది నిర్ణయాన్ని వెల్లడిస్తుంది.

ఇదివరకెన్నడూ అనుమతి లేదు

సెబీ చైర్మన్ అజయ్ త్యాగి

కార్వీ స్టాక్ బ్రోకింగ్ ఇదివరకెన్నడూ అనుమతించని కార్యకలాపాలకు పాల్పడిందని సెబీ చైర్మన్ అజయ్ త్యాగి అన్నారు. క్లయింట్ల నిధులను సొంత అవసరాలకు వాడుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కార్వీ స్టాక్ బ్రోకింగ్‌పై గత వారం సెబీ ఆంక్షలు విధించింది. కొత్త క్లయింట్లను చేర్చుకోవడమే కాదు ఆర్డర్లను ఎగ్జిక్యూట్ చేయకుండా నిషేధించింది. ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ)-ఏషియన్ రౌండ్ టేబుల్ ఆన్ కార్పొరేట్ గవర్నెన్స్ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా త్యాగి మీడియా వర్గాలతో మాట్లాడారు. "జూన్‌లోనే సర్క్యులర్ జారీ ద్వారా ఈ విషయమై సెబీ తన వైఖరిని స్పష్టం చేసింది. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడేందుకు అనుమతి లేదని సంకేతాలిచ్చింది"అన్నారు.

సెబీని నివేదిక కోరనున్న ఎంసీఏ

కార్వీ అక్రమాలపై కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంసీఏ) సెబీని నివేదిక కోరనుంది. ఈ బ్రోకింగ్ కార్పొరేట్ పాలన ప్రమాణాల ఉల్లంఘనకూ పాల్పడిందా అని పరిశీలించేందుకే సెబీని వివరాలు కోరినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే సెబీ నిషేధం ఎదుర్కొంటున్న కార్వీకి.. ఎంసీఏ కూడా దర్యాప్తు ప్రారంభిస్తే ఇబ్బందులు మరింత పెరగవచ్చని మార్కెట్ వర్గాలంటున్నాయి.

కార్వీ కంపెనీల అప్పులు రూ.2,900 కోట్లు!

సెబీ, ఎన్ఎస్ఈ వద్ద బ్యాంకుల ఆందోళన

కార్వీ గ్రూప్ కంపెనీలకిచ్చిన రుణాలను తిరిగి రాబట్టుకునే విషయంలో బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలకు బెంగ మొదలైంది. మరి మా పరిస్థితేంటంటూ రుణదాతలు సెబీ, స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల వద్ద ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహా పలు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు కార్వీ గ్రూప్ కంపెనీలు రూ.2,900 కోట్ల వరకు రుణ బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం బ్యాంకులు కార్వీపై సెబీ నిషేధం ప్రభావాన్ని అంచనా వేస్తున్నాయి. ఒకవేళ కంపెనీ డిఫాల్ట్ అయితే బకాయిలు రాబట్టుకునేందుకు చేపట్టాల్సిన చర్యలపై కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది.

తొలి ఏడాది ప్రీమియం ఆదాయంలో ఎల్ఐసీ వాటా 73%

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీవిత బీమా రంగంలో తొలి ఏడాది ప్రీమియం ఆదాయంలో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) వాటా పెరిగింది. 2019 మార్చి 31నాటికి తొలి ఏడాది ప్రీమియం ఆదాయంలో ఎల్ఐసీ వాటా 66.24 శాతం ఉంటే.. సెప్టెంబరునాటికి 73 శాతానికి చేరిందని ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్ టీసీ సుశీల్ కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో దక్షిణ మధ్య ప్రాంత డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, ఏజెంట్లను ఉద్దేశించి మాట్లాడారు. పాలసీలపరంగా 2019 అక్టోబరులో ఎల్ఐసీ వాటా 78% ఉందన్నారు. పాలసీదారులకు దాదాపు రూ.50 వేల కోట్ల బోనస్‌లు చెల్లించినట్లు చెప్పారు. .

ఐటీ కోర్సులో శిక్షణకు 'ఆక్సీలోన్స్'లో రుణాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పీర్ టు పీర్ రుణాలకు వేదికగా ఉన్న ఆక్సీలోన్స్ కొత్త తరం రుణాలను అందించే వెసులుబాటు కల్పిస్తోంది. ఐటీ రంగంలో కొత్త టెక్నాలజీల్లో నైపుణ్యాల సాధించడం తప్పనిసరి అయింది. డేటా అనలిటిక్స్, ఐఓటీ, బ్లాక్‌చైన్, మెషిన్ లెర్నింగ్ వంటి డీప్ టెక్నాలజీల్లో శిక్షణకు రూ.2 లక్షలు అంతకు మించి ఖర్చవుతోంది. ఈ నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ నిపుణుల కోసం 'అప్‌స్కిల్' రుణాలు ఇచ్చే సదుపాయాన్ని కల్పించామని ఆక్సీలోన్స్ డాట్ కామ్‌ను నిర్వహిస్తున్న ఎస్ఆర్ఎస్ ఫిన్‌టెక్ లాబ్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ రాధాకృష్ణ తటవర్తి తెలిపారు.

వీఎస్ఈజడ్‌లో చైనా కంపెనీ

కూర్మన్నపాలెం (విశాఖపట్నం): విశాఖపట్నం ప్రత్యేక ఆర్థిక మండలి (వీఎస్ఈజడ్)లో చైనాకి చెందిన టీఎస్‌యూఎన్ టాట్ టాయ్ కంపెనీ ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ బొమ్మల తయారీ కర్మాగారం ఏర్పాటు చేయనున్నది. సుమారు కోటి డాలర్లను పెట్టుబడిగా పెట్టనుందని వీఎస్ఈజెడ్ డెవలప్‌మెంట్ కమిషనర్ రామమోహన్ రెడ్డి చెప్పారు. ఈ సంస్థ ద్వారా మూడు వేల మందికి ఉపాధి లభించనుందని తెలిపారు. ఈ కంపెనీలో తయారైన ఉత్పత్తులు యూరప్, ఉత్తర అమెరికా దేశాలకు ఎగుమతి చేయనున్నారు.

తొలి ఆల్ట్రోజ్ వచ్చేసింది

టాటా మోటార్స్ 'ఆల్ట్రోజ్' పేరుతో ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ కారును జనవరిలో మార్కెట్లోకి విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. కంపెనీకి పుణెలోని చకన్ వద్దనున్న ప్లాంట్‌లో ఈ కారును ఉత్పత్తి చేస్తోంది. విక్రయానికి సిద్ధం చేసిన తొలి ఆల్ట్రోజ్ కారును బుధవారం సంస్థ ప్రదర్శించింది. గత ఏడాది ఇండియా ఆటోఎక్స్‌పోలో ఈ కారును తొలుత ప్రదర్శించిన టాటా మోటార్స్.. ఈ ఏడాది మార్చిలో జరిగిన జెనీవా మోటార్ షోలోనూ ఆవిష్కరించింది.

మార్కెట్లోకి బీఎస్-6 జూపిటర్

టీవీఎస్ మోటార్ కంపెనీ.. తన ప్రముఖ స్కూటర్ జూపిటర్‌లో బీఎస్-6 వేరియంట్‌ను విడుదల చేసింది. దీని ధర రూ.67,911. ఇది ఢిల్లీ షోరూం ధర. ఎకోథ్రస్ట్ ఫ్యూయల్ ఇంజెక్షన్ (ఈటీ-ఎఫ్ఐ) టెక్నాలజీతో రూపొందించిన ఈ స్కూటర్ ఇదివరకటి వేరియంట్ల కంటే 15 శాతం అధిక మైలేజీ ఇస్తుందని కంపెనీ తెలిపింది. ఈ వాహనానికి మొబైల్ ఫోన్ కబ్బీ, యూఎస్‌బీ చార్జర్, టింటెడ్ వైసర్‌ను కూడా అమర్చారు. 2013లో విడుదలైన జూపిటర్ స్కూటర్లు ఇప్పటివరకు 30 లక్షల యూనిట్లకు పైగా అమ్ముడయ్యాయి.

అమ్ముడుపోకపోతే మూసివేతే

ఎయిర్ ఇండియాపై ప్రభుత్వం

ఈసారి మరింత ఆకర్షణీయంగా

న్యూఢిల్లీ: పీకల్లోతు అప్పుల్లో ఉన్న ఎయిర్ ఇండియాను మోయడం తమవల్ల కాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రైవేటీకరణ కోసం త్వరలో చేస్తున్న మరో ప్రయత్నం విఫలమైతే నిర్వహణ కష్టమేనని ప్రభుత్వం వెల్లడించింది. భారీ నష్టాలతో నడిపే కంటే మూసివేయడమే మంచిదని భావిస్తోంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి బుధవారం రాజ్యసభలో ఈ విషయం చెప్పారు. 'ప్రైవేటీకరణ కుదరకపోతే ఇక ఎయిర్ ఇండియాను మూసివేయడమే మార్గం' అన్నారు. ఏడాదిన్నర క్రితం కూడా మోడీ ప్రభుత్వం ఎయిర్ ఇండియా ఈక్విటీలో 76 శాతం వాటాను అమ్మకానికి పెట్టింది. అయితే కంపెనీ అప్పులు, నష్టాలు చూసి ఏ కంపెనీ కూడా ఎయిర్ ఇండియాలో మెజారిటీ వాటా కొనుగోలు చేసేందుకు ముందుకు రాలేదు.

ఈ ఆర్థిక సంవత్సరం చివరిలోగా ఎలాగైనా ఎయిర్ ఇండియాను వదిలించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం కంపెనీలను ఆకర్షించేందుకు కంపెనీ ఈక్విటీలో పూర్తి వాటాను అమ్ముతామని ప్రకటించింది. దీనికి తోడు కంపెనీకి ఉన్న దాదాపు రూ.78,450 కోట్ల అప్పుల్లో రూ.50,000 కోట్ల అప్పుల్ని మినహాయిస్తోంది. ప్రైవేటీకరిస్తే ఉద్యోగాలు పోతాయని భయపడుతున్న ఉద్యోగుల్ని సముదాయించేందుకూ చర్యలు చేపట్టింది. ప్రైవేటీకరించిన ఏడాది వరకు సిబ్బంది ఉద్యోగాలకు ఎలాంటి ఢోకా ఉండదని కేంద్ర మంత్రి పురి బుధవారం రాజ్యసభలో ప్రకటించారు. వీలైనంత త్వరలో కంపెనీ లెక్కల పద్దులు తేల్చి వచ్చే నెల 15 నుంచి ఆసక్తి ఉన్న కంపెనీలను ఆసక్తి వ్యక్తీకరణలకు అనుమతించాలని ప్రభుత్వం భావిస్తోంది.

పెట్రో కెమికల్ రీజియన్‌కు కేంద్రం పెట్టుబడులు

రూ.20,928కోట్లతో హెచ్‌పీసీఎల్ విస్తరణ

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పెట్రోలియం, కెమికల్స్- కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియనన్(పీసీపీఐఆర్)లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కాకినాడ-విశాఖపట్నం మధ్య రానున్న ఈ ప్రాంతంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు కేంద్రం కూడా ముందుకొచ్చిన నేపథ్యంలో పెట్టుబడిదారులను ఆకర్షించాలని నిర్ణయించింది. పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌లో దాదాపు రూ.2లక్షల కోట్లు కేంద్ర సంస్థల ద్వారా పెట్టుబడులు పెట్టించాలని కేంద్రం లక్ష్యం పెట్టుకుంది. విశాఖ సమీపంలోని హెచ్‌పీసీఎల్ చమురు రిఫైనరీ ఆధునీకరణకు రూ.20,928కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. ఆ తర్వాత దీని ఉత్పత్తి సామర్థ్యం 8.33మిలియన్ టన్నుల నుంచి 15మిలియన్ టన్నులకు పెరగనుంది

మంత్రి మేకపాటితో జర్మన్ కంపెనీ భేటీ

లోగో డిజైనింగ్, బ్రాండింగ్‌లో పేరున్న జర్మనీ కంపెనీ యాక్టెట్ ఏంజెలీ ప్రతినిధులు మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డితో భేటీ అయ్యారు. విశాఖపట్నం బ్రాండింగ్‌పై ప్రధానంగా చర్చించారు. ఎన్నో ప్రత్యేకతలు, అవకాశాలు, సదుపాయాలున్న విశాఖను బ్రాండింగ్ సిటీగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. విశాఖ బ్రాండింగ్ పెంపునకు దిశా నిర్దేశం చేసే ప్రజంటేషన్‌తో మరోసారి కలవాలని సూచించారు. మరోవైపు కేపీఎంజీ ప్రతినిధులు కూడా మంత్రిని కలిశారు. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. నైపుణ్యాభివృద్ధిలో దేశంలోనే ఏపీ అగ్రస్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకున్న విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. సీఎం జగన్ ఆశయం ప్రకారం యువతకు ఉపాధి అవకాశాలు అందించడమే లక్ష్యంగా నైపుణ్యరంగంలో ఏపీని రోల్‌మోడల్‌గా నిలబెట్టనున్నట్లు వెల్లడించారు. అందుకు ఇతర రాష్ట్రాల్లో ఉన్న అత్యుత్తమ విధానాలను ఏపీ అనుసరించే మార్గాలపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కేపీఎంజీ ప్రతినిధులకు మేకపాటి స్పష్టం చేశారు. నైపుణ్యం కొరవడిన రంగాలేవి? భవిష్యత్‌లో ఉద్యోగాలు అందించే కోర్సులేవి? ప్రభుత్వ లక్ష్యాలను చేరడంలో ప్రైవేటు భాగస్వామ్యమెంత? జిల్లాలు, మంత్రిత్వ శాఖల వారీగా లక్ష్యాలెలా ఉండాలి? వంటి అనేక అంశాలపై కేపీఎంజీ ప్రతినిధులతో మంత్రి చర్చించారు.

పౌల్ట్రీకి ప్రభుత్వ సహకారం

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి): పౌల్ట్రీ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా సబ్ కమిటీని ఏర్పాటు చేస్తామని తెలంగాణ పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ హామీ ఇచ్చారు. బుధవారంనాడిక్కడ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో 2019ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌల్ట్రీ పరిశ్రమ ద్వారా దాదాపు రూ. 12,000 కోట్ల ఆదాయం సమకూరుతోందన్నారు. ఈ ఆదాయం రాష్ట్ర జీడీపీని ప్రభావితం చేస్తుందన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా పౌల్ట్రీ పరిశ్రమపై సుమారు 6.50 లక్షల మంది ఆధారపడి ఉన్నారన్నారు. పౌల్ట్రీ రైతులకు కూడా గిట్టుబాటు ధర అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

సెన్సెక్స్ @ 41,000

- నిఫ్టీ 12,100
- ఆల్ టైమ్‌లో ముగిసిన రెండు సూచీలు

ముంబై: ఒక అడుగు వెనక్కి... మూడు అడుగులు ముందుకు అన్నట్టుగా సాగుతోంది దేశీయ స్టాక్ మార్కెట్ల ప్రయాణం. ముందుకుసాగిన తరుణంలో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి మార్కెట్ సూచీలు. బుధవారం నాడు బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ 199.31 పాయింట్లు పెరిగి జీవిత కాల గరిష్ఠ స్థాయి 41,020.61 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 63 పాయింట్ల వృద్ధితో 12,100.70 పాయింట్ల వద్ద క్లోజైంది. ఇది కూడా జీవిత కాల గరిష్ఠ స్థాయే. విదేశీ నిధుల ప్రవాహంతో మార్కెట్లు సరికొత్త రికార్డును నమోదు చేశాయని విశ్లేషకులు చెబుతున్నారు. మంగళవారం నాడు విదేశీ ఇన్వెస్టర్లు రూ.4,677.75 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. బుధవారం నాడు కూడా వీరి కొనుగోళ్లు కొనసాగినట్టు చెబుతున్నారు. బ్యాంకింగ్, ఐటీ, ఆటో షేర్లను భారీ ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న అంచనాలతో బ్యాంకింగ్ షేర్లు జోరుగా పెరిగాయి. తొలి పబ్లిక్ ఆఫర్‌కు సంబంధించి సెబీకి ఎన్‌బీఐ కార్డ్స్ పత్రాలు సమర్పించిన నేపథ్యంలో ఎస్‌బీఐ షేరు 2.43 శాతం పెరిగింది. కోటక్ బ్యాంక్ 1 శాతం, ఇండస్ఇండ్ బ్యాంకు 0.64 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 1.41 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 0.29 శాతం, మారుతీ 2.38 శాతం, సన్‌ఫార్మా 1.87 శాతం, హెచ్‌యూఎల్ 1.78 శాతం, ఓఎన్‌జీసీ 1.72 శాతం పెరిగాయి. హెచ్‌సీఎల్ టెక్, ఆర్ఐఎల్, వేదాంత కూడా లాభపడ్డాయి.

2020 డిసెంబరు నాటికి 43,000!

సెన్సెక్స్ కొత్త రికార్డు సృష్టించినప్పుడల్లా సమీప భవిష్యత్‌లో ఈ సూచీ ఏ స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుందో కొన్ని అంచనాలు వెలువడుతుంటాయి. ఈ ఏడాది జూన్‌లో సెన్సెక్స్ 40,000 స్థాయిలో ఉంది. ఇప్పుడు 41,000 స్థాయికి చేరుకుంది. వచ్చే 12 నెలల కాలంలో అంటే దాదాపు 2020 డిసెంబరు నాటికి సెన్సెక్స్ 43,000 స్థాయికి చేరుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. మనీకంట్రోల్ నిర్వహించిన పోల్‌లో మెజారిటీ నిపుణులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

27న ఫారం గేటు అమ్మకం ధరలు

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.95 — నెక్ (100 గుడ్లు)

హైదరాబాద్	435	28వ తేదీకి..	
బెంగళూరు	453	విశాఖపట్నం	455
విజయవాడ	451	వరంగల్	438
గోదావరి	451	చెన్నై	468
నమక్కల్	423	చిత్తూరు	461
		ముంబై	490

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	94	విజయవాడ	96
వరంగల్	94	గుంటూరు	98
మహబూబ్‌నగర్	94	ఒంగోలు	98
కరీంనగర్	94	చిత్తూరు	98
కర్నూలు	94	నెల్లూరు	98
విశాఖపట్నం	87	అనంతపురం	94
గోదావరి	93		

బులియన్

బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	37,970	38,760	39,020	38,750	37,730
క్రితం ముగింపు	38,140	38,700	39,020	38,650	37,790
22 క్యారెట్లు	36,190	35,900	35,890	35,910	36,120
క్రితం ముగింపు	36,300	35,850	35,890	35,940	36,180
వెండి (కిలో)	44,200	45,700	45,600	45,700	47,900
క్రితం ముగింపు	44,000	45,600	45,600	45,600	47,700

ముగింపు నిలకడ

టెక్నో స్ట్రాట

నిఫ్టీ బలంగా ప్రారంభమై తదుపరి స్థాయి 12100 వరకు కూడా వెళ్లి ఇంట్రాడే కరెక్షన్‌లో పడింది. కాని 12000 కన్నా పైన నిలకడగా నిలిచి అప్‌ట్రెండ్‌ను సానుకూలంగా కొనసాగించింది. ఆ తర్వాత సాధించిన రికవరీతో చివరికి 12100 వద్ద డే గరిష్ఠ స్థాయిలో నిలకడగా ముగిసింది. 12000 వద్ద ఏర్పడిన పుల్‌బ్యాక్ రియాక్షన్ తర్వాత కూడా నిలకడగా నిలవడం సానుకూల ధోరణికి సంకేతం. ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిల్లో ముగియడం వల్ల మరింత కొత్త శిఖరాలకు నిచ్చెన వేసే ఆస్కారం ఉంది.

గురువారం స్థాయిలివే...
నిరోధం : 12130 మద్దతు : 12060

- మరింత అప్‌ట్రెండ్ కోసం ఇంట్రాడే నిరోధం 12130 వద్ద నిలదొక్కుకుని అంతకన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. తదుపరి మానసిక అవధి 12200.
- మైనర్ ఇంట్రాడే మద్దతు స్థాయి 12060 కన్నా దిగజారితే మైనర్ బలహీనత ఏర్పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 12000. అంతకన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలిక కరెక్షన్‌కు ఆస్కారం ఉంటుంది.

■ వి.సుందర్ రాజా

మిడ్ సెషన్ మెరుగు

స్టాక్ ఆస్ట్రో

తిథి : మార్గశిర శుక్ల విదియ; నక్షత్రం : మూల
అప్రమత్తం : రోహిణి, హస్త, శ్రవణం నక్షత్ర జాతకులు, మకర, వృషభ రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 1.28

ధోరణి: నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజం/మెరుగ్గా ప్రారంభమై 10.40 వరకు అదే ధోరణిలో ట్రేడ్‌కావచ్చు. ఆ తర్వాత 12.20 వరకు, తిరిగి 2 గంటల నుంచి చివరి వరకు నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది. మధ్యలో 12.20 నుంచి 2 గంటల మధ్యలో మెరుగ్గా ట్రేడ్ కావచ్చు.

ట్రేడింగ్ వ్యూహం: నిఫ్టీ ఫ్యూచర్స్ 10.45 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 12.15 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 12.30 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 2 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం : 12140, 12175 మద్దతు స్థాయిలు : 12060, 12025

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinanciala strologer.blogspot.in

ఏపీలో రౌడీ రాజ్యం!

- దాడులు, తప్పుడు కేసులతో వేధింపులు
- అక్కడ మానవ హక్కులు లేవు
- అమిత్‌షాకు టీడీపీ ఎంపీల ఫిర్యాదు
- నాకు తెలుసు... చూసుకుంటాను: షా

న్యూఢిల్లీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో రౌడీ రాజ్యం ఏలుతోందని, సామాన్య ప్రజలతోపాటు విపక్ష నేతలు, కార్యకర్తలకు సైతం భద్రత లేకుండా పోయిందని టీడీపీ ఎంపీలు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఫిర్యాదు చేశారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలు పెరిగిపోయాయన్నారు. బుధవారం టీడీపీపీ నేత గల్లా జయదేవ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ ఎంపీలు కనక మేడల రవీంద్ర కుమార్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, తోట సీతారామ లక్ష్మి పార్లమెంటు భవన్‌లోని అమిత్ షా చాంబర్‌లో ఆయనతో భేటీ అయ్యారు. "మా పార్టీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతూ, తిరిగి మాపైనే తప్పుడు కేసులు పెడుతున్నారు. సీఎం జగన్ పోలీసులపై తెచ్చిన ఒత్తిడి తెస్తున్నారు. మా శ్రేణులను వేధిస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. ఏపీలో మానవ హక్కులు లేవు" అని తెలిపారు. దీనిపై అమిత్‌షా స్పందిస్తూ... 'ఏపీలో ఏం జరుగుతుందో నాకు తెలుసు. నేను చూసుకుంటాను' అని బదులిచ్చినట్లు టీడీపీ ఎంపీలు చెబుతున్నారు. ఏపీలో కొత్త ప్రభుత్వ అవినీతి, అరాచకాల మరిన్ని వివరాలతో మరొకసారి కలుస్తామని చెప్పగా... 'మీరు ఎప్పుడైనా రావొచ్చు. కలవొచ్చు' అని చెప్పారన్నారు.

'అమరావతి' చేర్పుపై కృతజ్ఞతలు

భారత రాజకీయ పటంలో ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని 'అమరావతి' పేరును చేర్చినందుకు టీడీపీ ఎంపీలు అమిత్ షాకు కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై తమ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు రాసిన లేఖను ఆయనకు ఇచ్చారు.

ప్రధానితో వైసీపీ ఎంపీ మాగుంట భేటీ

న్యూఢిల్లీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): "ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గంలో చాలాకాలంగా పరిష్కారానికి నోచుకోని ప్రధాన సమస్యలనేకం ఉన్నాయి. వాటిని తక్షణమే పరిష్కరించండి" అని ఒంగోలు వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం పార్లమెంటు భవన్‌లోని ప్రధాని కార్యాలయంలో నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాగుంట.. ప్రకాశం జిల్లాకు సంబంధించిన పలు దీర్ఘ కాలిక సమస్యలను ప్రధానికి వివరించారు. వాటిపై ఒక కార్యాచరణ ప్రణాళికతో తనకు ప్రతిపాదనలిస్తే, సానుకూలంగా పరిశీలిస్తానని ప్రధాని మోదీ హామీ ఇచ్చినట్లు మాగుంట తెలిపారు. జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ)లో తన నియోజకవర్గానికి చెందిన వ్యక్తిని సభ్యునిగా నియమించాలని కోరినట్లు ఆయన వివరించారు.

సంస్కృతి విచ్ఛిన్నానికి కుట్ర

- దేశ సమగ్రతను నాయకులు కాపాడాలి: పవన్
- 'ఆంధ్రజ్యోతి'లో మాజీ డీజీపీ వ్యాసానికి స్పందన

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దేశ సంస్కృతిని మరుగుపరచడానికి కొన్ని మేధావి వర్గాలు అనేక ప్రయోగాలు చేస్తున్నాయని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. 'తెలుగ వర్ధిల్లితేనే వెలుగు' శీర్షికతో మాజీ డీజీపీ కె.అరవింద రావు రాసిన వ్యాసం 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పవన్ మాట్లాడుతూ 'ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదం' అని జనసేన పార్టీ మూల సిద్ధాంతాల్లో పెట్టడానికి బలమైన కారణాలు ఉన్నాయన్నారు. భిన్నత్వం లో ఏకత్వం సాధించడానికి నాయకులు కృషి చేయకపోవ డం వల్ల అంతరాలు అలాగే ఉన్నాయన్నారు. కొంతమంది త మ రాజకీయ లబ్ధికోసం వాటిని పెంచేశారని, ఇంకా పెంచుతూనే ఉంటారని అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్నే 2014లో ప్రధాని మోదీకి వివరించినట్లు తెలిపారు. దేశపు మూలాలైన భాష, సంస్కృతులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భాషకు, సంస్కృతికి నష్టం కలిగిస్తే దేశ సమగ్రతకు ముప్పు వాటిల్లుతుందని, దీనిపై ప్రధానమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టాలని పవన్ కోరారు.

బందరు లడ్డూకు భౌగోళిక గుర్తింపు

న్యూఢిల్లీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బందరు లడ్డూకు భౌగోళిక గుర్తింపు ఇచ్చామని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. బుధవారం లోక్‌సభలో వైసీపీ ఎంపీ వల్లభనేని బాలశౌరి అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఈ లడ్డూను జియోగ్రఫికల్ ఇండికేషన్స్ ఆఫ్ గూడ్స్ చట్టం, 1999 కింద నమోదు చేశామని పేర్కొన్నారు.

పాస్టర్లు..ఇమాంలకు పారితోషికమా!

- ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పాస్టర్లు, ఇమాంలు, మౌజన్‌లకు ఏనిబంధన మేరకు పారితోషికం ఇవ్వనున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై తగిన వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి, మైనారిటీ సంక్షేమశాఖ కమిషనర్, వక్ఫ్‌బోర్డు సీఈవోకు నోటీసులు జారీ చేసింది. పాస్టర్లు, ఇమాంలు, మౌజన్‌లకు పారితోషికం ఇచ్చేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం చెప్పడాన్ని సవాల్ చేస్తూ రామబొట్ల శ్రీనివాస్ సుదీష్ అనే వ్యక్తి హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ జి.శ్యాం ప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

100% రీయింబర్స్

(మొదటి పేజీ తరువాయి)

సచివాలయంలో మీడియాకు వెల్లడించారు.పేదలకు వైద్యచికిత్సల కోసం ఆరోగ్యశ్రీ కార్డులు, రేషన్ సరుకుల కోసం బియ్యం కార్డులు జారీచేసేందుకు కేబినెట్ ఆమోదాన్ని తెలిపింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కార్డులను జారీ చేసేందుకూ తీర్మానించింది. హాస్టళ్లలో సౌకర్యాల మెరుగుకోసం 'జగనన్న వసతి దీవెన', 'విద్యా దీవెన' కింద ఏడాదికి మొత్తం రూ.5,700 కోట్లు ఖర్చు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిసింది. అటు కాపు వర్గానికి చెందిన మహిళలకు ఆర్థిక సాయం అందించే నూతన పథకం వైఎస్సార్ కాపునేస్తం పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. ఆరోగ్య చికిత్సల కోసం ప్రత్యేకంగా పేదలు, దిగువ మధ్యతరగతి వర్గానికి ఆరోగ్యశ్రీకార్డులు జారీ చేసేందుకు ఆమోదముద్ర వేసింది. రేషన్ సరుకుల కోసం ప్రత్యేకంగా బియ్యం కార్డుల జారీపై నిర్ణయం తీసుకుంది. కొత్త కార్డుల జారీకి సంబంధించి కూడా ఆదాయ నిబంధనల్ని సడలిస్తూ కేబినెట్ ఆమోదం తెలియజేసింది. గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.10వేలు, పట్టణాల్లో నెలకు రూ.12వేలులోపు ఆదాయం ఉన్న వారికి వర్తించేలా నిబంధనల్లో మార్పు చేసిన ప్రతిపాదనకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గతంలో అర్హులైనా రేషన్‌కార్డులు దక్కనివారి నుంచి దరఖాస్తులు స్వీకరించి కార్డులు జారీ చేయనున్నారు.

20 ఎకరాలున్న రైతుకూ కార్డు

అమ్మఒడి నుంచి కళాశాల చదువుల వరకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ప్రత్యేక కార్డునూ జారీ చేసేందుకు ఆమోదాన్ని తెలియజేసింది. పౌరసరఫరాల సంస్థ ద్వారా ఈ కార్డుల ముద్రణ చేపట్టనున్నారు. డిసెంబరు నాటికి నవశకం కార్యక్రమం ద్వారా సర్వే పూర్తి చేసి 2020 జనవరి ఒకటో తేదీ నుంచి కార్డుల జారీకి శ్రీకారం చుట్టాలని నిర్ణయించింది. కార్డుల ముద్రణ కోసం పౌరసరఫరాల శాఖ రూ.20 కోట్లు ఖర్చు చేసేందుకు కేబినెట్ అనుమతించింది. హాస్టళ్లలో సౌకర్యాల మెరుగు కోసం 'జగనన్న వసతి దీవెన' కింద ఏడాదికి రూ.2,300 కోట్లు, 'జగనన్న విద్యా దీవెన' కింద రూ.3,400 కోట్లు ఖర్చుచేయాలని కేబినెట్‌లో తీర్మానించారు. 'జగనన్న విద్యాదీవెన' కోసం అర్హతలు సడలిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఏడాది రూ.2.5 లక్షల ఆదాయం లోపు వారందరికీ, అలాగే రైతులకు 10 ఎకరాల మాగాణి, 20 ఎకరాల లోపు మెట్ట భూమి ఉన్నవారికీ; ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పారిశుద్ధ్య పనిచేసేవారి పిల్లలకు, ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల పిల్లలకూ 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుచేస్తామని సమాచార, పౌరసంబంధాల మంత్రి పేర్ని నాని స్పష్టం చేశారు. పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ ఆపై కోర్సులను ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు, అనుబంధ విశ్వవిద్యాలయాలు, బోర్డుల్లో చదువుతున్న విద్యార్థులందరికీ వర్తించేలా కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. ఐటీఐ విద్యార్థులకు వసతి దీవెన కింద ఏడాదికి రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఏడాదికి రూ.15 వేలు, డిగ్రీ ఆపై విద్య చదువుతున్న వారికి ఏడాదికి రూ.20 వేలు ఇవ్వనున్నారు. వసతి దీవెన, విద్యా దీవెన నిధులను లబ్ధిదారులకు డిసెంబరులో సగం, జూలైలో సగం ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. వీటిని విద్యార్థుల తల్లి ఖాతాలో జమచేస్తామన్నారు.

'గిరిజన' ఆశాలకు 4వేలు

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ఏర్పాటుచేసిన అధికారుల కమిటీకి కేబినెట్ ఆమోదం తెలిపినట్లు మంత్రి పేర్ని నాని తెలిపారు. 2020 జూన్ 30లోగా దీనిపై నివేదిక ఇవ్వాలని కేబినెట్ సూచించింది. అలాగే, సీపీఎస్ రద్దుపై ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీకి సహాయంగా ఉండేందుకు అధికారుల కమిటీకి మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. గిరిజన ప్రాంతాల్లో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఆశావర్కర్ల గౌరవ వేతనాన్ని రూ.400 నుంచి రూ.4000 పెంచుతూ ఆమోద ముద్ర వేశారు.

దక్షిణం నుంచి ఏపీని వేరుచేసి..

దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏపీఎస్పీడీసీఎల్ నుంచి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలను వేరుచేసి ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసేందుకు కేబినెట్ ఆమోదాన్ని తెలిపింది. ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా బ్యాంకుల నుంచి రుణాల స్వీకరణకు కేబినెట్ ఆమోదం తెలియజేసింది. పేదలందరికీ ఇళ్ల పథకానికి కేబినెట్ ఆమోదం తెలిసింది.

కడప స్టీల్‌ప్లాంట్‌కు వచ్చే 26న శంకుస్థాపన

కడప జిల్లాలో ఏర్పాటు చేయనున్న స్టీల్‌ప్లాంట్‌కు డిసెంబరు 26వ తేదీన శంకుస్థాపన చేసేందుకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లి - పెద్ద దండ్లూరు (పెద్ద నందలూరు) వద్ద 3200 ఎకరాల భూమి కేటాయించాలని కేబినెట్‌లో తీర్మానించారు. దీనికోసం ఏపీహైగ్రేడ్ స్టీల్ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. కడప ఉక్కుకోసం కావాల్సిన ముడి ఇనుము సరఫరా కోసం ఎన్‌ఎండీసీతో ఒప్పందం చేసుకోవాలని కేబినెట్ తీర్మానించింది. ఇంటర్ విద్యను పాఠశాల విద్య, నియంత్రణ, పర్యవేక్షణా కమిషన్ పరిధిలోకి చేర్చుతూ ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదాన్ని తెలిసింది. ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరుగా కమిషన్లు ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది. టీటీడీ పాలకమండలి సభ్యుల సంఖ్యను 19 నుంచి 29కి పెంచుతూ దేవాదాయ శాఖ చట్టంలో సవరణల కోసం తీసుకున్న నిర్ణయానికీ కేబినెట్ ఆమోదం తెలిపింది. విశాఖ జిల్లా పరవాడ మండలం తాడిగ్రామంలో ఏపీఐఐసీకి 50 ఎకరాల భూమి కేటాయించారు. దీన్ని పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణకు వినియోగించనున్నట్టు మంత్రి తెలిపారు.

కాపు మహిళకు రూ.15 వేలు

వైఎస్సార్ కాపునేస్తం కింద కాపు మహిళలకు ఆర్థిక సాయం అందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 45- 60ఏళ్ల లోపు వయసుగల కాపు మహిళలకు ఏడాదికి రూ.15,000 అందజేయనున్నారు. ఐదేళ్లలో 75వేలు అందజేస్తామని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి రూ.1,101కోట్లు ఖర్చు పెడతామని మంత్రి పేర్ని నాని చెప్పారు. "నవశకంలో అంకలు లేకుండా అర్హులైన అందరికీ ఈ పథకం వర్తింపజేస్తాం. డిసెంబరు 20 లోపు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేస్తాం. ఈ పథకం ద్వారా మహిళలకు ఏడాదికి అందించాలని నిర్ణయించిన రూ. 15 వేలు సాయంలో తొలి విడత నిధులను ఈ ఏడాదిలోనే నిధులు విడుదల చేస్తాం" అని మరో మంత్రి శంకరనారాయణ తెలిపారు.

ఆంగ్ల మాధ్యమాన్ని వ్యతిరేకించే పార్టీలకు ఎన్నికల్లో ఒక్క సీటూ రాదు

- కార్పొరేట్ శక్తులే వ్యతిరేకిస్తున్నాయి: కంచ ఐలయ్య

విజయవాడ విద్యాధరపురం, నవంబరు 27: ఆంగ్ల మాధ్యమాన్ని వ్యతిరేకించే రాజకీయ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాదని ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. బుధవారం విజయవాడలో ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టాలని సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని ప్రశంసించారు. ఈ నిర్ణయం వల్ల పేద పిల్లల భవిష్యత్ మారుతుందన్నారు. అమ్మఒడి వల్ల పేదల బతుకులు మారతాయని, దీన్ని వ్యతిరేకిస్తున్న వారిని చీపుర్లతో తరిమికొట్టాలని తల్లులకు పిలుపు నిచ్చారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు ఏమి తెలుసని ఇంగ్లీషు గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆయన ఇలాగే వ్యవహరిస్తే వచ్చే ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాదని హెచ్చరించారు. జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల పిల్లల జీవితాలు బాగుపడటం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు ఇష్టం లేదా అని ప్రశ్నించారు.

జగన్ మంత్రులు జాతిరత్నాలు!

- నోరు విప్పితే బూతుపురాణమే: సీపీఐ కార్యదర్శి రామకృష్ణ ఫైర్

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): "జగన్ కేబినెట్‌లోని మంత్రులు జాతిరత్నాలు" అంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఎద్దేవా చేశారు. వారు నోరు విప్పితే వినేందుకు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, కొందరు బూతులు మాట్లాడుతుంటే.. ఇంకొందరు సూక్తులు, సామెతలు చెబుతున్నారని విమర్శించారు. విజయవాడలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రులే నోటికి అడ్డు అదుపు లేకుండా మాట్లాడితే.. ఎలా? అని ప్రశ్నించారు. ఉన్నత స్థానంలో ఉన్న స్పీకర్ తమ్మినేని సీతారామ్ నోటి నుంచి కూడా బూతులు వినిపిస్తుంటే సీఎం జగన్ ఎలా సమర్థిస్తారని రామకృష్ణ నిలదీశారు. జగన్ ఇప్పటికైనా స్పందించి మంత్రులను నియంత్రించాలన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ రాజధానిని శ్మశానంతో పోల్చడం దారుణమన్నారు. ఆయనకు నోరేలా వచ్చిందో అర్థం కావడం లేదని విమర్శించారు. అధికార పార్టీయే రాజధానిని శ్మశానంగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు.

తెలుగు మాధ్యమం రద్దుపై భూమన మౌనం!

తిరుపతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రంలో నిర్బంధ ఇంగ్లీషు మాధ్యమంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తెలుగు భాషాభిమానులంతా భగ్గుమంటున్నారు. ఆవేదననూ, ఆగ్రహాన్నీ వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి వేదికగా తెలుగు భాషకు బ్రహ్మోత్సవాలు భారీ ఎత్తున నిర్వహించిన తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మాత్రం దీనిపై మౌనం వహిస్తున్నారు. ఇటీవలే ఆయన ఆధ్వర్యంలో మొదలైన మానవ వికాస వేదిక కరపత్రాన్ని పట్టుకుని తిరుపతి నగరంలో తిరుగుతూ ఆయన బుధవారం సందడి చేశారు. ఈ సందర్భంగా తెలుగు మాధ్యమంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, 'దీన్ని ఇంకో కోణంలోకి తీసుకెళుతున్నారు! ఇప్పుడు సమాధానం చెప్పను' అంటూ అక్కడ నుంచి వెళ్లిపోయారు.

150 వైసీపీ పశువులు రాజధానిని నాశనం చేస్తున్నాయి

- వైసీపీలో బూతుల కోసం ఓ మంత్రిత్వ శాఖ: బొండా

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): "మంత్రి కొడాలి నాని దున్నపోతులు, పందులు అమరావతికి వస్తున్నాయంటూ అవాకులు చెవాకులు పేలుతున్నాడు. 150 వైసీపీ పశువులు రాజధానిని నాశనం చేస్తున్నాయని నేను అంటున్నా. ఒకవర్గం పేరు చెప్పి రాజధానిని అడ్డుకోవద్దు. రాజధానిని మంత్రులు శ్మశానంగా అభివర్ణించడం సిగ్గుచేటు" అంటూ మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా మండిపడ్డారు. ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన రాష్ట్ర రాజధానిని వైసీపీ నేతలు శ్మశానంతో పోల్చడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉండగా రాజధానిలో రూ.2 లక్షల కోట్ల అవినీతి జరిగిందంటూ ఊదరగొట్టిన వైసీపీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటుతున్నా రూ.లక్ష అవినీతిని బయట పెట్టలేకపోయిందంటూ ఎద్దేవా చేశారు. జాతీయ మీడియాతో కలిసి 28న రాజధానికి వస్తున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు అనగానే రాజధానిలో కట్టడాలు పూర్తిచేయాలని సీఎం ఆదేశించారన్నారు. అమరావతిని అభివృద్ధి చేసేవరకు ప్రజా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ప్రజల మనోభావాలను దెబ్బ తీసేవిధంగా మంత్రి కొడాలి నాని మాట్లాడటం, తమ్మినేని సీతారాం తాను స్పీకర్ అని మరచిపోయి అసభ్యకరంగా మాట్లాడటం దారుణమన్నారు. వైసీపీలో బూతుల కోసం ఒక మంత్రిత్వ శాఖను పెట్టేలా ఉన్నారని ఎగతాళి చేశారు.

మరి కాటికాపరి ఎవరు: కూన

"సీఎం జగన్ ఇచ్చే ట్విస్టులకు మతిపోయి మంత్రి బొత్స పిచ్చివాడిలా మాట్లాడుతున్నారు. రాజధాని అమరావతి శ్మశానమైతే కాటికాపరి ఎవరో చెప్పాలి. రాజధాని కోసం మాట్లాడే అర్హత, నైతికత.. జగన్‌కు, వాళ్ల మంత్రి వర్గానికి లేదు" అని మాజీవిప్, టీడీపీ నేత కూన రవికుమార్ శ్రీకాకుళంలో విమర్శించారు. స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతుల మనోభావాలను కించపరిచే విధంగా బొత్స వ్యాఖ్యానించడం తగదన్నారు. అమరావతి అందరికీ తెలుసునని, హైమావతి ఎవరో మంత్రి బొత్స, ఆయన సతీమణి ఝాన్సీయే చెప్పాలన్నారు. బొత్స బ్యాంకాక్‌లో అర్ధరాత్రి తిరిగినప్పుడు పక్కనున్న అమ్మాయే హైమావతి అయి ఉంటుందని కూన అన్నారు. కాగా, రాజధానిలో చంద్రబాబు పర్యటన అనగానే వైసీపీలో వణుకు మొదలైందని టీడీపీ మహిళా నేత పంచుమర్తి అనురాధ ఎద్దేవా చేశారు. రాజధాని పనులు జరిగితే ఎక్కడ చంద్రబాబుకు పేరు వస్తుందో అన్న దుగ్ధతో, కక్షపూరితంగా సీఎం జగన్ రాజధాని నిర్మాణాన్ని అంతం చేసే కుట్ర పన్నారని ఆరోపించారు. టీడీపీ హయాంలో చేపట్టిన వేల కోట్ల పనులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి, ఆంధ్రుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసిందని మండిపడ్డారు. అమరావతిలో ఎలాంటి నిర్మాణాలు జరగకపోతే, చంద్రబాబు రాజధాని పర్యటనపై అధికార పార్టీ నేతలకు ఎందుకంత భయం? అని ప్రశ్నించారు. సీఎం జగన్ విధ్వంసక విధానాలతో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాజధాని నిర్మాణం ఆగిపోవడంతో తల లేని మొండెంలా రాష్ట్ర పరిస్థితి తయారైందన్నారు. జే ట్యాక్స్ వసూలుతో పారిశ్రామిక వేత్తలను జగన్ భయాందోళనకు గురి చేస్తున్నారని పంచుమర్తి విమర్శించారు.

ఒంగోలులో టీడీపీకి ఇచ్చిన భూమి వెనక్కు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఒంగోలులో తెలుగుదేశం పార్టీ కార్యాలయం కోసం కేటాయించిన భూమిని రద్దుచేస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 13 నెలల క్రితం... గత ఏడాది అక్టోబరు 11న టీడీపీకి ఒంగోలులో 1.96 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. టీడీపీకి కేటాయించిన భూమి నాగార్జున సాగ ర్ ప్రాజెక్టు పరిధిలోనిదని, ఇప్పుడు ఆ భూమి అవసరం తమకు ఉన్నందున తిరిగి వెనక్కు ఇవ్వాలని జలవనరుల శాఖ మంత్రి నుంచి ఉప ముఖ్యమంత్రి సుభాష్ చంద్రబోస్‌కు లేఖ వచ్చినట్లుగా రెవెన్యూ వర్గాలు చెపుతున్నాయి. జలవనరుల శాఖ మంత్రి కోరిక మేరకు, టీడీపీ ఆఫీసు కోసం ఇచ్చిన భూమి కేటాయింపు ఉత్తర్వులను రద్దుచేస్తున్నట్లు రెవెన్యూ శాఖ కార్యదర్శి ఉషారాణి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే భూ కేటాయింపు మంత్రివర్గం ఆమోదంతో తీసుకొన్న నిర్ణయం కావడంతో మళ్లీ మంత్రివర్గం తీసుకునే నిర్ణయానికి (రాటిఫికేషన్) కట్టుబడే ఇది అమలు కానుందని రెవెన్యూ శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

'రాజధాని భూమి'పై మళ్లీ కదలిక

- సీఎం ప్రకటనతో రంగంలోకి సీఆర్డీయే
- పూలింగ్‌కు ఇవ్వని భూములపై దృష్టి

(ఆంధ్రజ్యోతి, అమరావతి)

రాజధాని నిర్మాణం కోసం గత టీడీపీ ప్రభుత్వం ఆ ప్రాంతంలోని 29గ్రామాల్లో చేపట్టిన భూసమీకరణ పథకం (ల్యాండ్‌పూలింగ్ స్కీం) కింద నేటికీ తమ భూములను ఇవ్వని రైతుల నుంచి వాటిని తీసుకునేందుకు ఏపీసీఆర్డీయే సమాయత్తమవుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అమరావతిలోని ప్రభుత్వ గృహ సముదాయ టవర్లతోపాటు అధిక శాతం పనులైన రహదారులు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆమోదం తెలిపిన విషయం విదితమే. దీంతో ఆయా పనులను చేపట్టేందుకు సిద్ధమవుతున్న సీఆర్డీయే.. వాటిల్లో కొన్నింటికి కొందరు రైతులు తమ భూములను పూలింగ్‌కు ఇవ్వకపోవడం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను సాధ్యమైనంత త్వరగా తొలగిస్తేనే ముందుకు వెళ్లగలనని భావిస్తోంది. పూలింగ్‌కు ముందుకు రాని రైతుల నుంచి భూములను సమీకరిచే ప్రక్రియను చురుగ్గా సాగించేందుకు సన్నాహాలు చేస్తోంది. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిపై దాని అభిప్రాయం స్పష్టంగా తెలియరాకపోవడంతో, ఆరు నెలలుగా సీఆర్డీయే ఈ కార్యక్రమాన్ని చేపట్టలేదు. పనులు చేపట్టకుండానే భూములను తీసుకుంటే విమర్శలు వస్తాయన్న అభిప్రాయంతో ఇప్పటివరకూ మిన్నకుంది. తాజాగా అమరావతిపై సీఎం విస్పష్ట ప్రకటనతో రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతోంది.

సమీకరిస్తేనే ముందుకెళ్లగలం..

ఉండవల్లి, పెనుమాకల్లో ఇప్పటికీ వందలాది ఎకరాలు పూలింగ్ కింద ఇచ్చేందుకు అక్కడి రైతులు నిరాకరిస్తున్నారు. రాజధానికి వెన్నుముకగా భావించే సీడ్‌యాక్సెస్ రహదారితోపాటు కొన్ని రోడ్లు, ఇతర ప్రాజెక్టులను చేపట్టడం దీనివల్ల ఇబ్బంది అవుతోంది. అలాగే, రాజధానిలోని పలు గ్రామాల్లో కూడా కొందరు రైతులు పూలింగ్‌ను వ్యతిరేకిస్తుండడం ఆయా ప్రదేశాల్లో కొన్ని ప్రధాన రహదారులు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ఆటంకంగా పరిణమించింది. పూలింగ్‌లోకి రాని భూములను సమీకరించకుండా సీఎం జగన్ ఆదేశించినట్లుగా అమరావతిలో మౌలిక వసతుల కల్పన, ఎల్పీఎస్ జోన్ల దశలవారీ అభివృద్ధి సాధ్యంకాదని సీఆర్డీయే అధికారుల అభిప్రాయపడుతున్నారు. సాధ్యమైనంత వరకూ పూలింగ్‌ను వ్యతిరేకిస్తున్న రైతులకు నచ్చజెప్పి, వారి భూములను సమీకరించాలని సీఆర్డీయే భావిస్తోంది. రాజధాని గ్రామాల్లో క్రియాశీలకంగా ఉన్న రైతు నేతల ద్వారాకూడా ఈ ప్రయత్నాలను సాగించాలని నిర్ణయించింది. ఈ ప్రయత్నాలు కూడా ఫలించకపోతే భూసేకరణ చట్టం ప్రయోగించడం తప్పనిసరవుతుందని సీఆర్డీయే వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కాగా, కృష్ణానది కరకట్టపై ప్రకాశం బ్యారేజీకి ఎగువన, రాజధాని పరిధిలో ఉన్న కట్టడాలకు తుది నోటీసులను కొద్ది రోజుల్లో సీఆర్డీయే అందజేయనుంది. కరకట్టకు దిగువన, నదికి చేరువలో ఉన్న సుమారు 20 శాశ్వత నిర్మాణాలు నియమ నిబంధనలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయని గుర్తించి, ఇప్పటికే వాటి యజమానులకు నోటీసులిచ్చిన ఈ సంస్థ... వారిలో అత్యధికులు ఇచ్చిన వివరణలు సంతృప్తికరంగా లేనందున తుది నోటీసులను సిద్ధం చేస్తోంది. డిసెంబరు తొలివారంలో నోటీసులను సంబంధిత యజమానులకు అందజేయనుంది. అనంతరం వారం వ్యవధిలో ఆయా నిర్మాణాల కూల్చివేత చేపట్టనుందని సమాచారం. ఇదిలాఉండగా, సీఆర్డీయే కమిషనర్ పి.లక్ష్మీ నరసింహాన్ని రాజధాని రైతులు కలుసుకొన్నారు. రాజధానిపై సీఎం సానుకూల ప్రకటన చేసేలా కృషి చేశారంటూ ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. అమరావతిలో ఇప్పటికే చేపట్టిన నిర్మాణాలను అర్థంతరంగా వదిలేసే బదులు, తుదిదశల్లో ఉన్న వాటిని పూర్తి చేయడం సబబంటూ కమిషనర్ సమర్పించిన నివే

9 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- గవర్నర్ నోటిఫికేషన్ విడుదల

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ శీతాకాల సమావేశాలు డిసెంబరు 9వ తేదీన ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు శాసనసభ, 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు అసెంబ్లీలోని వైసీపీ శాసనసభాపక్ష కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, విప్‌లు మల్లాది విష్ణు, జోగి రమేశ్, సామినేని ఉదయభాను, శ్రీదేవి, ముత్యాల నాయుడు, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కొడుమూరు శ్రీనివాస్ తదితరులు సమావేశమయ్యారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలపై ప్రత్యేకంగా చర్చ జరిపేందుకు వీలుగా ఒక్కో పథకానికి ఎమ్మెల్యేలను బృందాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

వరల్డ్‌బ్యాంకు సాయంతో వాటర్‌షెడ్‌లు: సీఎస్

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వర్షాభావ జిల్లాలైన కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో ప్రపంచబ్యాంకు ఆర్థిక సహాయంతో వాటర్‌షెడ్ ప్రాజెక్టులను చేపట్టనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని తెలిపారు. ఇందుకు ప్రపంచబ్యాంకు 270 కోట్లను సాయంగా అందించనుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.125 కోట్లు సమకూర్చనుందని సీఎస్ చెప్పారు. ప్రపంచబ్యాంకు ప్రతినిధుల బృందం బుధవారం సచివాలయంలో సీఎస్‌తో భేటీ అయ్యింది.

దివ్యాంగుడికి రూ.5 లక్షల సాయం

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కాళ్లు, చేతులు లేని దివ్యాంగుడికి సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి రూ.5 లక్షలు సాయం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం గోగుతిప్ప గ్రామానికి చెందిన సాయిబాబుకు సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు బుధవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి చెప్పారు.

'వాహనమిత్ర' లబ్ధిదారులకు నగదు: పేర్ని

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద రెండోవిడత లబ్ధిదారులను ఖరారు చేసినట్లు రవాణా శాఖ మంత్రి పేర్ని వెంకట్రామయ్య అన్నారు. రెండోవిడతలో 65,054 దరఖాస్తులు రాగా, 62,637మందిని అర్హులుగా గుర్తించామన్నారు. ఇప్పటిదాకా 2,36,340మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.10వేలు జమ చేశామన్నారు.

చంద్రబాబుకు రాజధానిలో తిరిగే హక్కు లేదు: పేర్ని

రాజధాని రైతుల కౌలు ఎగ్గొట్టి గద్దె దిగిపోయిన చంద్రబాబుకు రాజధానిలో పర్యటించే నైతిక హక్కు లేదని మంత్రి పేర్ని నాని విమర్శించారు. రాజధానిలో రోడ్లు కూడా సరిగా లేవన్నారు. రైతుల ప్లాట్లు అభివృద్ధి చేయకుండా చంద్రబాబు రాజధానిలో తిరగడానికి ఎలా వస్తారని ప్రశ్నించారు.

సమాచార కమిషనర్ నియామకానికి ఏర్పాట్లు

రాష్ట్రంలో సమాచార హక్కు ప్రధాన కమిషనర్ నియామకానికి రంగం సిద్ధమవుతోంది. ప్రధాన కమిషనర్‌తోపాటు ఇతర కమిషనర్లను అభ్యర్థులను సిఫారసు చేసే కమిటీలో సభ్యుడిగా మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌ను నియమిస్తూ సాధారణ పరిపాలనశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉపాధి నిధులతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 90 శాతం ఉపాధి నిధులు, 10 శాతం ఇతర పథకాల నిధుల ద్వారా ఈ పనులు చేపట్టేందుకు మార్గదర్శకాలు విడుదల చేసింది. గ్రామాల్లోని జనాభాతో సంబంధం లేకుండా 90 శాతం ఉపాధి నిధులు, 10 శాతం ఇతర నిధులతో పనులు చేసేందుకు అవకాశమిస్తూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

ఏసీబీ కేసులు సీబీఐకి బదిలీ

- నిషేధ కాలంలో ఆరుగురిపై అవినీతి కేసులు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీలో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) నమోదు చేసిన కేసులను రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి బదిలీ చేసింది. ఢిల్లీ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ కింద ఉన్న సీబీఐ రాష్ట్రంలో అడుగు పెట్టేందుకు వీల్లేదంటూ నిర్ణయించిన గత టీడీపీ ప్రభుత్వం... రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై అవినీతికి సంబంధించిన ఫిర్యాదులను ఏసీబీ దర్యాప్తు చేస్తుందంటూ నిబంధనల్లో సవరణలు చేసింది. సీబీఐని అడ్డుకున్న కాలంలో ఏసీబీ నమోదు చేసిన ఆరు కేసులను తాజాగా సీబీఐకి బదిలీ చేసింది.

అమరావతి అభివృద్ధికి 496కోట్లు ఇచ్చాం: కేంద్రం

న్యూఢిల్లీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌సిటీస్ మిషన్ ద్వారా ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి ఇప్పటి వరకు రూ.496కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర పట్టణ వ్యవహారాలశాఖ సహాయ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి వెల్లడించారు. బుధవారం రాజ్యసభలో వైసీపీపీ నేత విజయసాయిరెడ్డి అడిగిన ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా జవాబిచ్చారు. కాగా, గత యూపీఏ ప్రభుత్వం అనుసరించిన లోపభూయిష్టమైన విధానాల కారణంగానే నేడు దేశంలో ఆర్థిక మందగమనం ఏర్పడిందని ఎంపీ విజయసాయిరెడ్డి విమర్శించారు. బుధవారం రాజ్యసభలో ప్రత్యేక అంశంకింద జరిగిన చర్చలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

రెవెన్యూ లోటు నిధులివ్వండి: శ్రీకృష్ణదేవరాయలు

రాష్ట్రానికి రెవెన్యూ లోటు నిధులు రూ.18,969కోట్లు విడుదల చేయాలని వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. బుధవారం ఆయన లోక్‌సభ జీరో అవర్‌లో మాట్లాడుతూ ఏపీ 22,984కోట్ల రెవెన్యూ లోటును ఎదుర్కొంటోందని కాగ్ తేల్చగా, ఇప్పటివరకు కేంద్రం రూ.3,979 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. మిగిలిన నిధులు కూడా వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఏపీకి 1,850కోట్లు విడుదల

- నాబార్డుకు కేంద్రం సూచన

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పోలవరం సాగునీటి ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం వ్యయం చేసిన మొత్తంలో రూ.1,850కోట్లు నాబార్డు నుంచి విడుదలయ్యేందుకు మార్గం సుగమమైంది. ఈ మొత్తాన్ని రాష్ట్రానికి ఇచ్చేందుకు కేంద్ర ఆర్థికశాఖ బుధవారం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నిధుల కోసం రాష్ట్ర జల వనరుల శాఖ 25రోజులుగా ఎదురుచూస్తోంది.

మంగళగిరికి ఆరోగ్యశాఖ కార్యాలయాలు!

ఆరోగ్యశాఖలోని కీలక విభాగాలైన కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్, ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్, ఏపీ సాక్స్ కార్యాలయాలను మంగళగిరికి తరలించేందుకు ఆ శాఖ సిద్ధమైంది. గొల్లపూడిలో చదరపు అడుగుకు రూ.16 చెల్లిస్తుండగా, మంగళగిరిలో అత్యధికంగా రూ.40 చెల్లించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అదే రేటుకు మంగళగిరిలో అద్దెకు తీసుకుని, రీమోడలింగ్ చేయిస్తున్నారు. ప్రస్తుతం గొల్లపూడిలో ఉన్న కార్యాలయానికి నవంబరు నెలాఖరుతో అగ్రిమెంట్ పూర్తయ్యింది. కానీ, కొత్త భవనాలు సిద్ధం కాకపోవడంతో డిసెంబరు వరకూ గడువు పొడించారు. కొత్త భవనాలు జనవరి మూడో వారానికి సిద్ధమవుతాయి. ఆ సమయానికి ఆఫీస్‌లు ఖాళీ చేస్తామంటూ భవన యాజమానులకు అధికారులు బుధవారం నోటీసులు ఇచ్చారు.

వీవోఏల ఉద్యోగాల గడువు మూడేళ్లే

గ్రామాల్లో డ్వాక్రా సంఘాల బలోపేతానికి నియమించిన గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు(వీవోఏ)ల ఉద్యోగ కాలం మూడేళ్లకు పరిమితం చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆదేశాలిచ్చింది.

ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు పొడిగింపు

ప్రభుత్వ కార్యాలయాల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సిబ్బంది కాంట్రాక్టు ఒప్పందాన్ని డిసెంబరు 31 వరకు కొనసాగించనున్నారు. ఈ మేరకు కాంట్రాక్టు పొడిగిస్తూ ఆర్థికశాఖ బుధవారం ఆదేశాలిచ్చింది.

రిటైర్డ్ ఐఏఎస్‌కు పీహెచ్‌డీ ప్రదానం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సెక్రటరీగా పనిచేసి రిటైరైన బి.రామాంజనేయులుకు ఎస్కేయూ వర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. కర్నూలు జిల్లా షెడ్యూల్డ్ కులాల సామాజిక, ఆర్థిక స్థితిగతులు, ఒక అనుభావిక అధ్యయనం అనే అంశంపై ఆయనకు పీహెచ్‌డీ లభించింది.

నైపుణ్యాభివృద్ధిలో ఏపీ 'బంగారం'

న్యూఢిల్లీ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. బుధవారం ఢిల్లీలో 'అసోచామ్' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయమంత్రి రాజ్‌కుమార్ సింగ్ చేతుల మీదుగా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ తరపున టెక్నికల్ సీజీఎం రవికుమార్ గుజ్జుల, సీనియర్ మేనేజర్ ధేనుకా నాయక్ ఈ అవార్డును అందుకున్నారు. కాగా, పబ్లిక్ అండర్ టేకింగ్ సంస్థల విభాగంలో భారీస్థాయిలో నైపుణ్య శిక్షణ ఇస్తున్నందుకు విశాఖపట్నంలోని హెచ్‌పీసీఎల్ సంస్థ ప్రథమ స్థానం కైవసం చేసుకుంది.

'స్థాని'కానికి సిద్ధం

- జనవరి 10న నోటిఫికేషన్
- 'అమ్మఒడి' పంచిన వెంటనే ఎన్నికలకు సన్నద్ధం కావాలి
- కేబినెట్‌లో మంత్రులతో సీఎం
- రాత్రి బస ఆదేశాలు పాటించని మంత్రులపై జగన్ అసంతృప్తి

రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్, చిత్రంలో మంత్రులు

అమరావతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): "2020 జనవరి 9న అమ్మఒడి కార్యక్రమాన్ని చేపట్టడంతో నవరత్నాల్లో ప్రధాన ఘట్టానికి ముగింపు పలికినట్లు అవుతుంది. ఆ వెంటనే.. 10 లేక 11వ తేదీన స్థానిక సంస్థల ఎన్నికలకు వెళుతూ నోటిఫికేషన్ ఇద్దాం" అని మంత్రులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు కేబినెట్ సమావేశంలో స్థానిక ఎన్నికలు సహా పలు అంశాలు చర్చకు వచ్చాయి. స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికలకు సంబంధించి ముందుగా, పార్టీ గుర్తులపై జరిగే ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఇందులోభాగంగా జనవరి చివర్లో లేక ఫిబ్రవరి మొదటి వారంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, ఆవెంటనే.. మునిసిపల్ ఎన్నికలు నిర్వహించాలని ఆయన నిర్ణయించారు. అదే విధంగా మార్చి నెలాఖరులోగా గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలనే అభిప్రాయం కేబినెట్‌లో వ్యక్తమయింది. వారంలో రెండు రాత్రులు తమకు కేటాయించిన జిల్లాల్లో మంత్రులు బస చేయాలన్న తన ఆదేశాలు కొందరు పాటించకపోవడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు.

కన్నబాబు,కొడాలి, వనితగానీ, జగనే గానీ...

రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వదలచిన బియ్యం, ఆరోగ్యశ్రీ, పింఛను, స్కాలర్‌షిప్ కార్డుల అంశంపై చర్చ జరుగుతున్నప్పుడు .. మంత్రి వనిత జోక్యం చేసుకున్నారు. "'గ్రామాల్లో నెల ఆదాయం రూ.10,000లోపు ఉంటేనే సంక్షేమ కార్డు అందించాలని నిర్ణయించారు. అయితే, అక్కడ పనిచేసే అంగన్‌వాడీ వర్కర్లకు నెలకు రూ.11,000 జీతం వస్తోంది. వారిని ఈ నిబంధన నుంచి మినహాయించి, బియ్యం కార్డులు ఇవ్వాలి" అని ప్రతిపాదించారు. అందుకు సీఎం నిరాకరించారు. "బియ్యం, పింఛను, స్కాలర్‌షిప్, ఆరోగ్యశ్రీ కార్డుల విషయంలో ఆదాయ పరిమితి విధించాం. కన్నబాబు గానీ, వనిత గానీ, కొడాలి నాని గానీ .. జగన్ గానీ .. ఎవరైనా ఆదాయాన్ని బట్టే కార్డులు అందుకుంటారు. ఇప్పటికే .. తెల్ల రేషన్‌కార్డులు పెరిగిపోయాయి. వాటిని నియంత్రించాలంటే .. ఎక్కడో ఒకదగ్గర ఫుల్ స్టాప్ పెట్టాల్సి ఉంటుంది" అని సీఎం జగన్ స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశ పెడుతున్నామని, ఈ పాఠశాలల్లో తెలుగు భాష తప్పనిసరిగా ఉంటుందని, ప్రైవేటు ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లోనూ తెలుగును తప్పనిసరి చేయాలని పాఠశాల విద్యా ముఖ్యకార్యదర్శి బుడితి రాజశేఖర్ ప్రతిపాదించగా, కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. కాగా, ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ మేరకే కాపు, బలిజ, ఒంటరి, తెలగ ఉపకులాల మహిళలకు ఏటా రూ.15000 బ్యాంకుల్లో జమ చేస్తామని సీఎం జగన్ అన్నారు. వచ్చే ఏడాది నుంచి వెనుకబడిన వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలకు ఏటా రూ.18,500 చొప్పున బ్యాంకుల్లో జమచేద్దామని చెప్పారు. ప్రజా ప్రతినిధులపై అవినీతి ముద్ర లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత జిల్లా ఇన్‌చార్జి మంత్రులదేనని, మంత్రుల మీద కూడా అవినీతి ముద్ర పడితే సహించేది లేదని ముఖ్యమంత్రి జగన్ హెచ్చరించారు. వచ్చే నెల 20వ తేదీలోగా ఆలయ, మార్కెట్ కమిటీలను వేయాలని ఇన్‌చార్జి మంత్రులను ఆయన ఆదేశించారు. వాస్తవానికి ఈ నెలాఖరులోగా ఈ కమిటీలు వేయాలని చెప్పినా .. ఇప్పటికీ ఆ ప్రక్రియను పూర్తి చేయకపోవడం ఏమిటంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆ నియామకాల జోలికెళ్లొద్దు

విద్యుత్తు సబ్‌స్టేషన్లలో షిఫ్ట్ ఆపరేటర్ల నియామకాల్లో మంత్రులూ ప్రజాప్రతినిధులెవరూ జోక్యం చేసుకోవద్దని ముఖ్యమంత్రి జగన్ స్పష్టం చేశారు. ఈ నియామకం విషయంలో తాము చేసే సిఫారసులను ఇంధన శాఖ గౌరవించడం లేదని కొందరు మంత్రులు సీఎం దృష్టికి తెచ్చారు. దీనిపై ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి శ్రీకాంత్ స్పందిస్తూ.. ప్రస్తుత ఆర్థిక కష్టాల నేపథ్యంలో సబ్‌స్టేషన్లలో షిఫ్ట్ ఆపరేటర్లను నియమించడం కుదరదన్నారు. దీనిపై మంత్రులు ఏదో చెప్పబోగా, జగన్ వారించారు. ఇంధన శాఖపై ఒత్తిడి తేవొద్దని మంత్రులకు స్పష్టంచేశారు. కాగా, అధికారంలోకి వచ్చాక పార్టీ సమావేశాలను తగ్గించేశామని, జిల్లాల్లో సమావేశాలు నిర్వహిద్దామని మంత్రులు అనగా, సీఎం సానుకూలంగా స్పందించారు. ఆ బాధ్యతను జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు ఆయన అప్పగించారు.

మీరంటే శ్రీరామచంద్రుడు

జగన్‌ను ఉద్దేశించి అవంతి వ్యాఖ్య

మద్యం విధానంపై కేబినెట్‌లో చర్చ జరిగింది. త్రీస్టార్ హోటల్‌లో మద్యం విక్రయాల లైసెన్సు ఫీజును కోటిన్నర రూపాయలకు పెంచడాన్ని మంత్రి అవంతి శ్రీనివాసరావు ప్రస్తావించారు. దీనివల్ల పర్యాటక రంగం వెనుకబడిపోతుందన్నారు. ఆ సమయంలో ముఖ్యమంత్రి స్పందిస్తూ, " శ్రీనివాస్ ..నువ్వు మీ కుటుంబసభ్యులతో విదేశాలకు వెళితే, సమీపంలోని ప్రదేశాలన్నీ చూసొస్తావా లేక హోటల్ గదిలోనే ఉంటావా?" అని ప్రశ్నించారు. తాను సమీపంలోని ప్రదేశాలు చూస్తానని శ్రీనివాస్ అన్నారు. అంటే .. టూరిజం పెరిగినట్లే కదా అని జగన్ అన్నారు. " మీరంటే శ్రీరామచంద్రమూర్తి. ఎలాంటి అలవాట్లూ లేవు. కానీ ఇప్పుడు త్రీస్టార్ హోటళ్లలో లైసెన్సులు రద్దుచేస్తే వారేమయిపోతారో" అని మంత్రి అవంతి వ్యాఖ్యానించారు. మద్యం బాటిళ్ల స్టాకు విషయంలో తేడా వస్తే .. బార్ లైసెన్సుకు రెట్టింపు జరిమానా వసూలు చేయడం బాగుంటుందని మంత్రి నారాయణస్వామి సూచించగా, సీఎం జగన్ అంగీకరించారు.

ఇంటికి సెంటు భూమి చాలు!

- డబ్బులుంటే పైఅంతస్తు వేసుకుంటారు
- గృహ నిర్మాణ శాఖ మంత్రి శ్రీరంగనాథరాజు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణానికి సెంటు భూమి సరిపోతుందని గృహ నిర్మాణ శాఖ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు చెప్పారు. సెంటు భూమిలో ఇల్లు కట్టుకోవచ్చని, డబ్బులుంటే పైన ఇంకో అంతస్తు కూడా వేసుకోవచ్చని మంత్రి చెప్పారు. టిడ్కో అపార్ట్‌మెంట్ల రూపంలో కట్టిస్తున్న 338 అడుగుల ఇంటి కంటే పెద్ద ఇల్లే సెంటు భూమిలో వస్తుందన్నారు. .

సీపీఎస్‌పై మరో కమిటీ

- తీవ్ర ఆందోళనలో ఉద్యోగ సంఘాలు
- ఇంకెంత కాలం సాగదీస్తారని నిలదీత

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ విధానం రద్దు చేయడంపై సూచనలు, సలహాలు ఇస్తూ మాజీ సీఎస్ ఎస్వీ టక్కర్ ఇచ్చిన నివేదికను పరిశీలించేందుకు మరో కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఉద్యోగ సంఘాల అభ్యర్థన మేరకు గత చంద్రబాబు ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలని టక్కర్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసింది. టక్కర్ గత ఏడాది ఫిబవరిలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఆ నివేదికను పరిశీలించాలని మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించారు. ఇప్పుడు తాజాగా మంత్రులకు సలహాలిచ్చేందుకు ఉన్నతాధికారులతో మరో కమిటీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి చైర్‌పర్సన్‌గా, ఆర్థికశాఖ కార్యదర్శి కన్వీనర్‌గా ప్రణాళిక, వైద్యశాఖ సెక్రటరీలు, పాఠశాల విద్య, పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శులు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేస్తూ ఆదేశాలిచ్చారు. వచ్చే ఏడాది జూన్‌లోగా కమిటీ నివేదిక ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఇంకెన్ని కమిటీలు వేస్తారు?

సీపీఎస్‌పై ప్రభుత్వం తాజాగా కమిటీని ఏర్పాటు చేయడంపై ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. అధికారంలోకి వచ్చిన నెలలోపు సీపీఎస్‌ను రద్దు చేస్తామన్న సీఎం జగన్.. కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టక్కర్ నివేదికపై మంత్రి వర్గ ఉపసంఘం వేసిన ప్రభుత్వం ఇప్పుడు మరో కమిటీని వేయడం కాలయాపనలో భాగమేనని విమర్శించారు. దీనికి జూన్ 2020 దాకా గడువు విధించడం సబబు కాదని అన్నారు. ఈ మేరకు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం, కె.ఎస్.లక్ష్మణరావు, వై.శ్రీనివాసులురెడ్డి, ఐ.వెంకటేశ్వరరావులు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వ చర్యను తప్పుబట్టారు. నిర్దిష్ట గడువులోగా సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విషయంలో సీఎం జగన్ తన హామీని తక్షణమే అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి.బాబురెడ్డి, ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రవి ప్రసాద్ డిమాండ్ చేశారు. కమిటీ గడువును తగ్గించాలని, డిసెంబరులో నిర్ణయం తీసుకోవాలని ఏపీ సెక్రటేరియట్ సీపీఎస్ ఉద్యోగుల సంఘం సలహాదారు కె.రాజేశ్ కోరారు.

కాబోయే ముఖ్యమంత్రికి..

కరణేమ మంత్రి

ఉద్ధవ్ రాజకీయ విజయాల వెనుక ఆయన భార్య రశ్మి

ఇదీ నేపథ్యం.. ముంబై సమీపంలోని డోంబివిలిలో పుట్టి పెరిగిన రశ్మి పటాంకర్.. ముంబైలోని జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్‌లో చదువుతున్నప్పుడు తొలిసారి ఉద్ధవ్‌ను కలిశారు. ఇద్దరిదీ ఒకే తరగతి గది. క్రమంగా ప్రేమలో పడ్డారు. పెళ్లి చేసుకున్నారు. అప్పటికి ఉద్ధవ్‌కు రాజకీయాలపై ఆసక్తి లేదు. ఆయనకు వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ (వన్యప్రాణులను ఫొటోలు తీయడం) అంటే ఆసక్తి. జీవనోపాధికి కూడా దాన్నే మార్గంగా మలుచుకోవాలనుకున్నారాయన. ఈ క్రమంలోనే.. పెళ్లయిన తొలి రెండేళ్లూ వారు తమ సొంత కాళ్లపై నిలబడి జీవనం సాగించారు. ఆ తర్వాత బాల్‌ఠాక్రే సూచన మేరకు ఠాక్రేల నివాసమైన మాతోశ్రీకి చేరారు. అప్పుడు కూడా.. 'చౌరంగ్' అనే వాణిజ్యప్రకటనల సంస్థలో ఉద్ధవ్ పనిచేసేవారు. భార్య రశ్మి ప్రోత్సాహంతో.. 40 ఏళ్ల వయసులో ఉద్ధవ్ రాజకీయాల్లోకి ప్రవేశించారు. కానీ, అప్పటికే శివసేనపై రాజ్‌ఠాక్రే పట్టు ఎక్కువగా ఉండేది. బాలాసాహెబ్ తర్వాత పార్టీ పగ్గాలు చేపట్టేది ఆయనేనని అంతా అనుకునేవారు. కానీ, బాల్‌ఠాక్రే తన కుమారుడికి పగ్గాలను అప్పగించేలా చేయడంలో రశ్మి కీలకపాత్ర పోషించారు. ఫలితంగా రాజ్‌ఠాక్రే మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన పేరుతో సొంత పార్టీ పెట్టుకున్నారు. మరోవైపు.. తన కుమారుడు ఆదిత్యఠాక్రే కూడా రాజకీయాల్లోకి వచ్చేలా రశ్మి ప్రోత్సహించారు. తల్లి ప్రోత్సాహంతో ఆదిత్య 19 ఏళ్ల వయసులోనే శివసేన యువవిభాగం అధ్యక్షుడిగా రాజకీయ రంగప్రవేశం చేశారు. అంతేకాదు.. ఠాక్రేల కుటుంబం నుంచి తొలి సారి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు.

-సెంట్రల్ డెస్క్

ప్రతి పురుషుడి విజయం వెనుకా ఒక స్త్రీ ఉంటుందంటారు. మరాఠా పెద్దపులి బాల్ ఠాక్రే కుమారుడు ఉద్ధవ్ ఠాక్రే విజయం వెనుక కూడా అలా ఒక స్త్రీ ఉంది. ఆమె పేరు.. రశ్మి! ఉద్ధవ్ ఠాక్రే భార్య. చదువుకున్నప్పటి నెచ్చెలి. ఉద్ధవ్ జీవితభాగస్వామిగా ఆయన జీవితంలోకి అడుగుపెట్టినప్పటి నుంచి.. ఆయన ప్రతి అడుగు వెనుకా ఆమె ఆలోచనల ముద్రే!! బాలాసాహెబ్ ఉన్నప్పుడు.. ఆయన చనిపోయిన తర్వాత.. చాలాకాలంపాటు శివసేన పరోక్ష రాజకీయాలకే పరిమితమైంది తప్ప పదవుల కోసం ఆశపడలేదు. అయితే, మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో.. రశ్మి తన భర్తను, కుమారుణ్ని ప్రత్యక్ష, క్రియాశీల రాజకీయాలవైపు ప్రోత్సహించారు! ఇన్నాళ్లూ లేనిది.. తొలిసారి ఠాక్రేల కుటుంబం నుంచి ఒకరు (ఉద్ధవ్ కుమారుడు ఆదిత్య ఠాక్రే) ఎన్నికల్లో పోటీ చేసి గెలవడం.. ఇప్పుడు ఉద్ధవ్ ఏకంగా ముఖ్యమంత్రి కావడం.. వీటన్నింటి వెనుకా మాస్టర్ మైండ్ ఆమే అంటే అతిశయోక్తి కాదు. తన కుమారుడి ఎన్నికల ప్రచారం ఎలా సాగాలో కూడా ఆమే ప్రణాళికలు రచించి అమలు చేశారు. ఠాక్రేల 'ప్రత్యక్ష' రాజకీయంలో రశ్మి ముద్ర ఇవాళ చాలామందికి కొత్తగా కనిపించవచ్చుగానీ.. చాలాకాలంగా ఆమె పార్టీలో క్రియాశీలంగా పనిచేస్తున్నారు. పార్టీ శ్రేణులతో నిరంతరం చర్చలు జరుపుతూ.. పార్టీ మహిళా విభాగాన్ని పటిష్ఠపరిచారు.

వ్యాపారవేత్త కూడా..

రాజకీయాలపైనే కాదు.. వ్యాపారాలన్నా రశ్మిఠాక్రేకు ఆసక్తి ఎక్కువ. సామ్‌వేద్ రియల్ ఎస్టేట్, సహయోగ్ డీలర్స్ అనే రెండు సంస్థలకు ఆమె డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎలోరియా సోలార్, హైబిస్కస్ ఫుడ్, కోమో స్టాక్స్ అండ్ ప్రాపర్టీస్ అనే మూడు లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్ వెంచర్లలో భాగస్వామిగా రశ్మి ఉన్నారు.

మహారాష్ట్ర గవర్నర్‌ను కలిసిన ఉద్ధవ్ ఠాక్రే దంపతులు

నేడే కూటమి 'కొలువు'

ముంబై, నవంబరు 27: రెండు దశాబ్దాల తర్వాత... మరాఠా పీఠాన్ని మరో శివసైనికుడు అధిష్ఠించనున్నారు. శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్‌లతో కూడిన 'మహా వికాస్ అఘాడీ' కూటమి నేత ఉద్ధవ్ ఠాక్రే(59) గురువారం సాయంత్రం 6.40 గంటలకు మహారాష్ట్ర 17వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రతి విజయ దశమి రోజున శివసేన వ్యవస్థాపకుడు బాల్ ఠాక్రే సందేశం వినిపించే 'శివాజీ పార్కు'లో అంగరంగ వైభవంగా ప్రమా

హై టెన్షన్ వైర్లలో విమానం

విద్యుత్ తీగల్లో గాలిపటాలు, పక్షులు చిక్కుకు పోవడం సర్వసాధారణం. కానీ అమెరికాలోని మిన్నెసోటా రాష్ట్రం స్కాట్ కౌంటీ పరిధిలో ఏకంగా విమానమే హైటెన్షన్ విద్యుత్ తీగల్లో చిక్కుకుంది. పరిసర ప్రాంత ప్రజలు అందించిన సమాచారంతో వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. పైలట్ థామస్ కొస్కోవిచ్ ప్రాణాలతో బయటపడ్డాడు. విమానం అకస్మాత్తుగా అదుపుతప్పి కిందకు దిగడం వల్లే ఇలా జరిగిందని పైలట్ చెప్పాడు.



మెదడులో వందలాది పురుగులు!

జెజియాంగ్, నవంబరు 27: తలనొప్పి, మూర్ఛవ్యాధితో ఆస్పత్రికి వెళ్లిన ఓ రోగికి స్కానింగ్ చేసిన వైద్యులు షాకయ్యారు. రోగి మెదడు, ఛాతిలో 700కు పైగా టేప్‌వార్మ్‌లు(వానపాములాంటి పురుగులు) కనిపించాయి. చైనాకు చెందిన జు జోంగ్పా అనే వ్యక్తి నెల క్రితం పంది మాంసం తిన్నాడు. అప్పటి నుంచి అతనికి తలనొప్పి, మూర్ఛ ప్రారంభమయ్యాయి. మొదటగా వైద్యులకు కూడా దీనికి కారణం ఏమిటనేది తెలియలేదు. స్కానింగ్ చేస్తే అసలు విషయం తెలిసింది. ఉడకని మాంసం తినడం వల్లే జోంగ్పాకు ఇలా జరిగిందని వైద్యులు గుర్తించారు.

ఇదిగో.. కుక్కల ముత్తాత

ఇది 18వేల ఏళ్ల కిందటి మంచుయుగం నాటి కుక్క. కళేబరం. రష్యాలోని సైబీరియా ప్రాంతంలో మంచురాళుల కింద లభ్యమైంది. దీనికి డోగర్ అని శాస్త్రవేత్తలు పేరుపెట్టారు. అతిశీతల వాతావరణంలో ఉండటంతో దాని శరీరంలోని పలు భాగాలు నేటికీ కుళ్లిపోలేదు. ఇది తోడేళ్లు, నక్కలకు మధ్యస్థమైన జాతికి చెందిందట!! స్వీడన్ శాస్త్రవేత్తలు నిర్వహించిన డీఎన్ఏ పరీక్షల్లో ఇది మగ కుక్కేనని తేలింది. రెండేళ్ల వయసులో అది మరణించిందని గుర్తించారు.

జయహో ఇస్రో!

'విజయాశ్వం' మరో అద్భుత విక్టరీ

పీఎస్ఎల్వీ-సీ47 ప్రయోగం సక్సెస్.. 17 నిమిషాల్లోనే కక్ష్యలోకి కార్టోశాట్-3

- 13 విదేశీ నానో ఉపగ్రహాలు కూడా
- 27 నిమిషాల్లోనే ముగిసిన ప్రక్రియ
- ఇస్రో ఖాతాలో మరో అద్భుత విజయం

శ్రీహరికోట (సూళ్లూరుపేట), నవంబరు 27: భారత సరిహద్దుల నిఘానేత్రం కార్టోశాట్-3 విజయవంతంగా కక్ష్యలోకి అడుగుపెట్టింది. పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి బుధవారం ఉదయం 9.28 గంటలకు ఇస్రో విజయాశ్వం పీఎస్ఎల్వీ-సీ47 రాకెట్ స్వదేశీ కార్టోశాట్-3తోపాటు అమెరికాకు చెందిన 12 ఫ్లోప్-4పీ నానో ఉపగ్రహాలు, మరో మెస్‌బెడ్ ఉపగ్రహాన్ని రోదసీలోకి తీసుకెళ్లి కక్ష్యలోకి వదిలింది. ఈ ప్రయోగంతో మొత్తం 14 ఉపగ్రహాలను రోదసీలోకి చేర్చిన పీఎస్ఎల్వీ 47వ విజయాన్ని సొంతంచేసుకుంది.

కార్టోశాట్ -3 ఉపగ్రహం

ప్రయోగం సాగిందిలా..

- మంగళవారం ఉదయం 7:28 గంటలకు ప్రారంభమైన 26 గంటల కౌంట్‌డౌన్ బుధవారం ఉదయం 9:28 గంటలకు ముగిసింది.
- కౌంట్‌డౌన్ ముగియగానే రెండో వేదికపై పీఎస్ఎల్వీ-సీ47 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లింది.
- 17.38 నిమిషాలకు 509 కి.మీ ఎత్తుకు చేరగానే అడాప్టర్ నుంచి కార్టోశాట్-3 ఉపగ్రహం విడిపోయింది. అలా భూమధ్య రేఖకు 97.5 డిగ్రీల వాలులో సూర్య సమస్థితి కక్ష్యలో ఈ ఉపగ్రహం స్థిరపడింది.
- మిగిలిన 13 విదేశీ నానో ఉపగ్రహాలతో ఉన్న అడాప్టర్ ముందుకు వెళ్తుండగా 516 కి.మీ. ఎత్తులో మెస్‌బెడ్ ఉపగ్రహం విడిపోయింది.
- 26.56 నిమిషాలకు 527 కి.మీ.లోపు ఎత్తులో 12 ఫ్లోప్-4పీ ఉపగ్రహాలు పావురాళ్లలా ఒకదాని వెనుక ఒకటివిడిపోయాయి.
- అప్పటి వరకూ షార్‌లోని మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఉత్కంఠగా చూస్తున్న ఇస్రో చైర్మన్ కె శివన్ లేచి ప్రయోగం విజయవంతమైందని ప్రకటించారు.

కార్టోశాట్ ఏం చేస్తుందంటే..

- కార్టోశాట్-3 దేశ రక్షణ రంగానికి నిఘా నేత్రంగా ఉపయోగపడనుంది.
- దీనిలో అమర్చిన హై రిజల్యూషన్ కెమెరా సరిహద్దుల్లో ఉగ్రవాద స్థావరాలను, వారి కదలికలను పసిగట్టి అత్యంత స్పష్టమైన చిత్రాలను అందిస్తుంది. అలాగే వాతావరణ స్థితిగతులను తెలియజేయడంతోపాటు మ్యాప్‌ల తయారీకి ఉపయోగపడనుంది. ఇది రోదసీలో ఐదేళ్లపాటు పనిచేస్తుంది.

మెస్‌బెడ్

- అమెరికాకు చెందిన అనలిటికల్ స్పేస్ ఇంక్ సంస్థ దీన్ని తయారుచేసింది. ఉపగ్రహం అందించే డేటాను వివిధ దేశాల్లోని కంపెనీలకు ఈ సంస్థ విక్రయించనుంది.

ఫ్లోప్-4పీ..

- అమెరికాలోని ప్లానెట్‌ల్యాబ్ ఈ ఉపగ్రహాన్ని తయారుచేసింది. 5 కిలోల బరువుండే వీటిని డవ్ (పావురాలు) ఉపగ్రహాలని పిలుస్తారు. ఈ సంస్థ ఇప్పటి వరకు మన దేశం నుంచి 92 డవ్ ఉపగ్రహాలను ప్రయోగించగా, 66 పనిచేస్తున్నాయి. ప్రస్తుతం 12 ఫ్లోప్-4పీ ఉపగ్రహాలను రోదసిలోకి ఇస్రో ప్రవేశపెట్టింది.

నిప్పులుచిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్తున్న పీఎస్ఎల్వీ-సీ 47

రాకెట్ పేరు
పీఎస్ఎల్వీ-సీ47

ఎత్తు	44.4 మీటర్లు
చేరవేసిన ఉపగ్రహాలు	14
స్వదేశీ కార్టోశాట్ -3	
బరువు	1625 కిలోలు
జీవితకాలం	5 ఏళ్లు
అమెరికా మెస్‌బెడ్ ఉపగ్రహం	
అమెరికా ఫ్లోప్-4పీ ఉపగ్రహాలు	12
ప్రయోగ ఖర్చు	300 కోట్లు
రాకెట్ తయారీకి	100 కోట్లు
కార్టోశాట్-3 తయారీకి	200 కోట్లు



మెస్‌బెడ్ ఉపగ్రహం

అవును.. విక్రమ్ కూలింది

రెండు నెలల క్రితం ఇస్రో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-2 ప్రయోగం చివరి నిమిషంలో విఫలమైంది. ఆర్బిటర్ నుంచి బయటకు వచ్చిన విక్రమ్ ల్యాండర్ మరికొద్ది సేపట్లో చంద్రునిపై దిగుతుందనగా ఇస్రోతో సంబంధాలు కోల్పోయింది. 'ల్యాండర్‌తో సంబంధాలు తెగిపోయాయి. డేటాను విశ్లేషిస్తున్నాం' అని ఇస్రో చెప్పింది తప్ప మరిన్ని వివరాలు వెల్లడించలేదు. ఈ ప్రయోగం జరిగిన రెండు నెలలకు భారత ప్రభుత్వం.. విక్రమ్ ల్యాండర్ కుప్పకూలిపోయిందని అంగీకరించింది. పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఒక ఎంపీ లేవనెత్తిన ప్రశ్నకు.. 'విక్రమ్ ల్యాండర్‌లోని బ్రేకింగ్ థ్రస్టర్లు పనిచేయలేదు. దీంతో అది అదుపుతప్పి 500 మీటర్ల ఎత్తు నుంచి చంద్రునిపై కుప్పకూలింది' అని అంతరిక్ష శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు.

మార్చిలోగా 7ఉపగ్రహాలు

2020 మార్చిలోగా 6 రాకెట్లతో 7 ఉపగ్రహాలను రోదసిలోకి ప్రయోగిస్తామని ఇస్రో చైర్మన్ డాక్టర్ శివన్ ప్రకటించారు. బుధవారం పీఎస్ఎల్వీ-సీ47 ప్రయోగ విజయానంతరం ఆయన షార్ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి మాట్లాడారు. కార్టోశాట్-3 హైరిజల్యూషన్ స్పేస్ క్రాఫ్ట్ అని, అత్యంత స్పష్టమైన భూ చిత్రాలను ఇది అందిస్తుందని చెప్పారు. పీఎస్ఎల్వీ-సీ47 అత్యంత సునాయాసంగా 14 ఉపగ్రహాలను కక్ష్యలోకి చేరవేసి తన విశ్వసనీయతను మరోమారు చాటుకుందని ఆయన అన్నారు. కాగా పీఎస్ఎల్వీ-సీ47 ప్రయోగంతో 300 విదేశీ ఉపగ్రహాల కక్ష్యలోకి చేరవేసి అరుదైన ఘనతను ఇస్రో సొంతం చేసుకుంది.

దేశం గర్విస్తోంది: మోదీ

పీఎస్ఎల్వీ-సీ47 ద్వారా ప్రయోగించిన కార్టోశాట్-3 ఉపగ్రహ ప్రయోగాన్ని విజయవంతం చేసిన ఇస్రో బృందాన్ని ప్రధాని మోదీ ట్విటర్ వేదికగా అభినందించారు. మరోసారి దేశం గర్వించేలా చేసిన ఇస్రో టీమ్‌కు అభినందనలు అని మోదీ ట్వీట్ చేశారు. పీఎస్ఎల్‌వీ సీ47 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలను ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందించారు. ఇది ఇస్రో సాధించిన మరో అద్భుత విజయమని కొనియాడారు. కార్టోశాట్-3 ప్రయోగాన్ని విజయవంతం చేసిన శాస్త్రవేత్తలను టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు అభినందించారు. మన సాంకేతిక నైపుణ్యాన్ని ప్రపంచ దేశాలకు చాటారంటూ కొనియాడారు. ఈ ప్రయోగం సక్సెస్ కావడం పట్ల బీజేపీ ఏపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ హర్షం వ్యక్తం చేస్తూ ఇస్రోను అభినందించారు.

మాజీ నేవీ చీఫ్ సుశీల్‌కుమార్ కన్నుమూత

న్యూఢిల్లీ, నవంబరు 27: భారత నావికాదళ మాజీ అధిపతి అడ్మిరల్ సుశీల్ కుమార్(79) బుధవారం ఉదయం ఢిల్లీలో కన్నుమూశారు. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో నావికా దళానికి నేతృత్వం వహించిన ఆయన అనారోగ్యంతో గత కొంతకాలంగా ఇక్కడి సైనిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సుశీల్ 1998- 2001 వరకూ నేవీ చీఫ్‌గా వ్యవహరించారు. 1965, 1975లో పాక్‌తో జరిగిన యుద్ధాల్లో నావికాదళం తరపున సేవలు అందించారు. పార్లమెంట్‌పై ఉగ్రదాడి జరిగిన సమయంలో నిర్వహించిన ఆపరేషన్ పరాక్రమ్‌లో త్రివిధ దళాధిపతులతో కూడిన చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ(సీఓఎస్‌సీ)కి చైర్మన్‌గా సేవలు అందించారు. కాగా, సుశీల్ మృతిపై ప్రధాని మోదీ సంతాపం ప్రకటించారు. దేశ తీర ప్రాంత భద్రతను బలోపేతం చేయడంలో ఆయన కృషిని కొనియాడారు.

డిజిటల్ మీడియాకూ ఆర్ఎన్ఐ రిజిస్ట్రేషన్!

న్యూఢిల్లీ, నవంబరు 27: వార్తా వెబ్‌సైట్ల రిజిస్ట్రేషన్ ఇకపై తప్పనిసరి. రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఆఫ్ ఇండియా(ఆర్ఎన్ఐ) కింద డిజిటల్ మీడియా నమోదుకు సంబంధించి కేంద్రం ఓ బిల్లు తీసుకురానుంది. బ్రిటిష్ కాలం నాటి చట్టం రిజిస్ట్రేషన్ ఆఫ్ ప్రెస్ అండ్ బుక్స్(పీఆర్‌బీ) స్థానంలో రిజిస్ట్రేషన్ ఆఫ్ ప్రెస్ అండ్ పీరియాడికల్స్(ఆర్పీపీ) బిల్లు 2019 ను కేంద్ర సమాచార, ప్రసార శాఖ రూపొందిస్తోంది.

డిసెంబరు 2 నుంచి 'నీట్' నమోదు ప్రక్రియ

న్యూఢిల్లీ, నవంబరు 27: వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) నమోదు ప్రక్రియ డిసెంబరు 2న ప్రారంభం కానుంది. నీట్‌ను దేశవ్యాప్తంగా వచ్చే ఏడాది మార్చి 3న జాతీయ పరీక్షా సంస్థ (ఎన్‌టీఏ) నిర్వహించనుంది. విదేశాల్లో మెడిసిన్ చదవాలనుకుంటున్న విద్యార్థులు సైతం నీట్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సిందే.

'సూపర్ 30' ఆనంద్‌కు రూ.50వేల జరిమానా

గువాహటి, నవంబరు 27: ఐఐటీ జేఈఈ ప్రవేశ పరీక్షల శిక్షణా సంస్థ 'సూపర్ 30' నిర్వాహకుడు ఆనంద్ కుమార్‌కు గువాహటి హైకోర్టు రూ.50వేల జరిమానా విధించింది. 'సూపర్ 30' బూటకమంటూ గువాహటి ఐదుగురు ఐఐటీ గువాహటి విద్యార్థులు గతంలో పిటిషన్ దాఖలు చేశారు. మొదటి నుంచీ విచారణకు గైర్హాజరవుతున్న ఆనంద్.. నవంబరు 26న కూడా విచారణకు రాకపోవడంతో కోర్టు జరిమానా విధించింది. గురువారం(28న) విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించింది.

తమ్మినేనిపై పోలీసులకు పద్మశ్రీ ఫిర్యాదు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): "మహిళల మనోభావాలు దెబ్బతీసిన సభాపతి తమ్మినేని సీతారాంపై చట్టరీత్యా చర్యలు తీసుకోండి" అంటూ విజయవాడ పోలీసు కమిషనర్‌ను కోరుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో స్పీకర్ తమ్మినేని సీతారాం మీడియాతో మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబును దూషించే పనిలో భాగంగా సోనియాగాంధీతో కలసి లం...త్వానికి పాల్పడ్డారని అనడం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా తనకు తీవ్ర మనస్తాపానికి గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అసభ్య పదజాలం ఉపయోగించడం చట్టరీత్యా నేరమని తెలియని నేత స్పీకర్‌గా ఉండడం దురదృష్టకరమని ఆమె అన్నారు. సభాపతి ఉపయోగించిన పదజాలం రాష్ట్రంలోని మహిళలందరినీ కించపరచేవిగ ఉన్నాయన్నారు.

సేవ్ వైసీపీ.. హిందూపురంలో భారీ సమావేశం

హిందూపురం, నవంబరు 27: అనంతపురం జిల్లా హిందూపురం నియోజకవర్గం వైసీపీలో వర్గ విభేదాలు బహిర్గతమయ్యాయి. బుధవారం సేవ్ వైసీపీ పేరుతో హిందూపురంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సమావేశం నిర్వహించారు. పార్టీ కోసం, పార్టీ గెలుపు కోసం నిజంగా కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరగాలంటూ సమావేశానికి వచ్చిన నేతలు, కార్యకర్తలు గొంతెత్తారు. ఐదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండి ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ, పార్టీ అభివృద్ధికి కృషి చేశామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఎన్ని కేసులు పెట్టినా, కుటుంబాలకు నెలల తరబడి దూరంగా బతికినా విశ్వాసాన్ని కోల్పోలేదని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత తమను పట్టించుకోకుండా టీడీపీ నుంచి వచ్చిన ఇతర పార్టీల వారికి, కమీషన్‌లు ఇచ్చేవారికే ప్రాధాన్యత ఇస్తున్నారంటూ మండిపడ్డారు. హిందూపురంలో పార్టీ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ తన పంచన చేరిన కోటరీతో పనులు చేస్తున్నారని విమర్శించారు.

మే తరువాత హోదా అడగలేదు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): "ప్రత్యేక హోదా అంశంపై మే నెల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని అడగలేదు. మే నెలలో మాత్రం ప్రత్యేక హోదా కోసం ఒక విజ్ఞాపన ఆంధ్ర నుంచి వచ్చింది. అదే చివరిది" అని లోక్‌సభ సచివాలయం పేర్కొంది. వైకాపా ఎంపీ వంగా గీత అడిగిన ప్రశ్నకు సచివాలయం స్పందించింది. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మే 30న ప్రమాణస్వీకారం చేసింది. అంతకుముందు ప్రత్యేక హోదాపై వచ్చిన వినతే చివరిదని లోక్‌సభ సచివాలయం ఇచ్చిన సమాధానంలో పేర్కొంది. ఆ చివరి వినతిని 15వ ఆర్థిక సంఘానికి పంపించామని పేర్కొంది. అయితే 14వ ఆర్థిక సంఘం సాధారణ రాష్ట్రానికి, ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రానికి తేడాయే లేదని చెప్పిందని, దీంతో ప్రత్యేక హోదా అంశం ముగిసినట్లేనని పేర్కొంది. కానీ నీతి ఆయోగ్ నివేదికలో పేర్కొన్న పునర్విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రత్యేక సాయం అందించే అంశాన్ని ఆమోదించినట్లు తెలిపింది.

6.83 లక్షల ఉద్యోగాలు ఖాళీ

- పదవీ విరమణ వయసు తగ్గించే యోచన లేదు: కేంద్రం

న్యూఢిల్లీ, నవంబరు 27 : వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 6.83 లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ లోక్‌సభలో వెల్లడించారు. కేంద్రం మంజూరుచేసిన 38,02,779 పోస్టుల్లో 31,18,956 ఖాళీలను 2018 మార్చి. 1 నాటికే భర్తీ చేసినట్లు ప్రకటించారు. కాగా ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 58 ఏళ్లకు తగ్గించాలనే యోచన లేదని తెలిపారు.

శాఖల వారీగా ఖాళీలు	
రైల్వే	2,59,369
రక్షణ	1,87,054
హోం	72,365

దక్షిణాదిలో రెండో రాజధాని యోచన లేదు : హోంశాఖ

దక్షిణ భారత్‌లో దేశ రెండో రాజధానిని ఏర్పాటు చేసే యోచనేదీ లేదని కేంద్ర ప్రభుత్వం రాజ్యసభకు స్పష్టం చేసింది. దీనిపై ఆంధ్రప్రదేశ్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు అడిగిన ఓ లిఖితపూర్వక ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద్ రాయ్ ఈ మేరకు సమాధానమిచ్చారు.

సమ్మె నోటీసు 14 రోజుల ముందే ఇవ్వాలి : కార్మికశాఖ

ఇకపై కార్మికులు, ఉద్యోగులు సమ్మెకు పోయే విషయాన్ని 14 రోజుల(2 వారాల) ముందే అధికారులకు నివేదించాల్సి ఉంటుంది. ఈ మేరకు కార్మిక చట్టాల్లో సవరణలు చేయనున్నట్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్ రాజ్యసభకు తెలిపారు.

గాడ్సే దేశభక్తుడు: ప్రజ్ఞా ఠాకూర్

న్యూఢిల్లీ, నవంబరు 27: మహాత్మా గాంధీని హత్య చేసిన గాడ్సేను బీజేపీ ఎంపీ ప్రజ్ఞాఠాకూర్ దేశభక్తుడిగా అభివర్ణించారు. లోక్‌సభలో స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూపు సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా ఆమె చేసిన ఈ వ్యాఖ్యతో ప్రతిపక్షాలు మండిపడ్డాయి.

హిందువుల వల్లే శాంతికి భగ్నం: రాజీవ్ ధవన్

న్యూఢిల్లీ, నవంబరు 27: "సమాజంలో హిందువుల వల్లే శాంతికి భంగం వాటిల్లుతోంది తప్ప ముస్లింల వల్ల ఎన్నడూ కాదు" అని సీనియర్ న్యాయవాది, అయోధ్య కేసులో ముస్లింల పక్షాన వాదించిన రాజీవ్ ధవన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై వివాదం చెలరేగడంతో ఆయన వివరణ ఇస్తూ.. 'నేను హిందువులు అన్నది ఆర్ఎస్ఎస్‌ను, సంఘ్ పరివార్‌ను ఉద్దేశించి..! హిందువులందరినీ ఉద్దేశించి కాదు" అని పేర్కొన్నారు.

సున్నీలు వద్దంటే ఆ భూమి మాకివ్వండి: షియా వక్ఫ్ బోర్డు

బాబ్రీ మసీదు కూల్చివేతకు ప్రత్యామ్నాయంగా కోర్టు తీర్పు మేరకు ఇవ్వదలిచిన ఐదెకరాల భూమిని ఒకవేళ సున్నీ వక్ఫ్‌బోర్డు తిరస్కరిస్తే, తమకు ఆ భూమిని కేటాయించాలని షియా వక్ఫ్‌బోర్డు కోరింది. "అయితే ఆ భూమిలో మేం మసీదు కట్టం.. అన్ని వర్గాల వారూ వాడుకునే రీతిలో ఓ పెద్ద ఆస్పత్రి నిర్మిస్తాం" అని షియా బోర్డు చైర్మన్ వసీమ్ రిజ్వీ తెలిపారు. కాగా, అయోధ్య తీర్పుపై డిసెంబరు 9 లోగా రివ్యూ పిటిషన్ వేస్తామని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు కార్యదర్శి జఫర్యాబ్ జిలానీ తెలిపారు.

దక్షిణ డిస్కం పూర్తిగా రాష్ట్ర పరిధిలోకి!

అమరావతి, తిరుపతి(ఆటోనగర్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్‌పీడీసీఎల్)ను పూర్తి స్థాయిలో రాష్ట్ర పరిధిలోకి తేవాలని నిపుణుల కమిటీ చేసిన సిఫారసులను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సంస్థ యాజమాన్యాన్ని ఆదేశిస్తూ ఇంధన శాఖ కార్యదర్శి నాగులపల్లి శ్రీకాంత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సిఫారసులను ఆమోదించడం వల్ల ఈ సంస్థ, దానికి సంబంధించిన ఆస్తులు, అప్పులు పూర్తిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందుతాయి. సంస్థ ఆస్తులు, అప్పులు అన్నీ ఏపీ పరిధిలోనే ఉన్నందువల్ల రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని కంపెనీల పునర్ వ్యవస్థీకరణ నిబంధనల పరిధిలోకి వెళ్లాల్సిన అవసరం లేదని నిపుణుల కమిటీ సూచించింది. దీనికి తెలంగాణ ప్రభుత్వ అనుమతి అవసరం లేదని కూడా ఈ కమిటీ తేల్చి చెప్పింది. ఇదే సంస్థ రూ.1500 కోట్ల రుణం తెచ్చుకోవడానికి అవసరమైన గ్యారంటీని ప్రభుత్వపరంగా ఇస్తూ మరో ఆదేశాన్ని కూడా ప్రభుత్వం వెలువరించింది.

ఇంజనీరింగ్ కాలేజీలపై.. తనిఖీల కొరడా

- 8 జిల్లాల్లోని 20 కాలేజీల్లో విస్తృత తనిఖీలు

అమరావతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వస్తున్నారో.. రావడంలేదో పట్టించుకునే నాథుడు లేడు. ఇంజనీరింగ్ విద్యార్థులకు బోధించే వారి విద్యా ప్రమాణాలతో పనిలేదు. విద్యార్థుల సంఖ్యకు అధ్యాపకుల సంఖ్యకు అసలు సంబంధమే లేదు. కేవలం ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసమే కాలేజీలు నిర్వహించడం.. ఇదీ రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల పరిస్థితి. ఎనిమిది జిల్లాల్లోని 20 ఇంజనీరింగ్ కాలేజీలపై బుధవారం ఒక్కరోజే ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చేపట్టిన తనిఖీల్లో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. మంగళవారం అర్ధరాత్రి అత్యంత గోప్యంగా 14 తనిఖీ బృందాలను ఏర్పాటు చేసిన కమిషన్ బుధవారం తెల్లారేసరికి ఈ బృందాలను రంగంలోకి దింపేసింది. ఒక్కో టీమ్‌లో ఒక ఆడిటర్, ఇద్దరు ప్రొఫెసర్లను నియమించారు. బుధవారం ఉదయం ఎంపిక చేసిన ఇంజనీరింగ్ కాలేజీలకు ఆయా కమిటీలు చేరుకుని తనిఖీలు చేపట్టాయి. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) నిబంధనల మేరకు కళాశాలలు పనిచేస్తున్నాయా? విద్యార్థులు, అధ్యాపకుల నిష్పత్తి ఎలా ఉంది? వారికి వసతులు ఉన్నాయా? ల్యాబులు ఎలా ఉన్నాయి? వంటి పలు విషయాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఆకస్మిక తనిఖీలతో కళాశాలల యాజమాన్యాలు ఉక్కిరిబిక్కిరి అయ్యాయి. కాగా, ఈ తనిఖీలు మరిన్ని జరుగుతాయని కమిషన్ పేర్కొంది.

అడుగడుగునా ఉల్లంఘనలే

ఇంజనీరింగ్ కళాశాలల్లో బుధవారం జరిగిన ఆకస్మిక తనిఖీల్లో అడుగడుగునా నిబంధనల ఉల్లంఘనలు బయట పడినట్టు తెలిసింది. కేవలం ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసమే పలు ఇంజనీరింగ్ కళాశాలలు నడుస్తున్నాయి. విద్యార్థుల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా ముందుగా సర్టిఫికెట్లు తీసుకుని అడ్మిషన్లు ఇస్తున్నాయి. ఒకే యాజమాన్యానికి చెందిన గ్రూపు విద్యా సంస్థల్లో ఉల్లంఘనలు ఎక్కువగా ఉన్నాయి. ఒకే ప్రాంగణంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, బీఈడీ కోర్సుల నిర్వహణ. ఇది నిబంధనలకు పూర్తి వ్యతిరేకం. బీటెక్ కోర్సులో విద్యార్థులు, అధ్యాపకుల నిష్పత్తికి చెల్లుచీటి. ఇంజనీరింగ్ కాలేజీల్లోని ప్రతి బ్రాంచ్‌లో ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, ఆరుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలి. అయితే, చాలా కాలేజీల్లో సగం మంది కూడా లేరు. అర్హత లేని ప్రొఫెసర్‌లతో క్లాసులు. పీహెచ్‌డీ లేని వారూ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లుగా చలామణి. కనీసం ఎంటెక్ కూడా చేయనివారే.. బీటెక్ విద్యార్థులకు గురువులుగా నియామకం. విజయవాడ సమీపంలోని కాలేజీలో 180 మంది అధ్యాపకులు ఉండాలి. కానీ, 20 మందితో లాగించేస్తున్నారు. ల్యాబ్స్‌లో బూజు పట్టిన ఎక్విప్‌మెంట్లు.

తనిఖీలు ఈ కాలేజీల్లోనే

కేవీ సుబ్బారెడ్డి(కర్నూలు), శ్రీవేంకటేశ్వర(నెల్లూరు), మిట్స్(మదనపల్లి), ప్రియదర్శిని(గుంటూరు), సెయింట్ జోసెఫ్ గ్రూప్ కాలేజీలు (గుంటూరు), నోవా గ్రూప్ కాలేజీలు (విజయవాడ), ధనేకుల(విజయవాడ), కైట్ గ్రూప్ కాలేజీలు (కాకినాడ), గోకుల్(విజయనగరం), చదలవాడ(చిత్తూరు)

నేనేమైనా బిల్లానా? రంగానా?

- కార్తికి తండ్రినైనందుకే ఇన్నాళ్లు జైలా?
- సుప్రీంలో ప్రశ్నించిన చిదంబరం
- మరో 11 రోజుల కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ, నవంబరు 27: కాంగ్రెస్ దిగ్గజం, కేంద్ర మాజీ మంత్రి చిదంబరంను దర్యాప్తు సంస్థలు నిర్బంధంలోకి తీసుకుని వంద రోజులు గడిచాయి. మరో 11 రోజుల పాటు ఆయనను కస్టడీలోనే ఉంచేందుకు ఢిల్లీలోని ప్రత్యేక కోర్టు బుధవారం అనుమతినిచ్చింది. ఈ చెరలో ఎన్నాళ్లు గడపాలని చిదంబరం సుప్రీంకోర్టులో వేసిన బెయిల్ పిటిషన్‌లో ప్రశ్నించారు. " నన్ను విడుదల చేస్తే అది జాతికి తప్పుడు సంకేతాలను పంపుతుందని ఢిల్లీ హైకోర్టు పేర్కొంది. నేనేమైనా బిల్లా, రంగాల్లాంటి నేరస్తుణ్నా? కార్తి చిదంబరానికి తండ్రిని అయినందుకు ఇన్నాళ్లు అక్రమంగా నిర్బంధిస్తారా? నాపై మోపిన అభియోగాల్లో ఒక్క దానికైనా సాక్ష్యాధారాలున్నాయా?" అని ధర్మాసనం ముందు ప్రశ్నించారు. చిదంబరం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు. ఐఎన్ఎక్స్ మీడియా కుంభకోణం కేసులో ఆగస్టు 21న సీబీఐ ఆయనను అరెస్టు చేసింది. 1978లో ఓ నౌకాదళ అధికారి పిల్లలైన గీతా చోప్రా, సంజయ్ చోప్రాలను కిడ్నాప్ చేసి దారుణంగా హత్య చేసిన బిల్లా రంగాల కేసు దేశంలో సంచలనం రేపింది. క

గవర్నర్‌గా మురళీధరన్!

కొలంబో: శ్రీలంక స్పిన్ దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ కొత్త ఇన్నింగ్స్ మొదలుపెట్టనున్నాడు. తమిళుల ఆధిపత్యం ఎక్కువగా ఉండే నార్తర్న్ ప్రావిన్స్ రాష్ట్రానికి 47 ఏళ్ల మురళీధరన్‌ను గవర్నర్‌గా నియమించాలని ఆ దేశ అధ్యక్షుడు గొటబాయ రాజపక్స నిర్ణయించారు. ఇప్పటికే అతడిని ప్రత్యేకంగా ఆహ్వానించి గవర్నర్ పదవి స్వీకరించాలంటూ రాజపక్స కోరినట్టు తెలిసింది.

జనవరి వరకు.. నన్నేమీ అడగొద్దు

పునరాగమనంపై ధోనీ

ముంబై: క్రికెట్‌లో పునరాగమనంపై ధోనీ ఎట్టకేలకు నోరు విప్పాడు. ఈ విషయంపై వచ్చే జనవరిలో నిర్ణయం తీసుకుంటానని అన్నాడు. ఓ ఈవెంట్‌లో పాల్గొనేందుకు బుధవారం ముంబై వచ్చిన మహీని.. మైదానంలో నిన్ను తిరిగి ఎప్పుడు చూడొచ్చని విలేకరులు ప్రశ్నించారు. అందుకు ధోనీ స్పందిస్తూ.. 'జనవరీ తక్ మత్ పూఛో (జనవరి వరకు ఏమీ అడగొద్దు)' అని అన్నాడు. కాగా.. వచ్చే ఐపీఎల్ తర్వాత తన రిటైర్మెంట్‌పై ధోనీ నిర్ణయం తీసుకుంటాడని మహీ అత్యంత సన్నిహితుడొకరు మంగళవారం వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది జూలైలో జరిగిన వన్డే ప్రపంచకప్ తర్వాత క్రికెట్‌కు ధోనీ దూరంగా ఉంటున్నాడు.

ధోనీ, కోహ్లీతో.. నా సంబంధాలు భేష్: ఎమ్మెస్కే

మాజీ కెప్టెన్ ధోనీ, ప్రస్తుత సారథి విరాట్ కోహ్లీతో తన సంబంధాలు చక్కగా ఉన్నాయని సెలెక్షన్ కమిటీ చైర్మన్ ప్రసాద్ ఎమ్మెస్కే ప్రసాద్ తెలిపాడు. వారిద్దరికీ తానంటే ఎంతో గౌరవమన్నాడు. మేనేజ్‌మెంట్ విద్యనభసించిన తనకు వ్యక్తులతో ఎలా మసలుకోవాలో తెలుసునని అన్నాడు. 'చీఫ్ సెలెక్టర్‌గా లెజండరీ ఆటగాళ్ల సలహాలు తీసుకోవడం నాకు ఎంతో తోడ్పడింది. ధోనీ, కోహ్లీతో నా సంబంధాలు చెక్కు చెదరలేదు. ఎవరెలా అనుకున్నా..వారు నాకెంత గౌరవం ఇస్తారో నాకే తెలుసు' అని పేర్కొన్నాడు. 'నేను మేనేజ్‌మెంట్ విద్యార్థిని. క్రికెట్ డైరెక్టర్‌గా ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ)లో ఇంతకంటే పెద్ద సమస్యలను సమర్థంగా పరిష్కరించా' అని ఎమ్మెస్కే చెప్పుకొచ్చాడు.

స్వర్ణ జ్యోతి

కాంపౌండ్ మిక్స్‌డ్‌లో సురేఖ జోడీకి పసిడి

మహిళల టీమ్ ఈవెంట్‌లో రజతం

ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్

బ్యాంకాక్: ఈ సీజన్‌లో అద్భుతంగా రాణిస్తున్న తెలుగమ్మాయి, యువ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ మరోసారి అంతర్జాతీయ వేదికపై సత్తాచాటింది. ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో సహచర ఆటగాడు అభిషేక్ వర్మతో కలిసి సురేఖ మిక్స్‌డ్ కాంపౌండ్ పెయిర్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం కొల్లగొట్టింది. ఈ టోర్నీలో భారత ఆర్చర్లకు దక్కిన ఏకైక బంగారు పతకం జ్యోతి జోడీదే కావడం విశేషం. మిక్స్‌డ్‌లో స్వర్ణంతో మెరిసిన సురేఖ.. మహిళల టీమ్ ఈవెంట్‌లో రజతం సొంతం చేసుకొని టోర్నీని అత్యద్భుతంగా రెండు పతకాలతో ముగించింది. బుధవారం కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో జ్యోతి సురేఖ-అభిషేక్ వర్మ జోడీ 158-151 స్కోరు తేడాతో చైనీస్ తైపీ ద్వయం యి సువాన్ చెన్-చి లా చెన్‌పై గెలుపొంది పసిడి అందుకొంది. ఇక, మహిళల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ టైటిల్ నిలబెట్టుకోలేకపోయింది. ఫైనల్లో జ్యోతి సురేఖ-మస్కాన్ కిరార్-ప్రియా గుర్జార్ త్రయం 215-231 స్కోరు తేడాతో కొరియా చేతిలో ఓటమిపాలై రజత పతకంతో సరిపెట్టుకుంది. పురుషుల కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లోనూ ఫైనల్ చేరిన భారత్ ఓ పాయింట్ తేడాతో స్వర్ణాన్ని చేజార్చుకుంది. హోరాహోరీ టైటిల్‌ఫైట్‌లో అభిషేక్ వర్మ-రజత్ చౌహాన్-మోహన్ భరద్వాజ్‌లతో కూడిన భారత జట్టు 232-233 స్కోరు తేడాతో కొరియా జంట చేతిలో పోరాడి ఓడి రజతానికి పరిమితమైంది. దీంతో ఈ టోర్నీని భారత్ ఓ స్వర్ణం, రెండు రజతాలు, నాలుగు కాంస్యాలతో కలిపి మొత్తం ఏడు పతకాలతో ముగించింది.

హెచ్‌సీఏలో అసలేం జరుగుతోంది?

ఆటగాళ్ల ఎంపికకు డబ్బే కొలమానమా!

రాయుడి ట్వీట్లతో బట్టబయలైన హెచ్‌సీఏ బండారం

కత్తి మీద సాముగా మారిన అజరుద్దీన్ పరిస్థితి

ప్రతిభావంతుడై ఉండి కూడా హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) పెద్దల రాజకీయాలతో జట్టులో సరైన ప్రాతినిధ్యం దక్కక ఎంతోకాలం అనేక ఇబ్బందులు పడ్డాడు. హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడి కుమారుడు అర్జున్ యాదవ్‌తో మైదానంలో జరిగిన గొడవతో హైదరాబాద్ రంజీ జట్టుకే దూరమయ్యాడు. హెచ్‌సీఏ వ్యవస్థీకృత లోటుపాట్లను అత్యంత సమీపం నుంచి చూసిన బాధిత క్రికెటర్లలో ఒకడైన అంబటి తిరుపతి రాయుడు ఇటీవల ఆటగాళ్ల సెలెక్షన్‌పై బాహాటంగానే విమర్శలు గుప్పించి తాజా వివాదానికి కేంద్ర బిందువుగా మారాడు. దీంతో కొంతకాలంగా నివురుగప్పిన నిప్పులా ఉన్న హెచ్‌సీఏ రాజకీయాలు మరోసారి బట్టబయలయ్యాయి. ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

(ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి)

ఒకప్పుడు భారత జట్టుకు గొప్ప గొప్ప ఆటగాళ్లను అందించి ఖ్యాతి గడించిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఇప్పుడు అవినీతి, ఎంపికలలో అక్రమాలు, గ్రూపు తగాదాలతో తరచూ వార్తల్లోకి ఎక్కుతోంది. జాతీయ స్థాయిలో 2000 దశకం తర్వాత ఓ రేంజ్‌లో గుర్తింపు తెచ్చుకున్న తెలుగు క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు అసోసియేషన్‌లో పాతుకుపోయిన అవినీతి సమ్రాట్‌లపై ఒక్కసారిగా ట్విటర్ వేదికగా గళం విప్పాడు. అంబటి వ్యాఖ్యలను భారత మాజీ కెప్టెన్, హెచ్‌సీఏ ప్రస్తుత అధ్యక్షుడు అజరుద్దీన్ తేలికగా కొట్టిపారేసినా పలు క్రికెట్ క్లబ్‌ల ప్రతినిధులు, క్రీడారంగ ప్రముఖులు హెచ్‌సీఏను అవినీతి కూపం నుంచి బయటకి లాగాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. వరల్డ్‌కప్‌కు ముందు జట్టులో చోటు దక్కలేదని అనూహ్యంగా క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి.. తర్వాత ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని తిరిగి హైదరాబాద్ తరఫున రంజీల్లో ఆడుతున్న రాయుడు ఇప్పటికైనా హెచ్‌సీఏను సంస్కరించాలని అంటున్నాడు. 'హెచ్‌సీఏలో జరిగే అవినీతి వ్యవహారాలు అసోసియేషన్ ముఖ్యులకు తెలియనివి కావు. వీటికి ఎక్కడో ఒకచోట అడ్డుకట్ట వేయాలి. లేకపోతే ప్రతిభావంతులైన యువ క్రికెటర్లకు అన్యాయం జరుగుతూనే ఉంటుంది' అని రాయుడు ఇటీవల ట్వీట్ చేసిన తెలిసిందే. దీనికి దారి తీసిన పరిణామాలపై హెచ్‌సీఏ వర్గాల్లో విపరీతమైన చర్చ జరుగుతోంది. రాయుడికి వ్యతిరేక వర్గం అతడిని రంజీ జట్టు నుంచి సాగనంపడానికి పొగపెడుతోందని అభిప్రాయపడుతున్నారు. పేరుకు కెప్టెన్ అయినా టీమ్ ఎంపిక, తుది జట్టు కూర్పులో అతడి అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకోకుండా అడ్డదారిన ఎవరెవర్నో తీసుకొచ్చి ఆడిస్తుండడంతో రాయుడు తన ఆవేదన వ్యక్తం చేశాడని తెలుస్తోంది. ప్రస్తుత రంజీ కోచ్ అర్జున్ యాదవ్‌తో రాయుడికి పాత వైరం ఉంది. దీంతో హెచ్‌సీఏలో పట్టున్న కోచ్ వర్గం.. రాయుడుకు ఉచ్చు బిగుస్తోందని.. అతడిని ఏకాకి చేయాలని ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. కొందరి కబంధహస్తాల్లో నలిగిపోతున్న హెచ్‌సీఏను ప్రక్షాళన చేసి ప్రతిభ కలిగిన క్రికెటర్లను ప్రోత్సహించాలని గొంతెత్తిన రాయుడికి మద్దతు పెరగడం చూస్తుంటే హెచ్‌సీఏ అవినీతి ఏ స్థాయికి చేరుకుందో అర్థం చేసుకోవచ్చు.

అజర్‌కు సవాల్

రాయుడి ట్వీట్ నేపథ్యంలో.. ఇటీవల హెచ్‌సీఏ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అజరుద్దీన్‌కు సంఘంలోని వర్గాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం కత్తి మీద సామే. హెచ్‌సీఏకు అధ్యక్షులు వస్తున్నారు.. పోతున్నారు గానీ అందులో పాతుకుపోయిన కొందరు అవినీతిపరులను మాత్రం ఎవరూ కదిలించలేకపోతున్నారని క్రికెట్ క్లబ్‌లు వాపోతున్నాయి. దాంతో ప్రతిభ గల క్రికెటర్లకు అన్యాయం జరుగుతోందని ఆ క్లబ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. బోర్డు నిర్వహిస్తున్న లీగ్‌ల్లో నిలకడగా రాణిస్తూ మంచి ప్రదర్శన చేస్తున్న ఆటగాళ్లను పక్కనపెట్టి సూట్‌కేసులతో వస్తున్న వారికి రెడ్ కార్పెట్ పరుస్తున్నారన్న విమర్శలను హెచ్‌సీఏ చాలాకాలంగా ఎదుర్కోంటోంది. హెచ్‌సీఏ ఎన్నికల సమయంలో కూడా ఇండిపెండెంట్ ప్యానెల్‌గా పోటీ చేసిన ఓ వర్గం అసోసియేషన్‌లో జరుగుతున్న అవకతవకలపై ఘాటైన విమర్శలు చేసింది. మెజారిటీ క్లబ్‌లను గుప్పెట్లో పెట్టుకున్న రెండు వర్గాలు స్వప్రయోజనాల కోసం లాబీయింగ్ చేసుకుంటూ ప్రతిభావంతులకు అన్యాయం చేస్తోందని ఆరోపించింది. సిండికేట్‌గా ఏర్పడి అక్రమాలకు పాల్పడుతున్న ఆ లాబీయింగ్ బ్యాచ్‌కు ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఒక ముఖం కావాలని.. ఈసారి అజరుద్దీన్‌ను ముందు పెట్టి దందాలను కొనసాగిస్తున్నాయని ఆ క్లబ్ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారానికి ప్రస్తుత అధ్యక్షుడైన అజరుద్దీన్ చెక్ పెట్టాలని వారు కోరుతున్నారు. హెచ్‌సీఏ జూనియర్, సీనియర్ సెలెక్షన్ కమిటీలను సమూలంగా ప్రక్షాళన చేయాలని సూచిస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ కమిటీతో సంబంధం లేని, నిజాయతీ గల వ్యక్తులను సెలెక్టర్లుగా నియమించి హెచ్‌సీఏ అధ్యక్షుడు నేరుగా ఆటగాళ్ల ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అంబటి వ్యాఖ్యల్లో వాస్తవముంది!

'హెచ్‌సీఏ అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడం ఇది కొత్తేమీ కాదు. దీనిపై అధ్యక్షుడు అజర్ దృష్టి పెట్టాలి. ఆటగాళ్ల ఎంపికలో పారదర్శకత తీసుకురావాలి. అవినీతి ఆరోపణలు ఉన్న వారిని కార్యకలాపాలకు దూరంగా ఉంచాలి. అంబటి రాయుడు కష్టపడి ఎదిగిన క్రికెటర్. అతడి వ్యాఖ్యల్లో వాస్తవముంది. రాయుడి వ్యాఖ్యలపై హెచ్‌సీఏ పాలకులు సీరియస్‌గా దృష్టి సారించాలి' అని ఇటీవల హెచ్‌సీఏ అధ్యక్ష పదవికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీపడ్డ దిలీప్ అన్నారు.

రాయుడిపై చర్యలు

హెచ్‌సీఏను అగౌరవపరుస్తూ అంబటి రాయుడు చేసిన వ్యాఖ్యలపై దర్యాప్తు చేయిస్తాం. నివేదిక వచ్చిన తర్వాత నిబంధనల ప్రకారం అతడిపై చర్యలు తీసుకుంటాం.

- విజయానంద్ (హెచ్‌సీఏ కార్యదర్శి)

మా పిల్లల పేర్లతో నకిలీ అకౌంట్లు

ట్విటర్‌కు సచిన్ ఫిర్యాదు

ముంబై: తమ పిల్లలు అర్జున్, సారా ట్విటర్‌లో లేరని, వారిపేరిట చలామణి అవుతున్న అకౌంట్లు నకిలీవని సచిన్ టెండూల్కర్ స్పష్టం చేశాడు. అర్జున్ పేరిట ఉన్న ఆ నకిలీ అకౌంట్‌తో కొందరు వ్యక్తులు, సంస్థలపై బురదజల్లుతుండడం సచిన్ దృష్టికి వచ్చింది. ఆ విషయాన్ని ట్విటర్ ఇండియా దృష్టికి తీసుకెళ్లిన సచిన్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరాడు. వెంటనే స్పందించిన ఆ సంస్థ.. నకిలీ అకౌంట్‌ను సస్పెండ్ చేసింది. ఈ సందర్భంగా..తన కుమారుడు అర్జున్, కుమార్తె సారాకు ట్విటర్ అకౌంట్లు లేవని సచిన్ ప్రకటించాడు. అయితే ఏడాదిన్నరగా అర్జున్ పేరిట నకిలీ ఖాతా నడుస్తుండడం గమనార్హం. 2018 జూన్ నుంచి జూనియర్ టెండూల్కర్ పేరిట యాక్టివ్‌గా ఉన్న ఈ అకౌంట్ ప్రొఫైల్ పిక్చర్, కవర్ ఇమేజ్‌గా అర్జున్ ఫొటోను వాడుతున్నారు.

కార్న్‌వాల్ కమాల్

అఫ్ఘానిస్థాన్ 187 ఆలౌట్

విండీస్‌తో ఏకైక టెస్టు

రఖీమ్ కార్న్‌వాల్ (7/75)

లఖ్‌నవ్: అఫ్ఘానిస్థాన్‌తో ఏకైక టెస్టులో వెస్టిండీస్‌కు అదిరిపోయే ఆరంభం దక్కింది. ఆఫ్ స్పిన్నర్ రఖీమ్ కార్న్‌వాల్ (7/75) కెరీర్ బెస్ట్ బౌలింగ్‌తో చెలరేగడంతో అఫ్ఘానిస్థాన్ బ్యాటింగ్ లైనప్ కకావికలైంది. కార్న్‌వాల్ దెబ్బకు.. తొలి రోజైన బుధవారం అఫ్ఘాన్ 68.3 ఓవర్లలో 187 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ జావెద్ అహ్మది (39), అమీర్ హమ్జా (34), అఫ్సర్ జజాయ్ (32) టాప్ స్కోరర్లు. రహ్మత్ షా (4), అస్గర్ అఫ్ఘాన్ (4), నాసిర్ జమాల్ (2) సింగిల్ డిజిట్‌కే అవుటయ్యారు. జాసన్ హోల్డర్ 2 వికెట్లు తీయగా.. జోమెల్ వారికాన్‌కు ఒక వికెట్ దక్కింది. అనంతరం ఆట చివరకు విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్ల నష్టానికి 68 రన్స్ చేసింది. హోల్డర్ సేన మరో 119 పరుగుల వెనుకంజలో ఉంది. జాన్ క్యాంప్‌బెల్ (30 బ్యాటింగ్), బ్రూక్స్ (19 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అమీర్ హమ్జా, రషీద్ ఖాన్ చెరో వికెట్ తీశారు.

ఒడిశాలోనే మరోసారి ప్రపంచకప్ హాకీ

భువనేశ్వర్: పురుషుల వరల్డ్ కప్ హాకీకి మరోసారి ఒడిశా ఆతిథ్యమివ్వనుంది. 2023లో జరిగే ఈ మెగా టోర్నీకి భువనేశ్వర్, రూర్కెలా కలిసి ఆతిథ్యమిస్తాయని బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రకటించారు. 2018లో జరిగిన పురుషుల ప్రపంచకప్‌ను విజయవంతంగా నిర్వహించిన భువనేశ్వర్‌కు మరోసారి ఈ మెగా టోర్నీకి వేదిక కావడం విశేషం.

నార్త్‌ఈస్ట్‌తో ముంబై మ్యాచ్ డ్రా

గువాహటి: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో మరో డ్రా నమోదైంది. బుధవారం ఇక్కడ నార్త్‌ఈస్ట్ యునైటెడ్ ఎఫ్‌సీ, ముంబై సిటీ ఎఫ్‌సీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 2-2 గోల్స్‌తో డ్రాగా ముగిసింది. నార్త్‌ఈస్ట్ తరఫున పనాగియోటిస్ ట్రియాడిస్ (9వ నిమిషం), అసమా గ్యాన్ (42వ) చెరో గోల్ సాధించగా.. ముంబై జట్టులో రెండు గోల్స్‌ను అమినె చెర్మిటి (23వ, 32వ) చేశాడు.

సాత్విక్ జోడీకి షాక్

తొలిరౌండ్లో ఓడిన భారత స్టార్ జంట

శ్రీకాంత్, సాయి ప్రణీత్ ముందంజ

సయ్యద్ మోదీ బ్యాడ్మింటన్

లఖ్‌నవ్: వరుస అంతర్జాతీయ టోర్నీల్లో అద్భుత ప్రదర్శనతో అదరగొడుతున్న భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి సొంతగడ్డపై జరుగుతున్న ఈవెంట్‌లో మాత్రం నిరాశపరచింది. సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టోర్నీలో పురుషుల డబుల్స్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన సాత్విక్-చిరాగ్ జంట అనూహ్యంగా ఆరంభరౌండ్లోనే ఓటమిపాలైంది. బుధవారం జరిగిన డబుల్స్ మొదటి రౌండ్లో రెండోసీడ్ సాత్విక్ జంట 12-21, 21-23తో చైనా జోడీ డీ జి జియాన్-వాంగ్ చాంగ్ చేతిలో కంగుతిని టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఇక సింగిల్స్‌లో స్టార్లు కిడాంబి శ్రీకాంత్, సాయి ప్రణీత్, పారుపల్లి కశ్యప్‌సహా పలువురు భారత షట్లర్లు రెండోరౌండ్‌కు దూసుకెళ్లారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో మూడోసీడ్ శ్రీకాంత్ 21-12, 21-11తో వ్లాదిమిర్ మాల్కోవ్ (రష్యా)పై, సాయి ప్రణీత్ 21-16, 22-20తో ఇస్కందర్ జుల్కర్‌నైన్ (మలేసియా)పై, సిరిల్ వర్మ 12-21, 21-15, 21-3తో హువాంగ్ (చైనీస్ తైపీ)పై గెలిచారు. మొదటిరౌండ్లో ప్రత్యర్థుల నుంచి వాకోవర్ లభించడంతో కశ్యప్, యువ సంచలనం లక్ష్యసేన్ నేరుగా రెండోరౌండ్‌కు చేరారు. మహిళల సింగిల్స్‌లో అస్మిత 21-16, 21-16తో వృశాలిపై, రీతూపర్ణ దాస్ 21-19, 21-19తో యిప్ పూ యిన్ (హాంకాంగ్)పై, కరోలినా మారిన్ (స్పెయిన్) 21-16, 21-11తో లిండా జెచెరి (బల్గేరియా)పై నెగ్గి రెండోరౌండ్లో ప్రవేశించారు.

సంజూ వచ్చేశాడు!

గాయంతో ధవన్ అవుట్ ● వెస్టిండీస్‌తో టీ20 సిరీస్

న్యూఢిల్లీ: వెస్టిండీస్‌తో టీ20 సిరీస్ నుంచి ఓపెనర్ శిఖర్ ధవన్ వైదొలిగాడు. మోకాలి గాయంతో బాధపడుతున్న శిఖర్ స్థానంలో కేరళ యువ వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ సంజూ శాంసన్‌కు జట్టులో చోటు కల్పించారు. మహారాష్ట్రతో సూరత్‌లో జరిగిన ముస్తాక్ అలీ టోర్నీ మ్యాచ్ సందర్భంగా ధవన్ ఎడమ మోకాలికి తీవ్ర గాయమైంది. 'ధవన్ గాయాన్ని బీసీసీఐ వైద్య బృందం మంగళవారం అంచనా వేసింది. కుట్లు పూర్తిగా మానలేదని, అందుకు సమయం పడుతుందని వైద్యులు చెప్పారు. దాంతో వెస్టిండీస్‌తో టీ 20 సిరీస్‌కు సంజూ శాంసన్‌ను ఎంపిక చేస్తూ సెలెక్షన్ కమిటీ నిర్ణయం తీసుకుంది' అని బోర్డు బుధవారం ప్రకటించింది. వెస్టిండీస్‌తో మూడు టీ20లలో మొదటిది డిసెంబరు 6న హైదరాబాద్‌లో, రెండోది 8న తిరువనంతపురంలో, ఆఖరి మ్యాచ్ 11న ముంబైలో జరగనున్నాయి.

ఒక్క మ్యాచ్ కూడా ఆడించకుండానే..

బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌కు టీమిండియాలో స్థానం దక్కించుకున్న శాంసన్‌ను ఒక్క మ్యాచ్ కూడా ఆడించకుండా వేటు వేశారు. దాంతో సెలెక్షన్ కమిటీ తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. మాజీ ఆటగాళ్లు గంభీర్, హర్భజన్ సింగ్ అయితే సెలెక్టర్ల నిర్ణయాన్ని ఎండగట్టారు. సెలెక్టర్లు శాంసన్ హృదయాన్ని పరీక్షిస్తున్నారని కాంగ్రెస్ నేత శశి థరూర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇక 33 ఏళ్ల ధవన్ వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌నాటికి కోలుకుంటాడని భావిస్తున్నారు. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్ డిసెంబరు 15న చెన్నై వన్డేతో మొదలవనుంది. టెస్ట్ కీపర్ వృద్ధిమాన్ సాహాకు కూడా గాయమైంది. బంగ్లాదేశ్‌తో జరిగిన డే/నైట్ టెస్ట్‌లో కుడి ఉంగరం వేలికి గాయమవడంతో అతడు ముంబైలో శస్త్రచికిత్స చేయించుకున్నాడు.

భారత టీ20 జట్టు

కోహ్లీ (కెప్టెన్), రోహిత్ శర్మ (వైస్‌కెప్టెన్), కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్, మనీశ్ పాండే, రిషభ్ పంత్, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, జడేజా, చాహల్, కుల్దీప్, దీపక్ చాహర్, షమి, భువనేశ్వర్ కుమార్, సంజూ శాంసన్.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.